# లోకానికి నేనే వెలుగు

## క్రీస్తు నుండి ముక్తి
## మూఢత్వం నుండి విముక్తి



సంపుటి - 40 | అక్టోబర్ - డిసెంబర్ 2017 | సంచిక - 4

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం, హైదరాబాదు

**ప్రచురణ**
భక్త యోహాను ప్రాంతీయయ గురువిద్యాలయ ప్రచురణలు
రామాంతపురం, హైదరాబాదు.

**సంపాదక వర్గం**
ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్
ఫాదర్ నందిపాము జోజప్ప
ఫాదర్ కొమ్మారెడ్డి మర్రెడ్డి
ఫాదర్ పిల్లి అంతోని దాస్

**గురువిద్యార్థుల బృందం**
బ్రదర్ నల్ల సుధీర్ కుమార్
బ్రదర్ కుచ్చర్ల మార్టిన్
బ్రదర్ లింగతోటి రత్నకిషోర్
బ్రదర్ కత్తుల సునీల్ బాబు
బ్రదర్ అల్లం సాగర్ మనోజ్ కుమార్
బ్రదర్ మానూరి మార్కో
బ్రదర్ కల్లేపల్లి యేసుబాబు
బ్రదర్ సిగినం ప్రకాశ్
బ్రదర్ యానాద్రి బాలయేసు
బ్రదర్ సూరిపోగుల వినోద్ కుమార్

**చందా వివరములు**

సంవత్సరానికి మీ చందాను రూ. 100/- యం.ఓ., డి.డి..ల ద్వారా
St. John's Regional Seminary Society, Hyderabad
పేరున పంపించి మమ్మల్ని ప్రోత్సహించమనవి. అన్ని సంప్రదింపులకు
మరియు మీ విరాళము పంపవలసిన అడ్రస్ :

**St. John's Regional Seminary**
Ramanthapur, Hyderabad - 500 013.
Ph : 040-27201427, 27200370, Fax : 27209505
e-mail : stjohnshyd2@gmail.com

Printed at : holycrossprinters 9848145417

# లోకానికి నేనే వెలుగు

సంపుటి-40 అక్టోబర్ - డిసెంబర్ 2017 సంచిక-4

## క్రీస్తు నుండి ముక్తి
## మూఢత్వం నుండి విముక్తి

**ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్**
**ప్రధాన సంపాదకులు**

**ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి**
**సంచిక సంపాదకులు**

భక్త యోహాను ప్రచురణలు, భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
website : stjohnseminaryhyd.org

# విషయసూచిక

సంపాదకీయం

1. మూఢనమ్మకాలు – పురోగతికి ఆటంకాలు ................................ 9
   – బ్రదర్ జెరోమ్ ఇమ్మానువేలు లూయిస్
2. విగ్రహారాధన ................................ 18
   – బ్రదర్ బండి కిరణ్ కుమార్
3. దైవ దూషణం ................................ 26
   – బ్రదర్ తుమ్మా శరణ్ తేజ
4. పవిత్ర విషయాల దూషణం ................................ 34
   – బ్రదర్ ఏరువ బాల సుధీర్
5. భవిష్యవాణి – జాతకం ................................ 42
   – బ్రదర్ చింతగుంట్ల జగన్
6. లౌకికవాదం ................................ 50
   – బ్రదర్ పలిసెట్టి ఆనంద్ రావు
7. నాస్తికత్వం – అజ్ఞేయతావాదం ................................ 58
   – బ్రదర్ వడ్లపాటి మరియదాస్
8. వశీకరణం ................................ 68
   – బ్రదర్ నల్లా సుధీర్ కుమార్
9. భూతోచ్చాటనం ................................ 72
   – బ్రదర్ యందవ మత్యాస్
10. మంత్ర విద్య ................................ 83
   – బ్రదర్ కత్తుల సునీల్
11. చేతబడి ................................ 91
   – బ్రదర్ అల్లం సాగర్ మనోజ్ కుమార్
12. నిజదేవున్ని సంవిధానంలో పూజించుట ................................ 101
   – బ్రదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి

# సంపాదకీయం

**యెషయా 8:19-20**



ఏమేమో గొణుగుచూ విన్పించనట్లుగా మాటలాడు సోదెకాండ్రను, మాంత్రికులను సంప్రదింపుడని ప్రజలు మమ్ము మభ్యపెట్టుచున్నారు. మీరు భూతముల సందేశములు వినవలెననియు, బ్రతికియున్నవారిని గూర్చి మృతులను సంప్రదింపవలెననియు, వారు మీతో చెప్పుచున్నాను. కాని మీరు వారితో "మీరు ప్రభువు వాక్యములు వినుడు, భూతముల సందేశములు వినుట వలన మీకెట్టి ప్రయోజనము కలుగదని చెప్పవలెను".

**ద్వితీయోపదేశకాండము 18:9-13**

యావే మీకొసగిన దేశమున మీరు వసించునప్పుడు అచట జాతుల జుగుప్సాకరమైన ఆచారములను అనుసరింపవలదు. మీ బిడ్డలను అగ్నిలో దహనబలిగా అర్పింపరాదు. మీరు శకునములు చెప్పించుకొనకుడు. జ్యోతిష్కులను సంప్రదింపకుడు. చేతబడులు చేయింపకుడు. మంత్రతంత్రములు ఉపయోగించు కొనకుడు. మృతులను సంప్రదించి భూతములను ఆవాహనము చేయింపకుడు. ఇట్టి కార్యములు చేయువానిని ప్రభువు ఏవగించుకొనును. ఇట్టి హేయమైన పనులు చేయువారు కనుకనే వారు ప్రభువు అన్యజాతులను మీ చెంత నుండి వెళ్లగొట్టుచున్నాడు.

మీ మట్టుకు మీరు అతనిని పూర్ణముగా విశ్వసింపుడు. మన భారతదేశంలో ఎన్నో మతాలు, ఎన్నో నమ్మకాలు, ఎన్నో ఆచరణ పద్ధతులు పాటిస్తున్నారు. దేవుడు అంటే భయపడేవారున్నారు. భక్తితో పరవశమొందే వారున్నారు. మత విశ్వాసాన్నీ, అంశాలను, విలువలను బోధించేవారున్నారు. ఈ మత గురువుల్లో భక్తిని, భయాన్ని ప్రోత్సహించేవారున్నారు. మత గురువుల్లో మత సిద్ధాంతాల ప్రకారం జీవించే ఆదర్శవంతులున్నారు. ఈ మతం పేరట భయం కలుగజేసే మత ద్రోహులున్నారు. అందుకే ప్రస్తుత కాలంలో ఏ మతంలో చూసినా దొంగ బాబాలనీ, అసత్యపు గురువులని, మతం పేరిట

మారణహోమాలను సృష్టించేవారు ఎందరో ఉన్నారు. మానవ సమస్యలకు, వ్యక్తిగత సమస్యలకు మతంలో పరిష్కారం దొరక్కపోతే, అజ్ఞానపరమైన, భావోద్వేగాలతో, భయంతో కూడిన వేరే ఆచరణ సిద్ధాంతాలను, అనైతిక సిద్ధాంతాలను ఆశ్రయించి మోసపోయే అమాయకులు ఎందరో ఉన్నారు. మానవున్ని అమాయకత్వాన్ని బలహీనతలను సొమ్ము చేసుకునేవారు చాలామంది నేటిసమాజంలో తారసపడతారు. ఇలా మూఢ నమ్మకాలకు బలైనవారిని విముక్తుల్ని చెయ్యాలని, మూఢ నమ్మకాలల్లో ఉన్న అనైతిక విషయాలను తెలియజేసే సంపుటే ఈ పుస్తకం. ఈ సంపుటి భక్తినీ, భయాన్ని వేరు చేసి, సత్యాన్ని గ్రహించి, నిజదేవున్ని సరైన రీతిలో పూజింపచేసే జ్ఞానం ఇచ్చే పుస్తకం ఈ సంపుటి.

బెరుకు, భయం, ఆందోళన వల్ల భక్తి కలుగవచ్చును. విశ్వాసం, నమ్మకం ద్వారా భక్తి, ఆరాధన, గౌరవపూర్వకంగా పూజించుట జనించవచ్చును. భయం ద్వారా వచ్చే భక్తి, మూఢనమ్మకాల మీద, తాంత్రిక భక్తి విధానాల మీద, క్షుద్రపూజల మీద ఆధారపడుతుంది. మనిషి ఎదుగుదలకు, పురోగతికి, అడ్డుగా నిలుస్తుంది. అదే విశ్వాసం వల్ల కలిగే భక్తి దేవుని సుగుణాల ప్రకారం జీవించేలా చేస్తుంది. మనిషిని దైవ, మానవ ప్రేమతో జీవించేలా దోహదపడుతుంది, చివరకు దైవంను చేరుకునేలా చేస్తుంది.

అన్ని మతాల్లోను ఈ మూఢనమ్మకాలకు తావు ఉంది. క్రైస్తవులమైన మనం అంతా దేవుడు సృష్టించారని నమ్మిన మనం, అన్ని రోజులూ, అన్ని సమయాలూ, అన్ని కోణాలలో దేవుని సృష్టిని దర్శించి కూడా మంచే అని విశ్వాసపూర్వకంగా నమ్మి కూడా ఏవైనా కార్యాలు వస్తే ఏది మంచి రోజు ఏది వాస్తు ప్రకారం, ఎప్పుడు నిర్మిస్తే అంతా బాగా జరుగుతుంది అని మత గురువుల్ని ఎంతమంది సంప్రదించటం లేదు? సమస్యల మీద సమస్యలు, జబ్బు మీద జబ్బు వస్తే ఎన్ని పూజలు చేసినా, ఎన్ని జపాలు చెప్పినా పరిష్కారం దొరక్కపోతే, ఎంతమంది మూఢనమ్మకాలకు బలి అవ్వటం లేదు? ఎంత మంది మంత్రగాల్లను ఆశ్రయించటం లేదు? ఎంతమంది తాయత్తులను కట్టుకోవటం లేదు? భవిష్యత్తు తెలుసుకోవాలని ఎంతమంది జ్యోతిష్కులని ఆశ్రయించి, పేరుతో, పుట్టిన తేదీల్లో అంకెలు, అక్షరాలు మార్చుకోవటం లేదు?

మనకు నిజమైన దేవుడు ఉన్నా, సరియైన పూజా విధానాలున్నా, భయం వల్ల, ఆందోళన వల్ల మూఢ విశ్వాస పద్ధతుల్ని ఆశ్రయిస్తున్నాము. ఈ మూఢ

విశ్వాసాలు, మంత్ర తంత్రాలు, జ్యోతిష్యాలు క్రైస్తవ విశ్వాసానికి, నైతిక విలువలకు జ్ఞానపరమైన విధానాలకు విరుద్ధమని ఈ సంపుటి తెలియజేస్తుంది.

ఈ సంపుటి విజయం వెనుక అనేకమంది శ్రమ ఉంది. మొట్టమొదటిగా మూడవ సంవత్సరపు గురు విద్యార్థులకు, మరియు రెండవ సంవత్సరపు గురువిద్యార్థులైన మనోజ్‌కి, మార్క్‌కి, మనోహర్‌కి నా కృతజ్ఞతలు. అచ్చుపరంగా, వేదాంతపరంగా దోషరహితంగా ఉండాలని నేను మరియు ఫాదర్ పసుపులేటి ఫ్రాన్సిస్‌గారు శ్రమను ధారపోసాము. ఫాదర్ ఫ్రాన్సిస్‌గారికి నా ప్రత్యేక కృతజ్ఞతలు. ఇక పాఠకులారా మీ అందరికి నా ప్రత్యేక వందనాలు. ఈ సంపుటిని పఠించి, మత విషయంలో భయాన్ని వీడి భక్తిని పెంచుకోండి. సరైన పూజా విధానాన్ని ఎంచుకోండి, నిజ దేవున్ని సరైన రీతిలో కొలిచే విశ్వాసం ద్వారా భక్తిని పెంచుకోండి. ఇక మూఢ విశ్వాసాలను, నమ్మకాలను వదిలివేయండి. బలమైన విశ్వాసాన్ని పెంచుకోండి.

ఇట్లు ప్రభు సేవలో...
**ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి**
సంచిక సంపాదకులు

# 1. మూఢనమ్మకాలు - పురోగతికి ఆటంకాలు

- బ్రదర్ జెరోమ్ ఇమ్మానువేలు లూయిస్

**ఉపోద్ఘాతము**



మనిషి జీవితం తాను నమ్మిన ఆచార వ్యవహారాలను బట్టి ఉంటుంది. నేటి విజ్ఞాన శాస్త్రం, సాంకేతిక పరిజ్ఞానం, విద్య వైద్య సదుపాయాలు మానవ అనుదిన జీవిత అభివృద్ధికి దోహదపడుతున్నప్పటికి, యింకా చాలామంది మూఢ నమ్మకాల, సాంఘిక దురాచారాల వలయంలో చిక్కుకొని, జీవిత ఔన్నత్యాన్ని ఆస్వాదించలేకపోతున్నారు. మూఢనమ్మకాలు అనగా తెలివితక్కువైన, బుద్ధివికాసానికి విరుద్ధమైన ఆచార వ్యవహారాలు. ఈలాంటివి సామాజిక జీవితమందును, మతాచరణమందును కనబడుతుంటాయి.

అప్పుడే జన్మించిన శిశువుకు ఎలాంటి నమ్మకాలు, ఆచారాలు తెలియవు, కాని ఎదిగే కొలది తల్లిదండ్రుల మనోభావాలు, వారి నమ్మకాలు, ఆచార వ్యవహారాలు బిడ్డను ప్రభావితం చేస్తాయి. కుటుంబంతో పాటు చుట్టూ ఉన్న సమాజం కూడా మూఢ నమ్మకాలకు పునాది వేస్తాయి. బుద్ధి విచక్షణతో నిమిత్తం లేకుండా గ్రుడ్డిగా ఆచరించే నమ్మకాలు దాదాపు అన్ని దేశాలలో ఉంటూనే ఉన్నాయి.

## 2. మూఢనమ్మకం యొక్క నిర్వచనం

మూఢనమ్మకం ఒక రకమైన దుర విశ్వాసం. ఒకవైపు మతంలో వున్న విశ్వాసం దేవుడుపట్ల భయము, నమ్మకం, ప్రేమ గౌరవం అనే సుగుణాలపై

ఆధారపడి ఉంటుంది. మరొకవైపు మూఢనమ్మకం అనేది అర్థములేని భయముపైన మరియు అజ్ఞానంపైన ఆధారపడి ఉంటుంది. కనుకనే, మతం అనేది మన జీవితాలకు, మన ఆధ్యాత్మికతకు, మన ఆత్మకు వెలుగై ఉన్న సందర్భములో మూఢనమ్మకాలు కేవలం చీకటి దాస్యములోనికి మనలను లాగుతాయి. అందుకనే, మూఢనమ్మకం అంటే ఏమీ అర్థం పర్థంలేని కారణాల వలన కొన్ని వస్తువులని, ఆలోచనలను, నమ్మకాలను గ్రుడ్డిగా, బలముగా నమ్మటం. తద్వారా, ఒక వ్యక్తి మూఢనమ్మకాలలో విశ్వాసాన్ని ఉంచుతున్నాడు అంటే తనలో దేవునిపట్ల సంపూర్ణమైన భక్తి, ప్రేమ లేకపోవటం అనేది నిశ్చయం, తథ్యం.

## 3. మన ప్రాంతంలో కొన్ని మూఢ నమ్మకాలు, దురాచారాలు

ఈనాటి మూఢనమ్మకాలు, దురాచారాలు మన ఆలోచనలను, క్రియలను, నిర్దేశిస్తూ మనలను నిరంతరం భయాందోళనలో జీవింప గురిచేస్తున్నాయి. ఈ ఆధునిక నవయుగ ప్రపంచంలో జరిగే ప్రతి యొక్క సహజ సిద్ధమైన సంఘటనలకు మన దగ్గర సాంకేతిక పరిజ్ఞానమైన జవాబులు ఉన్నాయి. అయినా మనం మూఢనమ్మకాలు, దురాచారాలు అనే ఈ ఊబిలో ఇంకా కొట్టుమిట్టాడుతూనే ఉన్నాము. ఈ అంశాన్ని నిరూపించుటకు మన ప్రాంతాలలోనే, మన మధ్యలోనే జరిగే కొన్ని మూఢనమ్మకాలు, దురాచారాల గురించి క్లుప్తముగా నేను వివరిస్తున్నాను.

- వర్షం కోసం కప్పలకు పెండ్లి చేయటం.
- గాడిదలను మేళతాళాలతో ఊరేగించడం.
- అర్థరాత్రివేళ స్త్రీలు నగ్నంగా పొలాల్లో నడవటం.
- భక్తిని చాటుకునేందుకు కన్ను ఊడబెరికి అర్పణగా యివ్వడం.
- అగ్నిమీద నడవడం.
- శరీరాన్ని గాయపరచడం, వీపుకు ఇనుప గొలుసులతో పొడిచి రథం లాగడం.
- పూనకం పట్టిన దేవతా ఆవేశంలో చిందులు వేస్తూ మేక గొంతును నోటితో తెగ నరికి రక్తం త్రాగడం.

- తప్పిపోయిన వ్యక్తులు ఆచూకీ కనుగొనుటకు సోదె చెప్పించుకోవడం.
- దొంగిలింపబడిన వస్తువులను, దొంగలను గురించి తెలిసికొనుటకు శకునాలు చెప్పించుకోవడం.
- ఉదయాన్నే ప్రయాణాన్ని మొదలుపెడుతున్నపుడు ఎవరైనా తుమ్మితే ప్రయాణాన్ని విరమించుకోవడం లేదా విధవరాలైన స్త్రీ ఎదురుగా వస్తే అశుభం లేదా నల్లపిల్లి ఎదురుగా వస్తే అశుభం జరుగుతుందని నమ్మడం.
- ఎన్నికలలో గెలవాలని లేదా ముఖ్యమంత్రి కావాలని లేదా మంత్రిపదవి రావాలని మోకాళ్ల మీద దేవాలయాలకు వెళ్లడం, వెయ్యి కొబ్బరి కాయలను కొట్టడం.
- దొంగిలించాడా లేదా అని నిర్ధారించుటకు బాగా వేడి చేసిన నూనెలో నిందితుని హస్తమును ముంచుట.
- శిరోముండనం చేయుట, నగ్నంగా ఊరేగించుట.
- మంగళవారం రోజున జుట్టు కత్తిరించుట అమంగళంగా ఎంచటం.
- శుక్రవారం రోజున డబ్బులు ఎవరికి యివ్వకూడదు మరియు బంగారం ఎవరికి యివ్వకూడదని చెప్పటం.
- 13వ అంకెను దురదృష్టంగా భావించటం.
- సాయంకాలం 6 తరువాత గోరులను కత్తిరించకూడదు.
- దిష్టి తీయటం.
- చేతులకు, కాళ్లకు మంత్ర తాడులు కట్టుకోవడం.
- గుమ్మానికి గుమ్మడికాయ కట్టుకోవటం మరియు నిమ్మకాయ, మిరపకాయ కలిపి కట్టడం.
- ఉరుములు పడుతున్నపుడు పెద్దకొడుకు బయట ఉంటే తన మీద పడుతున్నదని నమ్మకం.

- తలమీద చేయి పెట్టడం మరియు వెనుకవైపుకి నడవడం చావుకు నిదర్శనముగా చూస్తాం.
- ప్రేతఆత్మలలో, భూతాలలో, మంత్రాలలో నమ్మకం, నరహత్య వరకు తీసుకువేళ్లే ఈ నమ్మకాలు.

ఈ మూఢనమ్మకాలన్నింటికి కూడా సరియైన ఆధారాలు లేవు. కాని, మనం వీటన్నింటిని విశ్వసిస్తున్నాం, పాటిస్తున్నాం. ఈ నమ్మకాలను మనం సులభముగా విడదీయలేము, ఎందుకనగా ఇవి మన జీవితాలలో భాగము, జీవిత విధానం అయిపోయాయి. దీని వల్లనే మనం ఆధునిక రకమైన బానిసలుగా మారి ఉన్నాయి. విజ్ఞానము ఈ నమ్మకాలను ఎప్పుడో దహనం చేసి ఉన్నది. ఏలన, మనం మన అలవాటుల ద్వారా ప్రతిరోజు పునరుజ్జీవనం ఇస్తూనే ఉన్నాము. అదే విధముగా, కలత చెందవలసిన విషయమేమిటంటే మనం ఈ గాఢాంధకారములో జీవిస్తున్నామనే విషయం కూడా మనకు తెలియటం లేదు. క్రైస్తవ గురువులు, క్రైస్తవులు అని పిలువబడే మనము, ఈ లోకానికి వెలుగై ఉండవలసిన మనమే చీకటిలో నివసిస్తుంటే ఆ అంధకారం యొక్క ప్రభావం ఈ లోకానిపై ఎంతగా ఉందో మనం అర్థము చేసుకోవచ్చు.

## 4. మూఢనమ్మకాల కారణాలు

మనం మన మూఢనమ్మకాలను పరిశీలించుకొంటే మన జీవితంలో మనం అధికంగా ప్రేమించే వ్యక్తులుకాని, వస్తువులు కాని, సంబంధాలుకాని ఎక్కువగా మూఢ నమ్మకాలలో నమ్మే సందర్భములుగా ఉన్నాయి. ఓడిపోతామన్న భయం, పడిపోతామనే భయం, కోల్పోతామన్న భయం యింకా మరెన్నో భయాందోళనలలో మూఢనమ్మకాలే ఒక రక్షణ ద్వారముగా కనిపిస్తాయి. ఈ అంధకారానికి, గ్రుడ్డితనానికి మరియొక కారణం అజ్ఞానం. ఈ కారణం సాధారణముగా గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువగా కనపడుతూ ఉంటుంది. కాని, కొన్ని దశాబ్దాల నుండి ఇవి పట్టణ ప్రాంతాలలో కూడా వ్యాపించినాయి.

అజ్ఞానం అనేది జ్ఞానం లేకపోవటం అనే కాదు, కాని సరిగ్గా అర్థము చేసుకోలేకపోవడం. కనుకనే, మనం చదువుకున్న వ్యక్తులను, ఉద్యోగస్తులను

పెద్ద పెద్ద పదవులలో ఉన్న వ్యక్తులను మూఢనమ్మకం పేరుతో హీనమైన అపరాధములు చేస్తూ ఉండటం చూసి ఆశ్చర్యపోకూడదు.

మతాచారాల దృష్టి కోణం నుంచి చూసినచో పూర్వికులు చేసిన కార్యాలను ప్రశ్నించకుండా గ్రుడ్డిగా చేయటం, ఆలోచనలు లేని, కారణాలులేని కార్యాలు చేయటం మన మూఢనమ్మకాలు అనే అగ్నికి ఆజ్యం పోయటం లాంటిది. దైవప్రేమలేని దైవభీతినే నమ్మే మతాలు, దేవున్ని శిక్ష విధించటానికి ఒక భటుడులాగా చూసే మతాలు సొంత అవసరాలకు వాడుకోవడానికి ఒక వస్తువులాగా దేవున్ని చూసే మతాలే మూఢనమ్మకాలని ప్రోత్సహిస్తాయి.

మానవతా అనే పరిధిలో చూసుకుంటే వరుసగా అమంగళమైన కార్యాలు జరగడం, ధైర్యం లేకపోవడం, మానసికంగా క్రుంగిపోయి ఉండటం, నిరాశ నిస్పృహలలో మునిగితేలటం మరియు అద్భుత శక్తులలో అధికంగా నమ్మటం ఇవి ఒక వ్యక్తిని మూఢనమ్మకాల వైపు తీసుకువెళ్తాయి. ఈ మూఢనమ్మకాలు అనేవి ఒక మత్తు పదార్థానికి బానిసలు అవ్వటం లాంటిది. ఒకసారి ఈ మూఢనమ్మకాలకు అలవాటు పడితే దీనిని మానుకోవడం చాలా కష్టం. కొన్ని సందర్భాలలో అసంభవమే.

## 5. క్రైస్తవత్వం: ఓ నూతన జీవన విధానం

లోక రక్షకుడైన యేసుక్రీస్తును నమ్ముకుని, ఆయన సువార్త ప్రకారం జీవించేవారు మూఢభక్తి, మూర్ఖపు మతాచారాలు ఆచరించక, ఆత్మయందును సత్యమందును నిజదేవుని ఆరాధిస్తారు. బాహ్య కర్మకాండల కన్నా హృదయ శుద్ధి ముఖ్యమని యేసు ప్రభువు బోధించాడు (మత్తయి 15:1-20). కొంతమంది విమర్శకులు కొన్ని బైబిల్ సంఘటనలలో మూఢభక్తి జాడలు ఉన్నట్లు ఆరోపిస్తుంటారు. దేవుడు అబ్రహాము కుమారుడైన ఇస్సాకును బలిగా కోరడము (ఆదికాండము 22వ అధ్యాయం). న్యాయాధిపతులలో యెఫ్తా అనునతడు దేవునికి ప్రమాణము చేసెను. అదేమనగా, అతడు శత్రువులైన అమ్మోనీయులను ఓడించి, విజయసిద్ధితో తిరిగి వచ్చునపుడు స్వాగతం పలుకుటకు తన ఇంటి నుండి ఎదురుగా వచ్చు వ్యక్తిని దేవునికి బలి యిచ్చునని ప్రతిజ్ఞ చేశాడు. ఆ సమయంలో

తన ఏకైక పుత్రిక వచ్చింది. యెఫ్తా తాను యిచ్చిన మాట ప్రకారం తన కూతురును దేవునికి బలి యిచ్చాడు (న్యాయా 11:29-40). ఈలాంటి సంఘటనలు ఆ కాలంలోని ఆచారాలను గుర్తు చేస్తాయి. కాని మోషే ధర్మశాస్త్రం హేయమైన ఆచారాలను పాటింపరాదని ఇశ్రాయేలీయులకు హెచ్చరికలు చేసింది (ద్వితీ 18:9-12).

నూతన నిబంధన కాలంలో మోషే ధర్మశాస్త్రమునకు ప్రవక్తల ప్రబోధమునకు సంపూర్ణత యిచ్చుటకు వచ్చిన యేసుప్రభువు మూఢ నమ్మకాలను, దురాచారాలను ఖండించాడు. మతాచరణలు హృదయ పరివర్తనకు, వ్యక్తిగత ప్రవర్తనకు సంబంధించినవిగా సూచించాడు (మత్తయి 5:20).

## 6. పరిశుద్ధగ్రంథ ఆధారాలు

### ద్వితీయో. 18:9-12

మీరు, యావే మీ కొసగు దేశమును వసించునపుడు అచట జాతుల జుగుప్సాకరమైన ఆచారములను అనుకరింపవలదు. మీ బిడ్డలను అగ్నిలో దహనబలిగా అర్పింపరాదు. మీరు శకునములు చెప్పించుకొనకుడు. జ్యోతిష్కులను సంప్రదింపకుడు, చేతబడులు చేయింపకుడు.

### మీకా 6:6-8

స్వర్గములోని దేవుని పూజించుటకు వచ్చినపుడు నేనేమి తీసికొని రావలెను? ఏడాది దూడను దహనబలిగా కొనిరావలెనా? వేలకొలది పొట్టేళ్లను, పదివేల నదుల ఒలీవు తైలమును కొని వచ్చినచో అతడు సంతుష్టి చెందునా? నేను చేసిన పాపములకు ప్రాయశ్చిత్తముగా నా జ్యేష్ఠకుమారుని బలిగా అర్పింపవలెనా? మేలైనది ఏదో ప్రభువు నీకు తెలియజేసియే ఉన్నాడు. నీవు న్యాయమును పాటింపుము, ప్రేమతో మెలగుము, నీవు దేవుని పట్ల వినయముతో ప్రవర్తింపుము. ప్రభువు నీ నుండి కోరునది ఇదియే.

### యోహాను 4:24

దేవుడు ఆత్మస్వరూపి కనుక ఆయనను ఆరాధించువారు ఆత్మయందును సత్యమునందును ఆరాధింపవలెను.

## రోమీ 16:17-18

సోదరులారా! చీలికలు పుట్టించు వారిని గూర్చియు, ప్రజల విశ్వాసమును తలక్రిందులు చేయువారిని గూర్చియు జాగ్రత్తగా ఉండుడి.. అట్టివారు తమ పొట్టలకేగాని మన ప్రభువగు క్రీస్తుకు సేవలు చేయువారు కాదు.

## 7. మూఢనమ్మకాల పరిశీలన

ఒక చెట్టు యొక్క విలువ అది ఇచ్చే ఫలములను బట్టి నిర్ణయించటం జరుగుతుంది. మూఢనమ్మకాల యొక్క ఫలాలన్ని చెడుతనంతో నిండి ఉన్నవి కాబట్టి మూఢనమ్మకాల యొక్క అంతరంగిక స్వభావం ఎలాంటిదో చెప్పవచ్చును. ఇవి తరాల తరబడి, అగాధమైన హింసకు, దారిద్ర్యతకు మరియు పిచ్చితనానికి నిదర్శనగా ఉన్నవి. పూర్వకాలంలో దబ్బర దేవుళ్లను సంతోషపరచటానికి నరత్యాగం వరకు వెళ్లేవారు. మధ్యయుగంలో చేతబడి, మంత్రతంత్రాలు పేరున పేద ముసలమ్మలను సాతాను యొక్క సిబ్బందులుగా ప్రకటించి హింసించేవారు. ఈ ఆధునిక ప్రపంచంలో కూడా కొన్ని మారుమూల ప్రాంతాలలో ఇవన్నీ ఈనాటికి కూడా జరుగుతున్నాయి. పత్రికలలో ప్రతి రెండవ రోజు మూఢనమ్మకాల కారణముగా పోయే ప్రాణాలను అనే వార్తలను చదువుతున్నాము. మూఢనమ్మకాలు మనలను అజ్ఞానులుగా, ఆలోచనలేని వ్యక్తులుగా జీవించటానికి దారితీస్తాయి.

చివరికి, నాగరికత చెందిన దేశాలలో కూడా ఇవి ప్రాణానికి హాని కల్పించే ప్రణాళికలు సఫలీకృతముగా కొనసాగుతూనే ఉన్నాయి. మూఢనమ్మకాలు అజ్ఞానానికి పుట్టిన బిడ్డ కాబట్టి జ్ఞానం పెరిగే కొద్దీ, ఆలోచన పెరిగేకొద్దీ ఇవి ఖచ్చితముగా సమసిపోవాల్సిందే. ఇటుల జరగని సందర్భములో మన జ్ఞానాన్ని, ఆలోచనలను, విద్యా విధానాన్ని ప్రశ్నించుకోవలసిన అవసరం ఎంతో ఉంది.

మూఢ నమ్మకాలు ఎన్నో విధాలుగా ఒక మనిషి అపజయానికే కారణమై ఉంటుంది. మూఢనమ్మకాల చేత పీడింపబడిన వ్యక్తుల జీవితాలలో ఉన్న సమస్యలు ఏంటివో ఒక్కసారి చూద్దాం.

- ➢ మూఢనమ్మకాలు కలిగిన వ్యక్తులు జీవితంలో ఏమియు సాధించలేరు ఎందుకన, వారు ఎల్లప్పుడు ఓటమి పరమైన ఆలోచనలతో నిండి ఉంటారు.

- వారు అతి సందేహములతో ఉన్న వ్యక్తులుగా మారిపోయి, వారి ఆలోచన విధానం చాలా మిడిమిడిగా చిన్నగా ఉంటుంది.
- వారు ఆధునికతను, అభివృద్ధిని, విజ్ఞానాన్ని మరియు ఎదుగుదలను స్వీకరించలేకపోతారు.
- వారు వాళ్ల మనస్సులను భూత ప్రేత పిశాచముల భయాలతో నింపుకుంటారు.
- వారు ఈ గ్రుడ్డితనం వలనే, ఈ అసమర్ధత వలనే దేవుడు ఒసగిన జీవితాన్ని సంపూర్ణముగా ఆస్వాదించలేకపోతారు.
- వారు అర్థం పర్థం లేని ప్రతి దానిలో నమ్ముకుంటూ వారి జీవితాన్నే క్లిష్టముగా మార్చేస్తారు.

ఈ సమాజంలో చాలా వరకు ఉన్న సమాజ చెడుక్రియలను పెంచి పోషించేది ఈ మూఢనమ్మకాలే: కులతత్వం, స్త్రీలను కించపరచటం, దారిద్ర్యంలో జీవించటం, బాల్యవివాహాలు, కట్నం, మనుష్యులను చంపటం. వీటన్నింటికి ఆజ్యం పోసేది మూఢనమ్మకాలే. కావున, ఈ సమాజాన్ని అభివృద్ధి వైపు తీసుకెళ్లాలంటే, సత్యం వైపు నడిపించాలంటే మూఢనమ్మకాలను ఆచరించకుండా ఉండటమే మనకు ఉన్న ఒకే ఒక పరిష్కారం.

## 8. ఈ సమస్యలకి సమాధానాలు

విద్య అనేది ఒక వ్యక్తిని నిరక్షరాస్యత నుండి అక్షరాస్యత వరకు నడిపించేది కాక, చీకటి నుండి వెలుగులో, అపార్ధం నుండి అర్ధములోకి, భయం నుండి ధైర్యములోకి మరియు అవిశ్వాసం నుండి విశ్వాసంలోనికి నడిపించేలా ఉండాలి. పిల్లలను పసిప్రాయము నుండే వాళ్ల చుట్టుప్రక్కల జరుగుతున్న సంఘటనలను గ్రుడ్డిగా నమ్మకుండా, ప్రశ్నించే గుణమును నేర్పించాలి.

వాళ్లకు ఈ సృష్టి, దేవుడు, మానవులు అనే సత్యాలను సరిగ్గా అర్థం అయ్యేలా చెప్పాలి. మనుష్యులలో స్వార్థం కన్నా మానవత్వం అనే విలువలను అధికముగా ప్రోత్సహించాలి. ప్రజలు వారు విశ్వసించే సత్యాలను 'ఇంగింత

పరిజ్ఞానం' అనే అద్దంలో చూడాలి. చివరిగా, మూఢ నమ్మకాలంటే మన మనస్సులలో ఉన్న భయానికి అజ్ఞానానికి ప్రతిబింబాలే అని మనం తెలుసుకోవాలి. ఈ భయాందోళన నుండి విముక్తి పొందాలంటే మనం దేవునిపై సరిపడగా విశ్వసించాలి. మనలో కొందరు అవిశ్వాసులు ఉంటే వారు కనీసం మానవత్వంలో ఉన్న మంచితనాన్ని గుర్తించాలి.

**ముగింపు**

యోహాను సువార్త 14:6లో పలికినట్లు యేసుప్రభువే మార్గము, సత్యము, జీవము. ఆయనను విశ్వసిస్తూ, ఆయన మార్గాన్ని నమ్మి జీవిస్తున్న మనం అసత్యములో, మరణములో జీవించగలమా? మూఢనమ్మకాలనే అంశం ఈ లోకంలో ఒక సత్యమని, నిజముగా ఉందని, మనుష్యులను పీడిస్తుందని మనం తెలుసుకుందాం. మొట్టమొదటిగా క్రీస్తు విశ్వాసులు అనే మనం ఈ పీడింపబడిన వ్యక్తుల యొక్క సంఖ్యలో ఉన్నామా? అని ప్రశ్నించుకోవాలి. ఈ నమ్మకాల వలన లోకానికి కలిగిన మేలు ఏమి లేదు. మన గురువైన యేసుప్రభువే తన జీవితకాలంలో ఇటువంటి మూఢనమ్మకాలను తీవ్రముగా ఖండించాడు.

మన జీవితాలలో భాగమైపోయిన ఈ ఆలోచనల నుండి విముక్తి పొందడం కష్టమే. కాని అసాధ్యం కాదు. దేవునికి మన మీద ఉన్న ప్రేమను మనం నిజముగా విశ్వసిస్తే, మన దేవుడు కరుణ గల తండ్రి! అని పూర్తిగా నమ్మితే మరియు దైవప్రేమ, మానవుని ప్రేమ అనే ఆజ్ఞలను మన జీవితంలో పాటిస్తే ఇటువంటి మూఢనమ్మకాలను మనము వేర్లతో నిర్మూలించవచ్చు. చివరిగా, మనం గుర్తుంచుకోవలసిన విషయం ఒకటి ఉంది: మనం పాటించే విషయాలనే ఇతరులకు నేర్పించవచ్చు. మనమే ఈ మూఢనమ్మకాలు అనే ఊబిలో పడి, క్రీస్తు బోధనలను పాటించకపోతే ఇతరులకు ఇంకేమి నేర్పిస్తాము.

❋ ❋ ❋ ❋

# ౨. విగ్రహారాధన

**- బ్రదర్ బండి కిరణ్ కుమార్**

## ఉపోద్ఘాతము



ప్రస్తుత సమయంలో ఈ ఆధునిక సమాజాన్ని మనం పరిశీలించినట్లయితే మానవుడు అనేకమైన ఆలోచనలతో జీవిస్తున్నాడు. మానవుడు తన బాగుకోసం, శ్రేయస్సు కోసం తాను నిరంతరం ప్రాకులాడుతున్నాడు. ఇలాంటి పరిస్థితులలో నేటి మానవుడు ఈ సృష్టి వస్తువుల మీదే తన మనస్సును లఘ్నం చేస్తున్నాడు. ఇటువంటి పరిస్థితులలో తనను సృష్టించిన సృష్టికర్తను మరచి సృష్టి వస్తువులపై తన నమ్మకాన్ని ఉంచుతున్నాడు. దేవాలయానికి వెళ్లాలి అన్న ఆలోచన కూడా ఉండదు. ఒకవేళ వెళ్లినా తన మనస్సు అటూ ఇటూ తిరుగుతూ ఉంటుంది. తన మనస్సులో లోకమయమైన ఆలోచనలే ఉంటాయి కాని దేవుడు ఉండడు. ఈ విధమైన ప్రాపంచిక విషయాల నుండి మనస్సును దేవునిపై లగ్నం చేయడానికి ఏదో ఒక ఆధారము కావాలి. ఈ విధముగా వచ్చినదే విగ్రహాలు. మనం అనేకమైన ప్రాపంచిక ఆలోచనలతో దేవాలయానికి వెళ్లినా సరే ఆ విగ్రహాలను చూడగానే మనల్ని ఒక్క క్షణం దేవుని గురించి ఆలోచింపచేస్తాయి. ఉదాహరణగా మనం ఏదైనా దేవాలయానికి వెళ్లగానే శిలువపై వ్రేలాడే క్రీస్తు స్వరూపం కనబడుతుంది. దానిని చూడగానే ఎవరికైనా దేవుడు మన కొరకు చేసిన ప్రాణ త్యాగం గుర్తుకొస్తుంది. వెంటనే యేసయ్యా నన్ను రక్షించి నాకు తోడుగా ఉండండి అనేటటువంటి మాటలతో మోకరించి ప్రార్థిస్తాము. అదే ఆ స్వరూపములు లేవనుకో అస్సలు ప్రార్థన అనే విషయమే జ్ఞప్తికి రాదు. కావున మన మనస్సును దేవునిపైకి లగ్నం చేయుటకు మరియు

మన మనస్సు సక్రమ మార్గములో నడుపుటకు దేవాలయాలలో స్వరూపముల అవసరం ఎంతైనా ఉంది.

కాని మనకు స్వరూపములు లేదా విగ్రహములే దేవుళ్లు అవ్వకూడదు. వాటిని చూడగానే నిజదేవున్ని జ్ఞాపకపరుచుకోవాలి. మోషే నాయకత్వంలో నిజదేవుని మరచిన ఇస్రాయేలీయులు, ఆరోను నాయకత్వంలో బంగారు దూడను చేసికొని ఆ దూడే దేవుడని ఆరాధించడం మొదలుపెట్టారు (నిర్గమ 32:4). ఇక్కడ వారి మనస్సు నిజమైన, సజీవ దేవుని నుండి తొలగిపోయింది. కావున ఇది విగ్రహారాధన. ఈ విధముగా ఏదైనా నిజమైన దేవుని నుండి మన హృదయాలను తొలగిస్తుందో అదే విగ్రహారాధన.

## 2. విగ్రహమునకు, స్వరూపమునకు మధ్య గల భేదము

విగ్రహము అనగా శిల్పి తనకు తాను ఊహించి చేయునది. ఉదాహరణకు ఆనాడు సీనాయి పర్వతము దగ్గర, ఇస్రాయేలు ప్రజలు మరొక దేవతను చేసిపెట్టుము అన్నప్పుడు, అహరోను వారి దగ్గర ఉన్న బంగారము కరిగించి దూడను చేశాడు. ఆనాడు ఐగుప్తీయులు పూజించు బాలు దేవత యొక్క రూపము దూడ. కాబట్టి వారిని చూసి మన దేవుడు కూడా అటులనే ఉండును అనుకొని చేశాడు (నిర్గమ 32:4-5). విగ్రహము అంటే అది.

స్వరూపము అనగా భూమిమీద ఉన్నవాని యొక్క రూపము. మనం చూసిన వానిని చిత్రీకరించటం. ఏ కతోలిక దేవాలయంలో కూడా మనం తండ్రిదేవుని స్వరూపమును చూడగలమా? ఎక్కడ కూడా కనిపించదు. ఎందుకంటే దేవుడు ఆత్మస్వరూపుడు. ఆయన రూపం మనకు తెలియదు. కాని ఈనాడు మనం దేవాలయంలో చూచునది యేసుప్రభువు స్వరూపము, దేవదూత స్వరూపము, దేవదూతలు. పునీతుల స్వరూపములు. స్వరూపం అనునది ప్రతిబింబము. దర్శనములలో భక్తులు చూసిన రూపములు. ఉదాహరణకు పునీత మరియ మర్గరీతమ్మగారికి, ఒక దర్శనములో ప్రభువు తన తిరుహృదయమును చూపించారు. యేసు తిరుహృదయ స్వరూపము మనల్ని క్రీస్తు హృదయం వలె తయారుకావాలని ఆహ్వానిస్తుంది. మరియు పునీత ఫౌస్టీనమ్మ గారికి దర్శనములో

యేసుప్రభువు తన దివ్యకారుణ్యమును, హృదయము నుండి వెలువడు కిరణాలను చూపించారు. ఈ స్వరూపము ప్రభువు యొక్క హృదయమునందు ఉన్న కారుణ్యమును పాపాత్ముల మారుమనస్సు కోసం ఎదురు చూసే ప్రభువు కరుణ మనకు స్పష్టమవుతుంది. ఇదే విధముగా అనేకమైన దర్శనములు మన పునీతులు దర్శించారు. దేవుడు విగ్రహములను ఆరాధింపరాదు అన్నారు. అంతేకాని, ప్రభువు పలికిన ఇప్పుడున్న యేసుప్రభువు, దేవమాత, దేవదూత, పునీతుల స్వరూపములను గూర్చి కాదు.

## 3. నిర్వచనము

మానవ ఊహకు ప్రతిరూపం విగ్రహం కాని దేవుడు కాదు. దేవుని విగ్రహాలకు పరిమితం చేయకూడదు. అలా చేస్తే అది విగ్రహారాధన.

సృష్టికర్తను మరచి, సృష్టి వస్తువులను పూజించటం, అగ్ని, వాయువు, తుఫాను, నక్షత్రరాశి ప్రవాహ జలములు, గగనజ్యోతులు, ఈ లోకమును పాలించు దేవతలని ఎంచి పూజించడం విగ్రహారాధన అని పాత నిబంధన మనకు బోధిస్తుంది (సొలొ.జ్ఞా. 13:1-7). మనం అమరుడైన దేవుని మరచి మన రక్షకునికి చెందవలసిన మహిమను, పక్షులకు, జంతువులకు, సర్పములకు వివిధ సృష్టి జీవులకు చెల్లించుట విగ్రహారాధన (రోమీ 1:21-23). దేవుని ఆలయమైన మన హృదయాలలో లౌకిక వ్యామోహములను నింపుకొని, మన హృదయాలను దేవుని నుండి వేరు చేసుకోవడమే విగ్రహారాధన. ఉదాహరణకు జారత్వము, అపవిత్రత, మోహము, దురాశ, ధనాపేక్ష (కొలస్సీ 3:5) అని నూతన నిబంధన విగ్రహారాధనను నిర్వచిస్తుంది.

## 4. విగ్రహారాధనకు కొన్ని మూలాలు

విగ్రహములన్నియు ప్రతిబింబాలు. ఇవి అన్ని కూడా మనకు ఒక అవగాహన తీసుకొస్తాయి. ఉదాహరణకు మన తల్లిగాని తండ్రిగాని చనిపోయారనుకో వారి విగ్రహమునుగాని, ఫోటోగాని చూస్తే మనకు ఒక అవగాహన వస్తుంది. మన తల్లిగాని, తండ్రిగాని మనకు జ్ఞప్తికి వస్తారు. మన పూర్వులు మొదట పితామహులను గౌరవించడం మొదలుపెట్టారు. దానిని మనం

ఆంగ్లములో ఆన్‌సెస్టరీ వర్షిప్ అని పిలుస్తాం. వారు చేసిన గొప్ప విషయాలను, త్యాగాలను గుర్తు చేసుకుంటూ వారిని గౌరవించేవాళ్లు. వారిని తరతరముల వారు జ్ఞాపకపరచుకొనుటకు వారి శిలావిగ్రహాలను ప్రతిష్టించేవారు ఇదీ ఆనవాయితీగా ఇప్పుడు కూడా కొనసాగుతూనే వస్తుంది. ముఖ్యముగా మనము రాజకీయ నాయకుల విగ్రహములను మరియు మన దేశం కోసం పోరాడిన వారి విగ్రహములను హైదరాబాద్ ట్యాంక్ బండ్ మీద చూడవచ్చు. అదే విధముగా ఈ కోవకు చెందినదే అనిమిజం అనగా ఆత్మలను కొలవడం. మానవులమైన మనం శరీరం మరియు ఆత్మల కలయిక. మన శరీరం మనం మరణించిన తరువాత నాశనం అవుతుంది. కాని మన ఆత్మకు మాత్రం నాశనం ఉండదు. మనల్ని నడిపించేది మన ఆత్మ అయితే మన ఆత్మలకంటే వాటిని మించిన ఒక ఆత్మ మరియు మన ఆత్మలన్నింటిని నడిపే ఒకే ఒక ఆత్మ ఉండే ఉంటుంది. ఆ ఆత్మయే దేవుడు అని మన పూర్వులు భావించేవారు. ఇలా వారు నిజమైన దేవుని మరచి, సజీవ సత్యదేవునికి చెందవలసిన గౌరవ, ఆరాధన, మర్యాదలు ఆత్మలకు సలిపేవారు. కావున వారు విగ్రహారాధికులుగా పిలువబడ్డారు.

## 5. విగ్రహారాధన గూర్చి బైబిల్ గ్రంథం ప్రస్తావన

పరిశుద్ధ గ్రంథము అన్ని రకాలైన విగ్రహారాధనను ఖండిస్తుంది. సృష్టికర్తకు ఇవ్వవలసిన ఆరాధనను సృష్టి వస్తువులకు ఇవ్వకూడదని బోధిస్తుంది. దేవునికి చెందవలసిన ఆరాధనను మానవమాత్రులకు చెందకూడదని చెబుతుంది. మనం ఎప్పుడు ఆత్మయందు సంత్యమందు నిజమైన దేవుని ఆరాధించాలని కోరుతుంది.

**పాత నిబంధన:** మనం మన దేవాలయాలలో ఉపయోగించు స్వరూపములు, ప్రతిమలు, పటములు విగ్రహారాధనకు కాదుకాని నిజమైన దేవుని సాన్నిధ్యాన్ని మరియు మనలో దైవ ఆరాధనకు తగిన భక్తిభావాన్ని నిలకడగా ఉంచుటకు అని మనం గుర్తించాలి. ఎందుకంటే కొయ్యతోగాని, లేక లోహముతోనైన ఎట్టి రూపమును నిర్మింపరాదు అన్న దేవుడు సొలొమోను రాజుతో "ఓలీవు కొయ్యతో రెండు దేవదూతల బొమ్మలను చెక్కించి, వానిని గర్భగృహమున ఉంచమని కోరెను (1 రాజులు 6:23) మరియు దేవుడే స్వయముగా మోషేతో కంచుతో పామును

(సర్పమును) చేసి గడె మీద తగిలింపుము అనెను (సంఖ్యా 21:8-9). మోషే దేవుని ఆజ్ఞ ప్రకారము మరియొకసారి కూడా "కరుణా పీఠము రెండు కొనల నుంచుటకై రెండు కెరూబిము దేవదూతల బొమ్మలను పోతపోసిన బంగారముతో చేసెను (నిర్గమ 25:18-20). ఇవి అన్నీ కూడా దేవుని సన్నిధికి ఆయన మహత్తర శక్తికి, పరిశుద్ధతకు జ్ఞాపక చిహ్నాములు ఇవి మన ప్రార్థనకు సహాయపడతాయి. అంతేకాని ఇవి మనకు ఆటంకాలు ఏ మాత్రమును కాదు. విగ్రహారాధనను దేవుడే ఖండించాడు. అనగా ఆ మట్టి బొమ్మలనే, స్వరూపములనే దేవునిగా కొలువవద్దన్నారు, ఆరాధించవద్దన్నారు. "నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు. పైనున్న ఆకాశమందును, క్రిందనున్న భూమియందును, భూమి అడుగునున్న నీళ్లయందు ఉండు ఏ వస్తువు యొక్క ప్రతిరూపమునుగాని, విగ్రహమునుగానీ, మీరు నిర్మింపరాదు. దానిని మ్రొక్కకూడదు. దానిని పూజింపకూడదు" (నిర్గమ 20:3-5) మరియు "మీరు విగ్రహములను చేయకూడదు. చెక్కిన శిలలనుగాని ఆరాధనా స్తంభములనుగాని నెలకొల్పకుడు, వానికి పూజలు చేయకుడు (లేవీ 26:1). కావున మనం సజీవ దేవుని కనుగొని అతనికే ఆరాధనలు సల్పమని పాత నిబంధన బోధిస్తుంది.

**నూతన నిబంధన:** దేవుని నుండి మనలను వేరు చేయునది ఏదైనా విగ్రహారాధన కిందికే వస్తుందని నూతన నిబంధన తెలియజేస్తుంది. మనలను దేవుని నుండి వేరుచేయునది ఏమిటంటే జారత్వము, అపవిత్రత, మోహము, దురాశ, ధనాపేక్ష ఇవి అన్ని విగ్రహారాధన యొక్క మారురూపములు (కొలస్సీ 3:5). దేహ వాంఛలు మనలను దేవుని నుండి దూరం చేస్తాయి (ఫిలిప్పీ 3:19). విపరీతమైన ధనాకాంక్ష వలన అనేకమంది విశ్వాసము నుండి దూరంగా వెళ్లారు. లౌకిక వ్యామోహములు మనలను దేవుని నుండి వేరుచేసేవి. ఉదాహరణకు యూదా ఇస్కరియోతు ధనాపేక్ష వల్ల దేవుని నుండి దూరంగా వెళ్లి తన మరణం తానే కొనితెచ్చుకున్నాడు. మనం దేవుని నుండి దూరంగా వెళ్లితే మనకు నాశనం తప్పదని గ్రహించాలి. అందుకే పునీత పౌలుగారు మనల్ని విగ్రహారాధన నుండి తొలగిపొండు అని 1 కొరింతీ 10:14లో చెప్పుతున్నారు. మరియు అదే లేఖలో 3:16లో మన హృదయాలు దేవుని ఆలయాలు కావున మనం ఏ ఇతరమైన వాటిని లోనికి ఆహ్వానించకూడదని స్పష్టముగా బోధిస్తున్నారు.

## 6. శ్రీసభ సత్యోపదేశము యొక్క బోధన

"నేను తప్ప మీకు మరొక దేవుడు ఉండరాదు". ఈ ఆజ్ఞ తన ప్రజలకు తనను తాను బయలుపరుచుకొన్న ఒకే ప్రభువును తప్ప ఇతర దేవుళ్లను గౌరవించడాన్ని నిషేధిస్తుంది. మరియు బహు దేవతారాధనను ఖండిస్తుంది. సజీవుడైన దేవుని మరచి జీవంలేని వాటిని కొలిచే మనం కూడా జీవంలేని శవాలతో సమానం. విగ్రహారాధన విశ్వాసానికి నిరంతర పరీక్షగా, శోధనగా నిలుస్తుంది మరియు దేవుడు కాని వాటిని దేవునితో సమానంగా భావిస్తుంది విగ్రహారాధన. దేవుని స్థానంలో సృష్టివస్తువులను గౌరవించడం పూజించడం విగ్రహారాధన. "నీవు దైవాన్ని, ద్రవ్యాన్ని, సేవించలేవు అని ప్రభువే అన్నారు" (మత్తయి 6:24). విగ్రహారాధన దేవునితో సమైక్యతను చెరిపివేస్తుంది. కావున బహు దేవారాధన వల్ల మనం నిజదేవుని నుండి దూరంగా వెళ్లిపోతాము. అలా కాకుండా ఒకే దేవుని నిజమైన సజీవదేవుని ఆరాధించడం వల్ల సఖ్యత సంతరించుకుంటాము. ప్రభువును మాత్రమే ఆరాధించాలన్న ఆజ్ఞ మనిషిని సమగ్రం చేసి మానవ జీవితం ముక్కలు అవ్వకుండా కాపాడుతుంది. కావున మనలో ఉండే దైవభక్తిని పెడదారిన పెట్టించేది విగ్రహారాధన. (శ్రీసభ సత్యోపదేశం 2212-2114) విగ్రహాలను ఖండించే మొదటి ఆజ్ఞ ప్రతిమలను గౌరవించు క్రైస్తవ ఆచారాన్ని వ్యతిరేకం కాదు. ఎందుకంటే మనం ప్రతిమలకిచ్చే గౌరవం ఆ ప్రతిమలకు కాదుకాని దానిలో ఉన్న వ్యక్తికి చెందుతుంది. దానిలో చిత్రింపబడిన వ్యక్తిని గౌరవిస్తాముగాని ఆ ప్రతిమను కాదు. ప్రతిమ ఒక జ్ఞాపిక మాత్రమే. మనం ప్రతిమలకు అర్పించే ఆరాధనలు అర్పణలు అన్ని కూడా ఆ ప్రతిమ సూచించే వ్యక్తివైపు మనల్ని నడిపించును (శ్రీసభ సత్యోపదేశం 2132).

## 7. ముగింపు

"ఆదిలో దేవుడు మానవుని సృష్టించాడు, నేడు మానవుడు దేవుడ్ని సృష్టించాడు. డబ్బు ఆధునిక విగ్రహము; గర్వము నేటి విగ్రహము; స్వార్థము నేటి విగ్రహారాధన" అని ఒక ప్రసంగీకుడు అన్నాడు. ఏ విగ్రహమైన కేవలం మన మనస్సును లఘ్నం చేయడానికే. ఇంట్లో చనిపోయిన అమ్మ లేదా నాన్న

ఫోటో పెట్టుకొని ఎలా జ్ఞప్తికి తెచ్చుకుంటామో అలాగే దేవాలయాల్లోని విగ్రహాలు కూడా మన నిజదేవుని మహిమపరచుటకే. కనుక, చివరిగా దేవాలయాల్లో విగ్రహాలు, ప్రతిమలు ఉండవచ్చు కాని అవి మన మనస్సును, హృదయాన్ని నిజదేవుని నుండి తప్పించకూడదు. మనం అర్పించే అర్పణలు క్రీస్తు దేవునికే చెందుతాయి గానీ ఆ విగ్రహాలకు కాదు అని మనం గ్రహించాలి. మరియు మనం విగ్రహాలకు, ప్రతిమలకు గొప్ప స్థానమునివ్వకూడదు. కతోలిక సంఘములో కూడా మనం గమనిస్తే పుణ్యక్షేత్రాల వద్ద ఎక్కువగా జరిగేది ఏమిటంటే దేవాలయంలో జరిగే దివ్యబలిపూజ మరియు దివ్యసత్ప్రసాద ఆరాధన సమయంలో చాలామంది భక్తులు దివ్యబలిపూజ మరియు దివ్యసత్ప్రసాద ఆరాధన ద్వారా మన మధ్య ఏతెంచి వస్తున్న క్రీస్తు భగవానుని మరచి దేవాలయాల బయట ఉన్న పునీతుల విగ్రహాల దగ్గర ప్రార్థిస్తుంటారు. అయితే మనం ఎవరికి ఎక్కువ ప్రార్థిస్తుంటారు. అయితే మనం ఎవరికి ఎక్కువ ప్రధాన్యతను ఇస్తున్నాం అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి. పునీతులందరు మనల్ని నిజదేవుడైన క్రీస్తు ప్రభువు వద్దకు తీసుకొని వెళ్లడానికి తోడ్పడేవారే గాని వారే దేవుళ్లు కాదు. వారు దేవునికి మనకు మధ్యవర్తులుగా ఉన్నారనే విషయం మనం గమనించాలి. పునీతులందరూ కూడా క్రీస్తును పోలి జీవించినవారు. వారును అందరూ మంచి ప్రార్థనా వీరులు మరియు పవిత్రమైన జీవితాన్ని జీవించినవారు. వారిని మనం ఆదర్శమూర్తులుగా తీసుకొని నిజదేవుని ఆరాధించుటకు మనల్ని మనం సిద్ధం చేసుకోవాలి. మానవులమైన మనం, మన ప్రేమను అంతరంగ భక్తి భావాన్ని, మనస్సును బాహ్యరూపములలో వ్యక్తపరుస్తాం. పుట్టిన పండుగకు మనం ఎవరికైన ఇచ్చే కానుక, మన ప్రేమను గౌరవాన్ని సూచిస్తుంది. బాహ్య వస్తువు మన ప్రేమను, గౌరవాన్ని సూచిస్తుంది. బాహ్యవస్తువు మన మనస్సు ఇచ్చిన రూపకల్పన. వస్తువు కంటే అది సూచించే మనస్సు గొప్పది.

పరలోకమందున్న మీపై మా దృష్టి నిలుపుటకు భూలోకములో మీ జ్ఞాపకాలుగా స్వరూపములు ఉండటం సమంజసమే. భూలోకములో ఆ స్వరూపము చూసినప్పుడెల్లా మిమ్ము గుర్తు చేసుకొని, భక్తియుతముగా నడచుటకు మాకు సహాయము చేయుమని మరియు మీ నుండి మమ్ము వేరుచేయు ఏదైనా సరే

మేము విడనాడుటకు కావలసిన శక్తిని దయచేయండి. దేవుని నుండి అనుగ్రహములను ఆశించే ముందు మనం ఆత్మ పరిశీలన చేసుకుందాం. మనం ఎవర్ని దేవునిగా మన జీవితాలలో ఎన్నుకుంటున్నాం తెలుసుకొందాం. మరియు మనం సృష్టికర్తను మరచి సృష్టి వస్తువులను ఆరాధంచకూడదనే విషయాన్ని మన దృష్టిలో, మనస్సులో పదిలపరచుకొని దానికి అనుగుణంగా మలచుకుంటూ మంచి క్రైస్తవునిగా జీవించుదాం, ఇతరులను జీవింప చేద్దాం.

❋ ❋ ❋ ❋

# 3. దైవ దూషణం

**- బ్రదర్ తుమ్మా శరణ్ తేజ**

## పరిచయ పలుకులు



నేను మీతో పంచుకోవాలనుకున్న అంశం దైవ దూషణం. ప్రభువు నామాన్ని గౌరవించాలని రెండవ ఆజ్ఞ శాసిస్తుంది. మరి ముఖ్యంగా పవిత్రత విషయాల్లో మనం వాడే భాషను రెండో ఆజ్ఞ నియంత్రిస్తుంది. దేవుని బయల్పాటులోని అన్ని వాక్కుల్లోను, విశిష్టమైన పదం ఒకటుంది. అదే బయలుపరుపబడిన దేవుని నామం. తనను విశ్వసించువారికి దేవుడు తన పేరు చెప్పుతాడు. తన వ్యక్తిగత నిగూఢ సత్యాన్ని గురించి తెలియజేస్తాడు. పేరును తెలుపడం నమ్మకానికి సన్నిహితానికి సంకేతం. ప్రభువు నామం పవిత్రం. కనుక మనం దాన్ని దుర్వినియోగం చేయకూడదు.

దైవ దూషణం అంటే దేవునికి వ్యతిరేకంగా మాట్లాడటం, దేవుడు చెప్పిన పనులు పాటించకపోక తన నామమును వ్యర్థముగా పలుకుటయే దైవ దూషణం అనుకున్నాను. మరియు దానికి శిక్ష దేవునికి దూరం అవ్వటం అనుకున్నాను. కాని ఈ అంశం ధ్యానించిన తరువాత దేవుని పట్ల చేసే చిన్న తప్పయినా దైవ దూషణం అని తెలుసుకున్నాను పునీత తోమాస్‌గారు చెప్పిన విధంగా దీనికి అతి సర్వసాధారణమైన శిక్ష మరణము అని తెలుసుకున్నాను. కావున ఈ విషయములు గూర్చి తెలుసుకుందాం.

## దైవ దూషణం అంటే ఏమిటి?

దేవునికి అతి పవిత్రమైన నామము గూర్చి వ్యర్థముగా మాట్లాడటం. మాటల్లో దేవునికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వక పోవటం దైవ దూషణం. దైవ

దూషణం ప్రత్యక్షంగా రెండవ ఆజ్ఞకు విరుద్ధం. దేవునికి వ్యతిరేకంగా మనస్సులో లేక బాహ్యంగా ఆయన్ని అగౌరవపరుస్తాము. విద్వేషపు మాటలు, దూషణ లేక ధిక్కారం, దేవునికి ఇవ్వాల్సిన గౌరవం ఇవ్వకపోవటం. దేవుని నామాన్ని అనుచితంగా ఉపయోగించడం. వీటన్నింటిని దైవ దూషణగా పరిగణించాలి. మీరు పిలువబడిన యేసు నామాన్ని దుర్భాషలాడు వారిని పునీత యాకోబు గారు ఖండిస్తున్నారు. "దేవుడు మీకు ప్రసాదించిన శుభ నామమును గూర్చి దుర్భాషలాడునది వారే కదా!" (యాకోబు 2:7).

క్రీస్తు సంఘానికి కన్య మరియ, సకల పునీతులకు, పవిత్ర వస్తువుల పట్ల అగౌరవపరచి దూషించిన యెడల మనం దేవుని పట్ల పాపం చేసినట్లే. ఎందుకంటే వారు దేవుని పట్ల చూపించిన సేవాభావం మరియు సంబంధము అటువంటిది. నేరాలను కప్పిపుచ్చడానికి, ప్రజలను బానిసలుగా చేయటానికి వ్యక్తులను చిత్రహింసలకు లేక మరణానికి గురి చేయడానికి దేవుని పేరు ఉపయోగించటం దైవ దూషణం అవుతుంది. ఒక నేరాన్ని చేయడానికి దేవుని పేరును ఉపయోగించటం దైవ దూషణం అవుతుంది. ఒక నేరాన్ని చేయడానికి దేవుని పేరును ఉపయోగిస్తే మతాన్ని విడిచిపెట్టుటకు ఇతరులను ప్రోత్సహించి నట్లవుతుంది.

దైవ దూషణం చేయాలన్న ఉద్దేశం లేకపోయినా, దైవ నామం పేరున ఒట్టుపెట్టడం ప్రభువు నామాన్ని అమంగళం చేసినట్లవుతుంది. దైవ నామాన్ని మంత్ర విద్య కొరకు వినియోగించుటను రెండవ ఆజ్ఞ నిషేధిస్తుంది. దేవుని పేరుతో ఇతరులకు చేసిన వాగ్దానాల్లో దేవుని గౌరవం, విశ్వసనీయత, సత్యశీలత, అధికారం ఇమిడి ఉన్నాయి. న్యాయంగా వాటిని గౌరవించాలి. వాటిని పాటించకపోతే, దేవుని నామాన్ని దుర్వినియోగం చేసినట్లు అవుతుంది. దేవున్ని అబద్ధీకునిగా చేసినట్లు అవుతుంది.

ఫ్రాన్సిస్కో సురెజ్ ఇలా వివరించారు. ఆయన మాటలలో, దైవ దూషణం అను పదం మన తలంపు ద్వారా, క్రియల ద్వారా మరి ముఖ్యంగా మాటల ద్వారా దేవునికి, మత చట్టానికి వ్యతిరేకంగా పాపం కట్టుకుంటాము. అనగా

దేవుడు ఇచ్చిన పది ఆజ్ఞలను పాటించకపోయినను మరియు మనం చేసే చిన్న చిన్న తప్పులు, పొరపాటుల వల్ల వేరే వారికి బాధ కలిగించినను అది దైవ దూషణం అవుతుంది.

## పవిత్ర గ్రంథములో పూర్వ నిబంధనము నుండి దైవ దూషణం

## రాజుల మొదటి గ్రంథంలో 21:10,13 లలో

పాత నిబంధనలో రాజుల మొదటి గ్రంథంలో నాబోతు దేవుని పట్ల, దైవ దూషణం చేస్తాడు. అందుకు ఆయనను పట్టణము వెలుపలికి కొనిపోయి రాళ్లతో కొట్టి చంపిరి. అదే విధంగా నేటి కాలంలో 1697 సంవత్సరములో తోమస్ ఐకెన్ హెడ్ అనే వ్యక్తి దేవుని వాక్యమును అవహేళన చేసి వాటికి వ్యతిరేకంగా మాటలు అనినందులకు అతన్ని ఉరి తీశారు.

## యెషయా 65:7

విగ్రహారాధన చేసినందులకు దేవుడు వారి తప్పిదములకును మరియు వారి పాపములకును తగినట్లుగా వారిని శిక్షించెను.

## సమూవేలు రెండవ గ్రంథము 12:13-14

నాతాను ప్రవక్త దావీదుతో నీవు దేవునికి వ్యతిరేకంగా పాపము చేసితివి కనుక నీకు పుట్టిన బిడ్డడు మరణించును అని అనెను.

## లేవీకాండము 24:11-16

షెలోమితు కుమారుడు దేవుని నామమును దూషించెను కనుక మోషే చట్ట ప్రకారం అతన్ని రాళ్లతో కొట్టి చంపిరి.

ఇలా మనం చూచినట్లయితే పాత నిబంధనలో దైవ దూషణం చేసిన వారి సంఖ్య అధికంగా ఉంటుంది. మరి ముఖ్యంగా దేవుడు ఇచ్చిన రెండో ఆజ్ఞకు వ్యతిరేకంగా జీవించినట్లైతే దేవుని నామాన్ని అగౌరవపరచి తన నామాన్ని వ్యర్థంగా పలికినప్పుడు దైవ దూషణకు పాలుపడినవారము అవుతాము, మరియు దేవుని పట్ల ఏ చిన్న తప్పు చేసిన దైవ దూషణంగా పరిగణింపబడుతుంది.

## పవిత్ర గ్రంథంలో నూత్న నిబంధనము నుంచి దైవ దూషణం

## మత్తయి 9:2-3

"అప్పుడు పడకపై పడియున్న పక్షవాత రోగిని ఒకనిని, కొందరు ఆయన యొద్దకు తీసుకొని వచ్చిరి. వారి విశ్వాసమును గమనించిన ఆ రోగితో కుమారా! ధైర్యము వహింపుము. నీ పాపము పరిహరింపబడినది" అని యేసు పలికెను. అప్పుడు ధర్మశాస్త్ర బోధకులు కొందరు, ఇతడు దైవ దూషణము చేయుచున్నాడు అని తమలో తాము అనుకొనిరి. దైవ దూషణం గొప్ప పాపం, మహా పాపం ఎందుకంటే ఇది విశ్వాస ప్రమాణానికి వ్యతిరేకంగా ఉంటుంది.

## దర్శన గ్రంథము 13:15

అంతట ఒక మృగము కుత్సితపు పలుకులు పలుకుచు దేవుని, ఆయన నామమును ఆయన నివాసమును అది నిందింపసాగెను. అంతేకాక దేవలోకమున ఉండెడి వారిని అందరిని గూడ దూషించెను, తద్వారా ఆ మృగము దైవ జనులతో నశింపబడెను.

## దర్శన గ్రంథము 16:9

మృగరాజ్యము అధిపతియగు దేవుని నామమును దూషించిరి మరియు అనంతరము ఐదవ దేవదూత తన చేతి పాత్రను ఆ మృగము యొక్క సింహాసనముపై కుమ్మరించెను. ఆ మృగరాజ్యమున అంధకారము ఆవరించెను. బాధచే జనులు తమ నాలుకలు కొరుకుకొనిరి. తమ బాధలకును కురుపులకును దివియందలి దేవుని దూషించిరి.

## రోమీయులకు వ్రాసిన లేఖ 2:24

యూదులారా! మిమ్ము బట్టి అన్యజనులు దేవుని నామమును దూషించుచున్నారు. కావున మీరు దేవుని నామాన్ని అమంగళం చేయకండి. పునీత తామస్‌గారు ఇలా అంటారు. మీరు హత్య చేసినవాడిని మరియు దైవదూషణానికి పాలుపడిన వాడిని సరిపోల్చితే, దేవుని దూషించడమే పెద్ద తప్పని స్పష్టంగా వున్నది. ఎందుకంటే దైవ దూషణం దేవున్ని తిన్నగా లేదా సూటిగా దేవునికి వ్యతిరేకంగా పాపం కట్టుకున్నట్లు మరియు సహోదరి సహోదరుల పట్ల

వ్యతిరేకంగా పాపం కట్టుకున్నట్లు, మరియు ఈ హత్యచేస్తే ఇది మానవునికి ఎక్కువ హాని కలిగి వుండవచ్చు. కాని దైవ దూషణం దేవునికి సంబంధమైనది కాబట్టి ఇది హత్యకంటే పెద్ద తప్పు.

## ప్రభువు నామమును దుర్వినియోగపరచుట

అసత్య ప్రమాణాలను రెండవ ఆజ్ఞ నిషేధిస్తుంది. మనం నిలబెట్టుకోవాలన్న ఉద్దేశం లేకుండా ఒట్టుపెట్టుకొని వాగ్దానం చేసినప్పుడు, లేక ఒట్టు పెట్టి వాగ్దానం చేసిన తరువాత దాన్ని నెరవేర్చనప్పుడు అది ప్రమాణ భంగం అవుతుంది. ప్రమాణాన్ని నిలబెట్టకపోవడం మానవ భాషణకు ప్రభువైన దేవునికి అగౌరవం తెస్తున్నాం. ఒట్టుపెట్టి చెడుపని చేస్తామని మాట ఇవ్వడం దేవుని నామపవిత్రతకు విరుద్ధం. కాని నేను మీతో చెప్పునదేమనగా మీరు అసలు ఒట్టుపెట్టుకొనకూడదు. మీరు చెప్పునది ఔను లేక కాదు అనువాటితో సరిపుచ్చవలయును. అంతకు మించిన పనులు, పలుకులు దుష్టుని నుండి వచ్చినవే.

అల్ప విషయాల కోసం దైవ నామాన్ని వాడరాదు. ఒక అధికారి లేక అధికార వర్గం మన నుండి అన్యాయంగా ప్రమాణ స్వీకారాన్ని కోరిన సందర్భాల్లో మనం విధిగా తిరస్కరించాలి. చట్ట సమ్మతం కాని అధికారులు విధించే ప్రమాణాలను తోసిపుచ్చాలి. వ్యక్తి ఔన్నత్యానికి విరుద్ధంగా ఉన్నప్పుడు, శ్రీసభతో మనకున్న సంబంధానికి విరుద్ధంగా వున్నప్పుడు ప్రమాణ స్వీకారం చేయటం విధిగా మానుకోవాలి.

## దైవ దూషణంలో రకములు

దైవ దూషణం చేసిన వారు రెండు రకాలుగా ఉంటారు. ఒకటి (ఒరిజినల్ బ్లాస్ఫెమి) దేవున్ని దూషించే మూల వ్యక్తి. రెండవది (అపోస్టేట్) మతభ్రష్టుడు. దేవుణ్ణి దూషించే మూల వ్యక్తి దేవున్ని దూషించే మూల దంపతులకు పుట్టినటువంటి వాడు, మరియు దేవుని దూషించుటలో తన యౌవ్వనమునకు వచ్చినటు వంటివాడు. మత భ్రష్టుడు అంటే మతాన్ని గూర్చి చెడ్డగా, వ్యతిరేకంగా మాటలు మాట్లాడుతూ సత్యాలను, విలువలను కించపరిచేవాడు.

మత భ్రష్టులు మూడు రకాలుగా వుంటారు.

1. Blasphemy of Belief: దైవ దూషణాన్ని హృదయ అంతరంగంలో నమ్మేవాడు.

2. Blasphemy of Action: క్రియారూపంలో దైవదూషణం చేసేవాడు.

3. Blasphemy of Saying: వాక్య రూపంలో దైవదూషణం చేసేవాడు.

అలాంటి హృదయ కాఠిన్యత వల్ల చిట్టచివరకు పశ్చాత్తాపం పొందలేని స్థితికి శాశ్వతజీవాన్ని కోల్పోయే స్థితికి దారి తీయవచ్చు.

ఆశాభావానికి విరుద్ధమైన పాపం నిరాశ, మితిమీరిన ఆత్మ విశ్వాసం కలిగి ఉండటం. వ్యక్తిగత రక్షణాన్ని దాన్ని సాధించేందుకు కావాల్సిన శక్తిని, పాపక్షమాపణనూ దేవుని నుండి పొందగలనన్న ఆశను కోల్పోవడం నిరాశ అవుతుంది. ఇవి అన్ని కూడా పవిత్రాత్మ దేవునికి విరుద్ధమైన పాపాలు.

**రోజువారి జీవితంలో చేసే దైవ దూషణలు**

- నా పేరు యేసు, నేను దేవునితో సమానము అని చెప్పుకోవడం కూడా దైవ దూషణం.
- సైతాను ఆరాధించడం దైవ దూషణం.
- ఆత్మహత్య చేసుకోవడం దైవ దూషణం.
- దేవుడు జాలి దయలేనివాడు, కఠినుడు, సమానత్వములేనివాడు అని ప్రకటించడం కూడా దైవ దూషణం.

**దైవ దూషణానికి పాలుబడిన వారికి శిక్ష**

**లేవియకాండము 24:11-16**

ప్రభువు మోషేతో ఇట్లు నుడివెను. ఆ దైవ దూషకుని శిబిరము వెలుపలికి కొనిపొండు, అతని దూషణమును వినినవారందరు వాని తలమీద చేతులు మోపి అతను దోషియని నిర్ధారింపుడు. అటు పిమ్మట సమాజమంతయు వానిని రాళ్లతో కొట్టి చంపవలయును. ఇస్రాయేలీయులు, వారితో వసించు పరదేశులుకాని ప్రభు

నామమును దూషింతురేని వారిని తప్పక వధింపవలయును. ఈ దైవ దూషణం చేసిన వారికి అతి సర్వ సాధారణమైన శిక్ష చంపడము. అది బాహ్యంగా ఉరి తీయటంకాని రాళ్లతో కొట్టి చంపడం కాని జరుగుతుంది.

ఈ దైవ దూషణానికి పాలుపడిన వారిలో చివరగా చెప్పబడిన వ్యక్తి The great Britain కి చెందిన Thomas Aikchead తను 20వ సంవత్సరాల వయస్సులో 1697 సంవత్సరంలో పవిత్రమైన పాత నిబంధన గ్రంథములోని కొన్ని వాక్యాలను అవహేళన చేసి వాటికి వ్యతిరేకంగా మాట్లాడినందులకు ఉరితీయటం జరిగింది.

## 1. (Blasphemy of Belief) దైవ దూషణాన్ని హృదయ అంతరంగంలో నమ్మేవాడు

ఇతడు అసలు దేవుడే లేడని చెప్పేవాడు. ఈ సృష్టంతా కూడా ఆరంభము లేనటువంటిది అని చెప్పేవాడు. మనం దేవుని పోలికలో లేమని, మనం చేసే క్రియలకి కూడా మనమే బాధ్యులమనీ అసలు స్వర్గం, నరకం అనేవి లేవు అని ఈ సృష్టి అంతయు అణువుల నుండే పుట్టినదని చెప్పేవాడు. దేవునికి ఎలాంటి శక్తి, యుక్తులు లేవని చెప్పేవాడు. దేవుడు అవివేకని, దేవుని నమ్మవద్దని, దేవుణ్ణి ప్రార్థించకూడదని రకరకాలుగా దేవుని పట్ల ఆయన క్రియల పట్ల వ్యతిరేకంగా మాట్లాడేవారు.

## 2. (Blasphemy of Action) క్రియారూపంలో దైవ దూషణ చేసేవాడు

మత గ్రంథము, అసత్యం అని వాటిని చింపి కాల్చివేయాలని వాటిని చెత్త కుండిలో వేయాలని చెప్పేవాడు. ఈ దూత పెద్దలు అందరు దేవుని స్వరూపాలను ద్వేషిస్తారు. వేరువేరు లౌకిక వస్తువులను పూజించేవారు. మత పెద్దలు దేవుని ప్రజలను చిత్రహింసలు పెట్టేవారు. మతం పేరిట ఆడవారిపై అత్యాచారం, మానభంగం మరియు వివిధమైన చిత్రహింసలు చేసేవారు.

## 2. (Blasphemy of Saying) వాక్యరూపంలో దైవ దూషణ చేసేవాడు

దేవున్ని మాటల ద్వారా దూషించేవారు. దేవుని అనుచరులను, సకల పునీతులను, దేవదూతలను, కించపరచటం, వారిని గూర్చి వ్యతిరేకంగా

మాటలాడటం చేసేవారు. దైవదూషణలో ఇవి ముఖ్యమైన ఘట్టాలు. మాటల ద్వారానే మనం దేవుని దూషిస్తాము. దేవుని నామాన్ని కించపరుస్తుంటారు. ఇలా చేయడం ద్వారా దేవుని అతి పరిశుద్ధమైన నామమునకు వ్యతిరేకంగా మాటలు పలకడం మరియు దేవుని అవహేళన చేయడం.

## పవిత్రాత్మకు వ్యతిరేకంగా దూషణ చేస్తే క్షమాపణ లేదు

మనం చేసే ప్రతి తప్పు కూడా మన్నించబడుతుంది. అలాగే 7 చావైన పాపాలు కూడా మన్నించబడతాయి. కాని మత్తయి సువార్త 12:30 ప్రకారం పవిత్రాత్మకు వ్యతిరేకంగా దూషణ చేసే వానికి క్షమాపణ లేదు. అట్టివాడు శాశ్వత పాపం కట్టుకున్న దోషి అవుతాడు. దేవుని కరుణకు అవధులు లేవు. కాని పశ్చాత్తాపపడి దేవుని కరుణను అంగీకరింపక వానికి, తన పాపక్షమాపణను, పవిత్రాత్మ ప్రసాదించే ముక్తిని తిరస్కరించేవానికి, ఉద్దేశపూర్వకంగా వాటిని నిరాకరించేవానికి దేవుని కరుణ దొరకదు. అదే విధంగా ఇంగ్లాడు దేశంలో దైవ దూషణానికి పాలుపడిన వారిని శిక్షించడానికి ఒక చట్టాన్ని విడుదల చేశారు. అది ఏమిటంటే 9 నెలలు జైలుశిక్ష మరియు ఉరితీయటం లేదా రాళ్లతో కొట్టడం ఇదంతా మనము చరిత్రలో చూస్తాము.

## ముగింపు

కావున మనం దేవుని నామాన్ని అనుచితంగా వినియోగించరాదు మరియు యేసుక్రీస్తు, కన్య మరియమ్మ, పునీతుల పేర్లను అవమానించరాదు. సృష్టికర్త పేరిటగాని లేక జీవి పేరిటగాని ప్రమాణం చేయరాదు. మనము ఒట్టుపెట్టి వాగ్దానం చేసినప్పుడు దానిని తప్పకుండ నెరవేర్చాలి లేదేని, అది దైవ దూషణం అవుతుంది. కావున మనం రోజువారి జీవితంలో చేసే పనులు మాట్లాడే మాటలు మరిముఖ్యంగా దేవునిపై మరియు పవిత్రాత్మను గూర్చి మాట్లాడే మాటలు ఆచితూచి మాట్లాడాలి. ఎందుకంటే దైవ దూషణకి పాలుపడినవాడు, నేరము చేసిన వానికంటే ఎక్కువ పాపం కట్టుకున్నట్టే. అది మన్నించలేనటువంటి పాపం అవుతుంది. దానికి శిక్ష పాతనిబంధనలో చెప్పిన ప్రకారం మరణ శిక్ష.

❃ ❃ ❃ ❃

# 4. పవిత్ర విషయాల దూషణం

- బ్రదర్ ఏరువ బాల సుధీర్



## ఉపోద్ఘాతము

ఈ ఆధునిక ప్రపంచంలో, ప్రతి మానవుడు ఎలక్ట్రానిక్ గ్యాడ్జెట్స్ సోషల్ మీడియపై మక్కువ చూపిస్తూ మంచికి - చెడ్డకి, పవిత్రమైనది - అపవిత్రమైనది అనే భేదం లేకుండ అన్నింటిని ఒకేలా ఉపయోగించే ఈ తరుణాన 'అపవిత్రీకరణం' అనే అంశంపై పరిజ్ఞానం సంపాదించుకోవడం చాల అవసరం. ఎందుకంటే మనం ఆధ్యాత్మిక దీవెనలు పొందడానికి సోపానాలుగా ఉపయోగించే వ్యక్తులను, స్థలాలను, వస్తువులను గౌరవించడం మన బాధ్యత. అలా లేని పక్షంలో అది అపవిత్రీకరణము అవుతుంది. ఎందుకంటే, అవి దేవుని సేవకు నిర్దేశించి ప్రత్యేకించబడినవి కాబట్టి మనం ఈ అంశంలో అపవిత్రీకరణమునకు నిర్వచనము, పదపుట్టుక గురించి, దానిలో ఉన్న మూడు రకాలు; వ్యక్తిగతపరమైన అపవిత్రీకరణము ప్రాంతీయ పరమైన అపవిత్రీకరణము మరియు వాస్తవిక పరమైన అపవిత్రికరణము గురించి ముఖ్యంగా బైబులు ప్రకారం అపవిత్రికరణమును కొన్ని సంఘటనల ద్వారా తెలుసుకుంటూ మరియు శ్రీసభ చట్టం మనకు ఏం తెలియజేస్తుందో అవి క్లుప్తంగా తెలుసుకుందాం.

## 1. అపవిత్రీకరణము అనగానేమి?

కతోలిక శ్రీసభ సత్యోపదేశం ఆర్టికల్ (2120) ఇలా తెలియజేస్తుంది. "దివ్య సంస్కారాలను, ఇతర దైవార్చన కార్యాలను, దేవునికి అంకితమైన వ్యక్తులను పవిత్రీకరణం చేసిన వస్తువులను, స్థలాలను, అగౌరపరచుట లేక వాని పట్ల

అనుచితంగా ప్రవర్తించటం అమంగళ పాపమవుతుంది. ఎందుకంటే ఈ సంస్కారంలో దివ్యసత్ప్రసాదం నిజమైన క్రీస్తు శరీరం మన కోసం యదార్థంగా నెలకొనివుంది''. ముందుగా మనం అసలు పవిత్రత అంటే ఏమిటో తెలుసుకుందాం!

## 1.1. పవిత్రత

ఏదైన వస్తువునుగాని, వ్యక్తినిగాని, స్థలాన్నిగాని దైవికమైన పని కొరకై మిగతా వాటి నుండి ప్రత్యేకంగా ఎన్నుకొని మరియు దేవుని దారికి మానవుడిని చేర్చడానికి ఉపయోగపడేది.

## 1.2. పద పుట్టుక

అపవిత్రీకరణము మనం ఆంగ్లంలో సాక్రిలేజ్ అని అంటాం. అది (సాకర్) అనగా పవిత్రమైన మరియు (లిగారె) అనగా దొంగలించుట. అనగా 'పవిత్రమైన వస్తువులను దొంగలించుట సాక్రిలేజ్. ఇది వాచికమైనప్పుడు అవి దైవదూషణము అని కూడ కొన్ని సందర్భంలో అంటారు. అది భౌతికమైనప్పుడు అపవిత్రపరచటం అవుతుంది. దైవదూషణము మనకు కంటికి కనిపింపని దేవుడి గురించి అయితే భౌతికమైనది మన ముందు ఉండే వస్తులోకానికి చెందింది.

## 2. అపవిత్రీకరణములోని రకాలు

దీనిని మనం మూడు రకాలుగ పరిగణలోనికి తీసుకోవచ్చు. మొదటిది, వ్యక్తిగత పరమైన అపవిత్రీకరణం, రెండవది ప్రాంతీయ పరమైన అపవిత్రీకరణము, మూడవది వాస్తవిక పరమైన అపవిత్రీకరణము. మనం ఈ మూడు రకాల అపవిత్రీకరణాల గురించి క్లుప్తంగా తెలుసుకుందాం.

## 2.1. వ్యక్తిగత పరమైన అపవిత్రీకరణము

వ్యక్తిగత అమంగళం అనగా పవిత్ర పరచబడిన లేక దేవునికి అర్పించబడిన వ్యక్తులను లేక అభిషక్తులను, దేవుని సేవకై తమ జీవితాలను అంకితం చేసుకున్న వ్యక్తుల పట్ల అగౌరవము చూపించడం. ఈ నవ యుగంలో గురువుని లేక దేవుని సేవకుడిని కూడ అందరిలాగా చూస్తూ ఎటువంటి వ్యత్యాసం చూపకపోవడం మన అందరికి సాధారణ విషయం అయింది. ఉదా : మన పెద్దలు గురువు వస్తున్నాడు అంటే ఎంతో వినయ విధేయతలతో గౌరవిస్తు వారు

చెప్పింది వినేవారు. కాని మనకు ఈ రోజుల్లో కూడ కొంత మంది మాత్రమే గురువుని దైవ సేవకుడిలాగా చూస్తున్నారు. చాలా మంది గురుత్వ అంతస్తును గుర్తించక వారికి గౌరవాన్ని ఇవ్వడం కాక కొన్ని సందర్భాలలో వారి గురించి చెడుగా మాట్లాడడం చేస్తుంటారు. అనగా ఈ బిడ్డలను భౌతికంగా గాయపరచడం, తత్ఫలితముగా ఆయన గౌరవాన్ని దిగజార్పడము. కారణాలు ఏమైన అభిషక్తులను గౌరవించినట్లయితే అది భగవంతుడైన క్రీస్తు ప్రభువునకు ఇస్తున్నారు అని తెలుసుకోవాలి.

ప్రాచీన కాల తిరుసభ చట్ట ప్రకారం తిరుసభకు కొంత అధికారం మరియు సామాజిక వ్యవస్థ విధించే చట్టాల నుండి కొంత స్వేచ్ఛ ఉండేది. అయితే ఎవరైన దీనిని వ్యతిరేకించి పవిత్రపరచబడిన వారిని న్యాయసభకు తీసుకొని వచ్చేవారు అమంగళకర పని చేసినట్లే, అటువంటి వారు తిరుసభ నుండి చట్ట ప్రకారంగా వెలివేయబడేవారు. ఇది సమాజంలో వ్యక్తులు, గురువులను లేదా దేవున్ని సేవకు అంకితం అయినవారి మీద చేసే పనులు అయితే ఇప్పుడు దైవసేవకు అంకితమైన వారు వారి జీవితాలలో ఏవిధంగా అపవిత్రీకకరణం చేయబడతారో చూద్దాం.

గురుపట్టం ద్వార మరియు ఇతర మాటపట్టుల ద్వారా దేవునికి తమను తాము సంపూర్ణంగా సమర్పించుకున్న వారి జీవితంలో వారు అనుసరించే విరక్తత్వమునకు వ్యతిరేకంగా చేసే ఏ చిన్న కార్యమైన అమంగళకరమైనదే. డీకను పట్టం పొందుతున్నప్పుడు తమ తండ్రి గారికి (బిషప్) ప్రతి అభ్యర్థి "నేను విరక్తత్వమునకు సిద్ధంగా ఉన్నాను" అని వ్రాస్తారు. తండ్రిగారు దానిని స్వీకరిస్తారు.

అదే విధంగా మఠకన్యలు వారి సభలో ఉన్న నియమాలను ఎరిగి వారి జీవితాలను ఎంచుకుంటారు. కాని ఈ రోజుల్లో దురదుష్టవశాత్తు మనకు ఎక్కడనో ఒక దగ్గర అభిషిక్తులైతేనేమి, కన్యాస్త్రీలునైతేనేమి లేక ఇతర మాటపట్టులను తీసుకున్నవారు లేదా దైవ సేవకు అంకితం చేయబడిన వారు ఈ ఆధునిక యుగానికి దాసోహం అయిపోయి కొంత మంది వారికి దేవుడు ప్రసాదించిన పిలుపును గుర్తించక ముఖ్యంగా విరక్తత్వమునకు వ్యతిరేకంగా పాపములను చేస్తున్నారు. కొన్ని మనం మన సమాజంలో కాని, రాష్టంలోకాని, దేశంలో కాని లేక ప్రపంచంలో జరిగిన సంఘటనలు మనకు తెలుసు.

## 2.2. ప్రాంతీయపరమైన అపవిత్రీకరణము

ప్రాంతీయ అమంగళం అనగా పవిత్రమైన స్థలాలను అపవిత్రీకరణము చేయుట. పవిత్రస్థలం అనగా కేవలం దేవాలయం మాత్రమే కాదు కాని హితోపదేశం చేయడానికి ఉపయోగించే స్థలాలు, క్రైస్తవులను సమాధి చేయడానికి చట్టపరంగా ఏర్పరచబడిన సమాధుల స్థలము ధ్వంసం చేయడం కూడ ప్రాంతీయ అమంగళము లేక ప్రాంతీయ పరమైన అపవిత్రీకరణము ముఖ్యంగా నాలుగు రకాలుగా విభజించొచ్చు. మొదటిది, దేవాలయంలోని దేవాలయాలకి సంబంధించిన వస్తువులను దొంగలించుట. రెండవది, దేవాలయంలోని స్థలాలను, పీఠాధిపతుల నివాసాలను, గురువుల నివాసాలను మఠాశ్రమాలను, మరియు ఇతరత్రా దైవస్థలాలు, పీఠాధిపతులచే అధికారికంగా ఆశీర్వాదించబడిన ఆసుపత్రులు, స్కూలు, దివ్యబలిపూజలను కొనియాడే స్థలాలు ముఖ్యంగా చిన్న ప్రార్థన మందిరాలు, కమ్యూనిటి హాల్స్, ద్వంసం చేయడం కూడ అమంగళమే. ఎందుకంటే ఇవన్నీ పవిత్రమైన కార్యాలకు దేవుని మహిమ కొరకు మరియు మానవుని రక్షణ కొరకు సహాయపడే వీటన్నిటి మీద వ్యతిరేకంగా చేయటం మరియు వాటి మీద, గోడల మీద చెడ్డగా వ్రాయడం, ధ్వంసం చేయడం కూడ అపవిత్రీకరణము అవుతుంది. మూడవది, పవిత్ర స్థలాలలో ఏ పాపకార్యమైన పని ఏది చేసినా అమంగళమే అవుతుంది. అనగా పవిత్ర స్థలంలో నరవధ, మనిషి అంతరాత్మను కబళింపచేసే ఏ దుష్క్రియయైన, లైంగిక క్రియలు, జ్ఞానస్నానం పొందని వ్యక్తులను, తిరుసభ నుండి బహిష్కరించబడ్డ వ్యక్తులను, తిరుసభ చట్టాలను అతిక్రమించి మరణించిన వారిని పవిత్ర స్థలాలయందు సమాధి చేయడం లాంటి క్రియలన్నీ అమంగళకరము. నాలుగవది, కొన్ని క్రియలు అవి పాపకార్యమైనవి అయినా, కాకపోయినా, స్వతహాగా చేసినా లేదా ఏదైన చట్టానుసారంగా పవిత్ర స్థలంలో చేసినట్లయితే అది అపవిత్రీకరణము అవుతుంది. అందులో కొన్ని దేవాలయాన్ని వ్యాపారస్థలంగా మార్చడం మంచిదికాదు. అందుకే క్రీస్తు ప్రభు కూడా దేవాలయాన్ని వ్యాపార స్థలంగా మార్చడం ఓర్చులేకపోయాడు. "యేసు దేవాలయములో ప్రవేశించి, క్రయవిక్రయములను చేయువారిని బయటికి వెడలగొట్టి, రూకలు మార్పువారి బల్లలను, పావురములను అమ్మువారి పీటలను పడద్రోసి, నా ఆలయము ప్రార్థనాలయము అనబడును, అని వ్రాయబడియున్నది

కాని, మీరు దానిని దొంగల గుహగా చేయుచున్నారు అనెను (మత్తయి 21:12-13 మరియు  లూకా 19:45-46) "యేసు దేవాలయములో ఎడ్లను, గొర్రెలను, పావురములను అమ్మువారిని, డబ్బులు మార్చువారిని చూచెను. ఆయన త్రాళ్లతో, కొరడా పేని, గొర్రెలను, ఎడ్లను అన్నింటిని ఆలయము వెలుపలకు తోలెను. డబ్బులు మార్చువారి నాణెములను చిమ్మివేసి బల్లలను పడద్రోసెను". (యోహాను 2:14-16). వత్తులు, పూలు, ఇలా చెప్పుకుంటూపోతే ఎంతగానో ప్రభావితం అవుతుంటారు భక్తులు. కొన్నిసార్లు చందా డబ్బులు వసూలు చేయడం కూడ చెప్పుకోవచ్చు. పెళ్ళిళ్లకు, పండుగలకు గుడిని కొన్ని చోట్ల విందు వినోదాలకు స్థావరంగా మలచడం, న్యాయ తీర్పులకు ఒక సభా స్థలంగా మలచడం, ఇంకా విచారకరమైన విషయమేమిటంటే కొంత మందికి ఆ పవిత్ర స్థలాలు మీటింగ్ స్పాట్‌గా మారుతున్నాయి.

## 2.3. వాస్తవికపరమైన అపవిత్రికరణము

వాస్తవికపరమైన అపవిత్రీకరణము అనగా పైన పేర్కొనబడిన స్థలాలు మరియు వ్యక్తులకు విరుద్ధంగా వస్తువుల పట్ల అగౌరవపరమైన విధంగా ప్రవర్తించడం. మొట్టమొదటగా, ఒక వ్యక్తి చావైన పాపంలో ఉండగా దివ్య సంస్కారాలను అతనికి ఇవ్వడం వలన వస్తువులు అమంగళం అవుతాయి. దివ్య సత్ప్రసాదం పట్ల చేసే అగౌరవక్రియలను, సంసిద్ధత లేకుండా స్వికరించడం అన్నిటికంటే ఎక్కువగా పరిగణించబడ్డవి. కొంత మంది అవిశ్వాసులు లేక విశ్వాసులు కూడ ప్రభు శరీరాన్ని అర్థరహితంగా స్వీకరిస్తారు. దివ్య సత్ప్రసాదాన్ని కొంతమంది అవిశ్వాసంగా స్వీకరించడమే కాకుండా దాని యెడల పాపం చేస్తుంటారు. గుడిలో లేదా పూజబలిలో ఉపయోగించే సిలువను, బలిపీఠమును ఇష్టం వచ్చినట్లు వాడుతుంటారు. బలిపీఠము మీద నిలబడటం, కొంతమంది కూర్చోడం చేస్తుంటారు. దివ్య మందసం ఉన్నప్పటికి ప్రభు సన్నిధిని గౌరవించకుండా గట్టిగా అరవడం, దానిని ఒక ఆట స్థలంగా మారుస్తూ ఉంటారు. కొందరు పీఠాధిపతులు లేదా గురువులు ఉపయోగించే ఆసనాల మీద నిలుచోవడం, దైవవాక్కు పీఠాన్ని ఒక సాధారణ వేదికలాగా లేదా మైకును ఆ సందర్భంలో ఉపయోగించడం, జ్ఞానస్నాన జలకలశం, ప్రాయశ్చిత్త సంస్కారాన్ని

ఆచరించడానికి అనువైన చోటును, ఇష్టం వచ్చినట్లు వాడడం, పవిత్ర గ్రంథానికి ఇవ్వవలసిన గౌరవాన్ని ఇవ్వకపోవడం, పూజలో వాడే పవిత్ర వస్త్రాలను సరిగా ఉతకకపోవడం, పవిత్ర మృతావశేషములు, పవిత్ర పటాలను ముఖ్యంగా కొన్ని స్థలాలలో మనం తపస్కాలంలో ఉపయోగించే పదనాలుగు స్థలాల పటాలను తీసుకొని వెళ్ళి ఎక్కడనో స్టోర్ రూమ్‌లో మూలకు పడేస్తుంటారు. గురువులు ధరించే వస్త్రములను, అగౌరవంగా వాడడం, తీర్థాలు, ఉన్న స్థలంను శుభ్రంగా ఉంచకపోవడం లాంటివి కొన్ని, అన్నింటికంటే ముఖ్యంగా పునీతుల స్వరూపాలకు తగిన గౌరవాన్ని ఇవ్వకపోవడం, కొన్ని స్థలాలలో ప్రభుక్రీస్తు కంటే ఎక్కువగా స్వరూపాలకు అంకితం అవ్వడం, భక్తి కృత్యాలకు పెద్ద పీఠవేయడం సరియైనది కాదు. ప్రథమంగా త్రిత్వైక దేవుని ఆరాధించాలి. ఇతర భక్తి కృత్యాలు, స్వరూపాలను గౌరవించడం మొదలైన భక్తి దేవుని ఆరాధన తరువాత మాత్రమే.

## 3. పరిశుద్ధ గ్రంథములో ఉన్న అపవిత్రీకరణ సంఘటనలు

### 3.1. దేవాలయమును కొల్లగొట్టుట

**1. రాజుల దినచర్య రెండవ గ్రంథము 28:24**

"ఆహాసు దేవాలయ పరికరములను నాశనము చేసెను. దేవాలయము తలుపులు మూయించెను".

**2. రాజుల రెండవ గ్రంథము 12:18**

"యాజకులు బలి అర్పణమునకు వచ్చు సొమ్మును ముట్టుకోకుండుటకు సమ్మతించిరి. గుడి మరమ్మతులు తమ పని కాదనియు తెలియచేసిరి"

**3. రాజుల రెండవ గ్రంథము 18:16**

"దేవాలయద్వారములకును, ద్వారబంధములకు పొదిగిన బంగారమును కూడ ఒలిపించి అస్సిరియా రాజునకు పంపెను"

### 3.2. నిందించుట

"ఆ నైవేద్యమును మూడవనాట భుజించువాడు నాకర్పింపబడిన పవిత్ర వస్తువును సామాన్య వస్తువు వలె చూచినట్లు అయితే అతడు నా ప్రజల నుండి వెలివేయబడును"

### 3.3. నిషేదించుట

#### 1. 1 కొరింతీ 3:17

"ఎవడైనను దేవుని ఆలయమును ధ్వంసము చేసినచో దేవుడు వానిని ధ్వంసము చేయును. ఏలయన, దేవుని ఆలయము పవిత్రమైనది. మీరే ఆయన ఆలయము".

### 3.4. బైబులు ఆధారాలు

#### 1. సంఖ్యాకాండము 3:4

"సినాయి ఎడారిలో ప్రభువునకు నియమ విరుద్ధముగా అగ్నిని సమర్పించినందులకు నాదాలు, అబిహు ప్రాణములు కోల్పోయిరి".

#### 2. లేవియకాండము 10:2

"ప్రభువు సన్నిధి నుండి ఒక అగ్ని జ్వాల వెడలి వచ్చి వారిని నిలువున కాల్చి చంపెను".

### 3.5. ఉజ్జియ దేవుని ఆజ్ఞను ధిక్కరించుట

#### రాజుల దినచర్య రెండవ గ్రంథము 26:18

యాజకులు వారించుచు "రాజా! ప్రభువుకు సాంబ్రాణి పొగ వేయుట నీ పనికాదు. ఇది అహరోను అనుయాయులై శుద్ధిని బడసిన యాజకులు చేయవలసిన కార్యము. కనుక నీవు దేవళము నుండి వెలుపలికి పొమ్ము. నీవు ప్రభువును ధిక్కరించితివి. కనుక అతని అనుగ్రహమును కోల్పోయితివి"

### 3.6. ప్రభు భోజనమును చేయుట

#### 1 కొరింతీ 11:29

"ఏలయన ఎవడైనను రొట్టెను తినుచూ, పాత్ర నుండి త్రాగుచూ అది ప్రభువు శరీరము అని గుర్తింపనిచో, అతడు తినుటవలన త్రాగుటవలనను తీర్పునకు గురియగును"

### 3.7. వస్తువుల పట్ల

#### దానియేలు గ్రంథము 5:1-4

"బెల్షస్సరు రాజు గొప్ప విందు చేయించి, తన తండ్రియైన నెబుకద్నెజరు యెరుషలేము దేవాళయం నుండి కొల్లగొట్టి తెచ్చిన వెండి బంగారు పాత్రముల నుండి ద్రాక్షారసమును త్రాగెను...

## 4. శ్రీసభ చట్టం ఆధారాలు

**1. ఆర్టికల్ 1367 :** "దివ్య సత్ప్రసాదాన్ని ఏవ్యక్తయిన అపవిత్రీకరణము చేయాలనే తలంపుతో పడవేసినట్లుయితే, ఆ వ్యక్తిని, తిరుసభ నుండి తొలగించబడును.

**2. ఆర్టికల్ 1376 :** "ఒకవేళ గురువు పై కార్యము చేసిన ఎడల పూర్తిగ తిరుసభ నుండి తొలగించబడడు, కాని, కొంత జరిమానాతో శిక్షింపబడతాడు".

## ముగింపు

అపవిత్రీకరణము విలువలకు విరుద్ధం. ఇది మత సుగుణానికి వ్యతిరేకం కాబట్టి పాపం. కావుననే తిరుసభ దీనిని పాపంగా పరిగణిస్తుంది. దేవుడు సృష్టించిన సృష్టి, ఆయన కంటికి అంతా బాగుగా ఉన్ననూ, ఆయనను ఆరాధించడానికి ప్రత్యేకించబడిన వ్యక్తులను, స్థలాలను, వస్తువులను మిక్కిలిగా ఇష్టపడుతాడు. ఎందుకంటే వీటి అన్నింటిలో ముఖ్యంగా తన ఉనికి ఉంటుంది. దైవభీతి ఉన్న ఏ భక్తుడు కూడ పవిత్రమైన వాటిని లేక పవిత్రపరచిన వాటిని నాశనం చేయడానికి పూనుకోడు. చరిత్రలో చుస్తాం, ఎవరైతే పవిత్ర వస్తువులను మలినం చేశారో వారిని దేవుడు శిక్షించాడు. దేవుడు ఎంత ప్రేమా స్వరూపుడైనను తనకు ఇష్టమైన వాటిని అగౌరవపరుస్తే శిక్షిస్తాడు. కాబట్టి పవిత్రపరచిన దాని ఔన్నత్యాన్ని గుర్తు చేసుకుంటూ, దైవార్చనలో భాగం అయిన ప్రతి దానిని గౌరవిస్తు, దీవెనలు పొందుతూ, వాటి గొప్పతనాన్ని కాపాడుట, వాటి ద్వారా దేవున్ని మహిమ పరుచుదాం.

❋ ❋ ❋ ❋

# 5. భవిష్యవాణి - జాతకం

**- బ్రదర్ చింతగుంట్ల జగన్**

**ఉపోద్ఘాతము**



ప్రతి మనిషి సంతోషంగా, ఆనందంగా, ఆహ్లాదకరంగా, జీవించాలని కోరుకుంటూ, అటువంటి దానికై ఆరాటపడుతూ ఉంటాడు. ఇటువంటి ఆనందం కొందరికి ధనంలో, కొందరికి ఆస్థిపాస్తులలో కొందరికి పేరు ప్రతిష్టలలో మరికొందరికి విజయాలలో ఇలా ఎన్నెన్నో విషయాలలో ఆనందాన్ని అన్వేషిస్తూ, దానికై ప్రాకులాడుతుంటారు. వీటన్నిటిలో ముఖ్యమైన విషయం కష్టేఫలి అన్న సూక్తి మరచి, దొడ్డిదారులలో పొందాలని ఆశించేవారు లేకపోలేదు. ఇటువంటి వారిని ఆసరాగా తీసుకొని చాలామంది జాతకం చెప్పడం ప్రారంభించారు. ఈ జాతకం చెప్పేవారు కొన్ని ముఖ్యమైన విషయాలను పరిగణలోనికి తీసుకుంటారు. అవి ఏమనగా ఒక వ్యక్తికి పెళ్లి ఎప్పుడవుతుంది అయితే అది పెద్దలు కుదిర్చిందా లేక ప్రేమ వివాహమా? వ్యాపారంలో ఒక వ్యక్తికి ఎంతవరకు కలిసి వస్తుంది? రేపటి రోజున నీ భవిష్యత్ ఏ విధంగా ఉండబోతుంది? భవిష్యత్‌లో నీకు ఎదురయ్యే ఆనందాలు, కష్టాలు, ఇబ్బందులు, ఇలా ఎన్నో విషయాలను పరిగణలోనికి తీసుకొని ఒక వ్యక్తి యొక్క జాతకాన్ని చెప్పడం ప్రారంభించారు. ఈ శాస్త్రాన్ని మన పూర్వీకులు అప్పట్లో, ఎక్కువగా నమ్మడం ప్రారంభించారు. దాని వల్ల ఆ రోజుల్లో అది ఎక్కువగా ప్రభావం చూపించిదనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

ఈ జాతకం చెప్పేవారు అనేక మార్గాలలో అలాగే అనేక పద్ధతులలో చెప్పేవారు. ఇందులో మొదటిది చెయ్యిచూసి జాతకం చెప్పడం దీనినే ఆంగ్లంలో

పాంపిస్ట్రీ అంటారు. అంటే చేతిలోని గీతల ఆధారంగా ఒక వ్యక్తి యొక్క భవిష్యత్ చెప్పడం. ఈ శాస్త్రాన్నే మన పూర్వీకులు ఎక్కువగా నమ్మేవారు. ఇది మన దేశంలోనే కాకుండా టిబేట్, చైనా, పర్షియా, బాబిలోనియా, సుమేరియా మొ॥ దేశాలలో కూడా బాగా ప్రాచుర్యం గాంచింది. చేతిలోని గీతలపై ఆధారపడి జాతకం చెప్పేవారు. ముఖ్యంగా మగవారికి మాత్రం కుడిచేతిని ఆధారంగా చేసుకుని, ఆడవారికి ఎడమచేతిని ఆధారంగా చేసుకుని వారి భవిష్యత్ చెప్పేవారు. ఇలా చేతిలోని గీతల ఆధారంగా చెప్పేవారు. ముఖ్యంగా చేతిలోని ఆరు ముఖ్యమైన గీతలపై ఆధారపడి జాతకం చెప్తారు. అందులో..

## 1. హృదయగీత

ఈ గీతను మనిషి యొక్క హృదయ స్పందనను తెలియజేసే గీతగా పరిగణిస్తారు. అంటే మనిషి యొక్క ఉద్రేకాలు, భావోద్వేగాలను పరిగణలోనికి తీసుకుంటారు. ఈ గీత అరచేత ప్రారంభ భాగం నుండి అలాగే చిటికెన వేలు నుండి ప్రారంభమై, బొటన వేలు వైపు తిరుగుతుంది. దీని ఆధారంగా చేసుకుని మనిషి భావోద్వేగాలు ముఖ్యంగా సంబంధ బాంధవ్యాలను పరిగణలోనికి తీసుకుంటారు.

## 2. జీవిత గీత

ఈ గీత బొటనవేలు నుండి ప్రారంభమై మోచేయి వైపు మళ్లుతుంది. దీని ఆధారంగా మనిషి ఎన్ని సంవత్సరాలు జీవిస్తాడు, ఆరోగ్య విషయాలు జీవితంలో మలుపు తిరిగే సంఘటనలు మొ॥ పరిగణలోనికి తీసుకుంటారు.

## 3. తలగీత

ఈ గీతను తలగీతగా మరియు విజ్ఞాన గీతగా పిలిచెదరు. ఈ గీత అరచేతిలోని చివరి నుండి ప్రారంభమై చూపుడు వేలు వైపునకు ప్రాకును. ఈ గీత ఆధారంగా మనిషి మేధాశక్తిని, ఏకాగ్రతను, విజ్ఞానమును, తెలివితేటలను, అవగాహనాశక్తిని, స్వార్థపూరిత భావాలను అంచనా వేస్తారు.

## 4. విధి గీత / తలరాత గీత

ఈ గీత ఆధారంగా మనిషి సాధించబోయే విషయాలను మరీ ముఖ్యంగా తాను అందుకోబోయే విజయాలను, దానికి అనుగుణమైన మార్గాలను, ఏవైనా అడ్డంకులు ఉంటే వాటిని తెలియజేస్తుంది.

## 5. సూర్యగీత

ఈ సూర్యగీతను అపొల్లో గీతగా కూడా పిలుస్తారు. ఈ గీత ఆధారంగా మనిషియొక్క విజయస్ఫూర్తిని, గౌరవ మర్యాదలను గురించి తెలియజేస్తారు.

## 6. మెర్క్యురీ గీత

ఈ గీతను ఆరోగ్య గీతగా కూడా పరిగణిస్తారు. ఈ గీత ఆధారంగా ఆరోగ్యపరమైన అంశాలను, వ్యాపారాభివృద్ధి అంశాలను, నేరాలకు సంబంధించిన విషయాలను, పరిగణలోనికి తీసుకుని మనిషి యొక్క ఆరోగ్యం ఎలా ఉంది. అతను ప్రారంభించిన వ్యాపారాలు, అలాగే తాను ఎదుర్కొనే సవాళ్లను గూర్చి తెలియజేస్తారు.

## చిలక జోష్యం

మనిషి యొక్క భవిష్యత్‌ను చెప్పటానికి చిలుకలను కూడా ఆసరాగా తీసుకుని, మనిషి యొక్క భూత, భవిష్యత్ వర్తమాన జీవితాన్ని అంచనా వేస్తారు. హస్తాన్ని చూసి జాతకం చెప్పేవారు చెప్పే విధంగానే, వీరు కూడా మనిషి యొక్క జీవితం గురించి పెళ్లి, వ్యాపారాలు, ఆర్థిక ఇబ్బందులు, సంబంధ బాంధవ్యాలు, ఆరోగ్య, అనారోగ్య సమస్యలు, ఇలా ఎన్నెన్నో విషయాలపై మనిషికి ఆసక్తి పెంచి, తమకు తోచిన విధంగా ఎదురు జాతకాన్ని చిలుకల వినియోగం ద్వారా చెపుతుంటారు. ఈ చిలక జోష్యం చెప్పేవారు సాధారణంగా చెట్టుక్రిందగాని లేదా రోడ్డు ప్రక్కన ఎక్కువగా కనిపిస్తుంటారు. ఎందుకంటే ఎక్కువగా రద్దీ ఉన్నచోటైతే జనాలు ఎక్కువగా ఆకర్షితులౌతారని అతని వద్ద ఒక చిన్న పంజరం. ఒకటి లేదా రెండు చిలుకలతో పాటు అతని వద్ద కొన్ని చిన్నపాటి కార్డులు వుంటాయి. ఆ కార్డులపై హిందూ మత దేవుళ్ల బొమ్మలు, బుద్ధుడి బొమ్మ, యేసుప్రభు ఇలా దేవుళ్ల బొమ్మలుంటాయి. ఎవరైనా అతని వద్దకు వచ్చినపుడు

చిలకను పేరుపెట్టి పిలిచి, ఏదో ఒక కార్డును తీసుకురమ్మంటారు. అలా తెచ్చిన కార్డుపై వున్న బొమ్మ ఆధారంగా ఎదుటి వ్యక్తి యొక్క భవిష్యత్ అంచనా వేసి చెప్పడం జరుగుతుంది.

**చరిత్ర**

ఈ చిలుక జోష్యం దక్షిణ భారతదేశంలో ఎక్కువగా ప్రారంభమై, అభివృద్ధిలోనికి వచ్చింది. అందులో ముఖ్యంగా తమిళనాడు, కేరళలో ఎక్కువగా ఈ చిలుక జోష్యం అనుకరణలోనికి రావడం జరిగింది. ఇది అలా క్రమంగా అన్ని ప్రాంతాలకు విస్తరణ గావించబడింది. మొదటిలో కొంతమంది క్రొత్తగా ఒక వింతగా తెలుసుకోవాలనే ఆతురతతో వెళ్లడం ప్రారంభిస్తే, కొంతమంది వారి జీవితాలలో ఎదురయ్యే సమస్యలకు పరిష్కారం కోసం ఇంకొందరు ఆరోగ్య సమస్యలు, పెళ్లి, వ్యాపారాభివృద్ధి, చదువు మొ॥ అనేక విషయాలపై వారికి తోచిన వారి వద్దకు వెళ్లడం అడగడం ఇలా ఈ చిలుక జోష్యం అభివృద్ధిలోనికి వచ్చింది. ఇందులో ఉపయోగించే చిలుకలు పచ్చని రంగులో ఉంటాయి. ఈ చిలుక జోష్యం అనేది వంశపారంపర్యంగా వచ్చింది.

చేతిగీతల ఆధారంగా, చిలుకల ఆధారంగా కాక పలు రకములైన మార్గాలలో జాతకం చెప్పడం ప్రారంభమైంది. అందులో కొన్ని...

## 1. Tarot

ఈ విధానంలో కొన్ని తయారు చేయబడిన కార్డులు వుంటాయి. ఈ కార్డులన్నీ కలిపి 78 వుంటాయి. జాతకం చెప్పించుకొనుటకు వచ్చిన వ్యక్తి యొక్క సమస్య మేరకు అందులోని కార్డు తీసి వచ్చిన వ్యక్తి యొక్క జాతకాన్ని చెప్పడం జరుగుతుంది. ఇలా కార్డులు తీసి చెప్పేటప్పుడు ప్రతిసారి ఒకే కార్డు రాదు కాబట్టి వేరే వేరేగా కూడా జాతకాలు వచ్చే అవకాశం లేకపోలేదు.

## 2. Pyromancy

ఈ విధానంలో నిప్పును, పొగను ఆధారం చేసుకుని మనిషి జాతకాన్ని చెప్తారు. బాగా మండే నిప్పులో నుండి చనిపోయిన శవాల ఎముకల ఆధారంగా అలాగే పైకి ఎగసే నిప్పురవ్వల ఆధారంగా వ్యక్తి యొక్క భవిష్యత్‌ను చెప్పడం జరుగుతుంది.

## 3. Tasseography

దీని ప్రకారం వచ్చిన వ్యక్తికి టీ ఇవ్వడం జరుగుతుంది. టీ త్రాగిన తర్వాత అందులో మిగిలిన టీ ఆకుల ఆధారంగా ఆ వచ్చిన వ్యక్తి జాతకాన్ని చెప్పడం జరుగుతుంది. ఇది అంతగా ప్రసిద్ధి చెందకపోయినా దీనిని కూడా నమ్మేవాళ్లు ఉన్నారు.

## 4. Crystal Gazing

ఈ విధానంలో జాతకం చెప్పేవ్యక్తి. క్రిస్టల్‌తో తయారు చేయబడిన గాజు పాత్రలోనికి ముఖం వుంచి, అందులో తనకు తెల్పబడిన సందేశాన్ని ఎదుటి వ్యక్తి భవిష్యత్‌గా చెప్పడం జరుగుతుంది.

## 5. Numerology

ఈ విధానం ప్రకారం మనిషి యొక్క పేరు, పుట్టిన తేది ఆధారంగా, అక్కడ ఉన్న నంబర్లతో పోల్చి, ఆ వచ్చిన నంబరు ఆధారంగా ఎదుటి వ్యక్తి యొక్క జాతకాన్ని చెప్పడం జరుగుతుంది. ముందుగానే తయారు చేయబడిన కార్డుల్లో వచ్చిన వ్యక్తి యొక్క పేరు, పుట్టినరోజును జతచేయగా వచ్చే నెంబరు ఆధారంగా కార్డును ఎంపిక చేసి జాతకం చెప్తారు.

## 6. Psychic

ఈ విధానంలో ఎవరైతే జాతకం కోసం వస్తారో అతని కూర్చోపెట్టి, జాతకం చెప్పే వ్యక్తి, వచ్చిన వ్యక్తికై ధ్యానం చేసి, ధ్యానంలో ఏ సందేశం అయితే వస్తుందో దానినే ఆ వచ్చిన వ్యక్తి యొక్క జాతకంగా చెప్తారు.

ఇలా ఎన్నెన్నో విధానాలలో తోటి మనిషి భవిష్యత్‌ను అంచనా వేసి, తనకు సంభవించే, సంభవించనున్న సంఘటనలను తెలియజేయడం జరుగుతుంది. ఇవేకాక, ఇదే తరహాలో కొన్ని చిన్నపాటి తరహాలలో కూడా భవిష్యత్‌ను చెప్పడం జరుగుతుంది.

## 7. ఒనెరోమెన్సి

ఈ విధానం ద్వారా ఒక వ్యక్తికి వచ్చే కలలు ఆధారంగా ఆ వ్యక్తి యొక్క భవిష్యత్‌ను అంచనా వేసి చెప్తారు.

## 8. ఒనోమెన్సి

వ్యక్తుల యొక్క పేర్లు ఆధారంగా చేసుకుని, ఆ పేరులోని అక్షరాల ఆధారంగా ఎదుటివారి భవిష్యత్ చెప్పడం జరుగుతుంది.

## 9. నాలుగు స్తంభాల ద్వారా

నాలుగు స్తంభాలు అంటే ఒక వ్యక్తి యొక్క పుట్టనరోజు, గడియ, సంవత్సరం, నెల ఆధారంగా భవిష్యత్ చెప్పడం ఇలా ఎన్నెన్నో రకాలు వున్నాయి.

## భవిష్యవాణిపై మతం యొక్క ప్రభావం

వీటికి సంబంధించి ప్రధానమైన ముఖ్యమైన క్రైస్తవం, యూదా, ఇస్లాం మొ॥ మతాలు దీనిని తీవ్రంగా ఖండించాయి. ఎందుకంటే ఇవి దేవుడిచ్చిన ఆజ్ఞలకు మరియు మతానికి సంబంధించిన సిద్ధాంతాలకు వ్యతిరేకంగా వున్నాయి.

## సత్యోపదేశం యొక్క వివరణ

కతోలిక సత్యోపదేశం నెం.2115-2117 మనకు చాలా స్పష్టంగా తెలియజేస్తుంది. అన్ని రకాల భవిష్యవాణులు మరియు సోదెలను తిరస్కరించాలి. అంతేకాక, భూత, ప్రేత, పైశాచిక విద్యలు లేదా మాంత్రిక అభ్యాసాలు కూడా విడనాడాలి. తన ప్రవక్తలకు పునీతులకు దేవుడు భవిష్యత్‌ను బయలుపరచగలడు. అయినా భావిజీవితం గూర్చి ఉభలాటాన్ని వదలి తన భవిష్యత్‌కు సంబంధించిందంతా నమ్మకంతో దైవ కటాక్షం చేతుల్లో పెట్టడం సరియైన క్రైస్తవం.

## ఒక క్రైస్తవునిగా...

ప్రియ సహోదరులారా! మనం క్రీస్తుని అనుసరించే బిడ్డలుగా ఏదైనా కష్టం నష్టం వచ్చినపుడు కృంగిపోవడమో, లేక సంతోషంగా సిరిసంపదలతో ఉన్నప్పుడు ఎగిరి గంతులేయడం అవసరం లేదు. ఎందుకంటే మనం కష్టపడినా, సుఖపడినా అది ప్రభువు మహిమ కొరకే, అనుకోవాలేగాని కష్టాలు, నష్టాలు వచ్చినపుడు, కృంగిపోయి, దేవునిపై నమ్మకం కోల్పోయి, చిలక జోష్యం చెప్పేవారినో లేక ఏ సోదె చెప్పేవారినో ఆశ్రయించకూడదు. మన ఆశ్రయం, ఆదరణ, ఆదరువు, ఆనందం క్రీస్తే. ఈ లోకంలో మానవులు తమ జీవనోపాధి

కోసం అను నిత్యం శ్రమిస్తారు కాని కొందరు మాత్రం కష్టపడకుండా జీవితంలో పైకి రావాలని, తప్పుడు మార్గాలను ఎన్నుకుంటున్నారు. అవేమనగా హత్యలు, దొంగతనాలు మొ॥ ఇవి కూడా పది ఆజ్ఞలకు విరుద్ధం. అలానే కొందరు జ్యోతిష్యం, సోదెలను, ఆశ్రయిస్తున్నారు. “మీలో కొందరు సోమరిపోతులుగా ఉన్నారనియు వారికి ఇతరుల వ్యవహారంలో తలదూర్చుట తప్ప వేరే పనిలేదనియు మేము వినియున్నాము (2 తెస్స 3:11). మనిషి కష్టపడకుండా డబ్బు సాధించవచ్చేమోగాని, సంతృప్తిని, అంతరంగీక ఆనందాన్ని సంపాదించుకోలేదు. పనిచేయవలసిన బాధ్యత మనందరికి వుంది. పని చేయకుండా సోమరులుగా కృషి సల్పకుండా ఉచితంగా ఆహారాన్ని పుచ్చుకోవడాన్ని పౌలుగారు ఖండిస్తున్నారు (2 తెస్స 3:10). మన భవిష్యత్ మనలను సృజించిన దేవునిపై, మరియు మనపై మాత్రమే ఆధారపడి ఉంది. అంతేకాని వేరే ఏ వ్యక్తులపై కాదు. జాతకం, జ్యోతిష్యం చెప్పేవాళ్లు దేవుళ్లు కాదు. మన భారం, కష్టాలు, ప్రభువుపై మోపి, ఆయన అడుగు జాడలైన నీతి, న్యాయం, ధర్మం, శాంతి, సమాధాన గుణాలు కల్గి, ప్రభువు వలే నిరంతరం కృషి సల్పుతూ దేవుని చిత్తానికి తలవంచి యోధులవలే పోరాడుదాం... జీవితాన్ని సఫలీకృతం చేసుకుందాం.

## జ్యోతిష్యం ముసుగులో దోపిడి

నీ భర్తకు ప్రాణగండం ఉంది. నెల రోజుల్లో అతడు చనిపోతాడు. హోమం చేస్తే ముప్పు తప్పుతుంది అంటూ మహిళల సెంటిమెంట్‌లను క్యాష్ చేసుకుని భారీగా డబ్బు వసూలు చేయడంతో పాటు, పలువురిని లొంగ తీసుకున్న నకిలి స్వామీజీ గుట్టు బయటపడింది. జ్యోతిష్యం పేరుతో హోమాలు, పూజలు చేస్తానంటూ అమాయకులను నిండాముంచిన భవిష్యవాణి జ్యోతిష్యాలయం నిర్వాహకుడు నర్సింహాచార్యులను రాచకొండ ఎస్‌వోటి, ఎల్బీ నగర్ పోలీసులు గురువారం సెప్టెంబరు 2017న తమ ఆధీనంలోకి తీసుకున్నారు. ఎల్బీనగర్ డీసిపి ఎంవీ రావు తెలిపిన వివరాల ప్రకారం ఖమ్మం జిల్లాకు చెందిన నర్సింహాచార్యులు ఏడేండ్ల క్రితం బాలాపూర్ ఆయోధ్య నగర్‌కు వలస వచ్చాడు. పదో తరగతి మాత్రమే చదివిన అతడు జ్యోతిష్యుడుగా అవతారమెత్తి గాయత్రి నగర్‌లోని ప్రాంతంలో భవిష్యవాణి జ్యోతిష్యాలయాన్ని ప్రారంభించాడు. అన్ని రకాల సమస్యలను పరిష్కరిస్తానంటూ పలు టీవీ చానళ్లకు ప్రచారం

అందించుకున్నాడు. తన వద్ద ఆధ్యాత్మిక చిట్కాలున్నాయని ప్రసంగాలతో నమ్మించాడు. అతడి మాయమాటలు నమ్మి చాలామంది ఆశ్రయించారు. ముఖ్యంగా మహిళలు ఫోన్ చేస్తే నేరుగా వచ్చి కలవాలని చెప్పేవాడు. భర్త చనిపోతాడనో, కుటుంబ కలహాలు పెరుగుతాయనో చెప్పి లక్షల్లో డబ్బు వసూలు చేసేవాడు. ఇది ఈ మధ్య జరిగి వెలుగులోనికి వచ్చిన ఒక సంఘటనే. ఇలా ఎన్నో ఉండవచ్చు. ఇలాంటి వారిని ఇంకెంతకాలం నమ్ముదాం.. ఒక్కసారి ఆలోచిద్దాం..

**ముగింపు**

అగ్నిలో పరీక్షించబడితే బంగారం మెరుస్తుంది. అలానే కష్టాలను, నష్టాలను, ఆనందాలన్నింటిని అనుభవించి పరిరక్షించబడ్డ ప్రతి వ్యక్తి జీవితం వెలుగొందుతుంది. జీవితం వెలుగుమయం అవ్వాలంటే, ప్రతి నిమిషం, ప్రతి క్షణం పరీక్షించబడుతూ తప్పటడుగులను సరిచేసుకుంటూ, అభివృద్ధి వైపుకు పరుగు తీయాలి. అంతేకాని "ఎలాగైనా" అనే ధోరణిలో ముందుకు సాగకూడదు. మరీ ముఖ్యంగా కష్టేఫలి అన్న మాటను మరచి సుఖమైన మార్గాలను అన్వేషిస్తూ ఎదుటి వ్యక్తిని ముంచి తాను పైన తేలియాడాలనుకోవడం చాలా పెద్ద తప్పు. ఒక వ్యక్తికి రాబోయే కష్టాలు, ఒక వ్యక్తి ఎదుర్కొనే బాధలను వేరొక వ్యక్తి చెప్పగలిగితే నేడు మనిషి ఎదుర్కొంటున్న విధ్వంసాలను నేరాలు, పెనుతుఫానులు ఎప్పుడో రూపుమాపేవి కదా'

ఉదా: అపార్ట్‌మెంట్‌లు కూలి చాలామంది ప్రాణాలు కోల్పోయారు. అలానే యాక్సిడెంట్‌ల రూపంలో ప్రతి గంటకు ఒకరు చనిపోతున్నారు, ఎన్నో సునామీలు, అనేకమైన దాడులు ఎన్నెన్నో చోటు చేసుకుంటున్నాయి. వీటన్నింటిని జాతకాలు, సోదెలు, మిగతా మార్గాలలో భవిష్యత్ చెప్పేవారు ముందే చెప్పేస్తే ఇంత ప్రాణహాని, ఆస్తినష్టం ఉండదు కదా... ఒక్కసారి ఆలోచిద్దాం. నిజమేదో తెలుసుకుందాం. ప్రపంచంలో కష్టానికి మించిన వేరే మార్గంలేదని గుర్తిద్దాం. కష్టాన్ని ఇష్టంగా చేసుకుని అడుగులు ముందుకు వేద్దాం! విజయాన్ని మన బానిసగా చేసుకుందాం.

❋ ❋ ❋ ❋

# 6. లౌకిక వాదం

- బ్రదర్ పలిసెట్టి ఆనంద్ రావు

## ఉపోద్ఘాతము



జార్జ్ జెకోబు హోలియోకె అనే బ్రిటిష్ మహాశయుడు "సెక్యులరిజం" (లౌకికవాదం) అనే పదాన్ని 1846 లో ప్రయోగించాడు. ఈ పదం ప్రపంచంలో ఎంతో వాడుకలో ఉన్నది. దానికి సరైన అర్థం నిర్వచనం ఇవ్వలేకపోయిరి. పదం యొక్క మూలల్లోకి వెళితే, లాటిన్ "సెక్యులారిస్" నుంచి వచ్చిన పదానికి లాటిన్లో అర్థం "ప్రాపంచికం" అని మన వికిపీడియా చెప్పింది. దానిని జాకోబు హోలియోకి మాటల్లోనే సెక్యులరిజం అంటే ప్రభుత్వ విధి, విధానాలను "మతం" నుంచి వేరుచేయడం, ప్రభుత్వ విధి విధానాల్లో చర్చి (మతం) జోక్యాన్ని లేకుండా చెయ్యడం.

లౌకికవాదం అనే పదమునకు ప్రాపంచిక, ఐహిక, ఇహ లోకానికి సంబంధించిన అనెడి అర్థం వస్తుంది. లౌకికం అనగా పవిత్రతకు విరుద్ధమైనది. ఎందరో తత్వవేత్తలు, నాస్తికులు, మరెందరో లౌకికవాదము పట్ల మొగ్గు చూడడమే కాక దానిని ప్రభావితం చేయడం జరిగింది. మానవుడు ఎల్లప్పుడు తీరని దాహంతో గమ్యం స్పష్టంగా కనరాక అటు ఇటు తిరుగాడుతూ ఉండే లౌకిక వాదోపవాదాలు ప్రపంచాన్ని చూపించి ఇదే గమ్యం అంటు మనిషిని ఐహిక వాంఛలలో ముంచెత్తుతున్నారు. లౌకికం అనగా ఎందరో ఎన్నోన్నో అర్థాలను, భావాలను మన ముందు ఉంచినప్పటికీ మనం రెండు అర్థాలను పరిగణలోనికి తీసుకొని పరిశీలించుదాం. మొట్టమొదటిగా ముందు నుడివినట్లుగా పవిత్రకు విరుద్ధమైనది రెండవదిగా తన స్వేచ్ఛతో తన ఇష్ట పూరితమైన మతాన్ని అనుసరించడం. అయితే ఈ రెండు అంశాలను లేదా ఏదేని ఒక దానిని పాటిస్తూ నొక్కి వక్కానిస్తూ

చెప్పెడివారు – లౌకిక వాదకులు. ఈ లౌకిక వాదకులు చేసే వాదనలన్నింటిని లౌకిక వాదం అని మనం పిలుస్తుంటాము.

శాస్త్రీయ పద్ధతుల వలన మరియు ఆలోచన విధానము వలన ప్రపంచమును అభివృద్ధి బాటలో నడిపించవచ్చు మరియు ఏ మతపరమైన నియమములతో సంబంధము లేకుండా మతపరమైన బోధనలపైన ఆధారపడకుండా మానవతా విలువలను బట్టి ప్రపంచము స్వచ్ఛతతో జీవించ వచ్చు అని లౌకికవాదం బోధిస్తుంది.

## లౌకిక వాదము – స్వేచ్ఛపూరిత మత అనుసరణ

యావత్ ప్రపంచంలో క్రైస్తవత్వం ఉన్న దేశాలు ఎక్కువ. అయినప్పటికి క్రైస్తవమతం వ్యాప్తి జరిగిన దేశాలలో కూడా ఇతర మతాల ప్రభావం లేకపోలేదు. మత బోధనలు స్ఫూర్తిని నింపితే సత్యాన్ని ఎరిగింపజేస్తే ఆ మార్గాన్ని అనుసరించేవారు కొందరైతే, తమస్వంత వాదనలతో మరొక మతాన్ని అనుసరిస్తూ, అనుసరించేవారు ఇంకొందరు. ఏ మతం గొప్ప అనే విషయానికంటే ఏ మతంలో శాంతి, సమాధానం, ప్రేమ, అనురాగం, సౌభ్రాతృత్వం దొరుకుతాయో ఆ మతంలో స్థిరపడాలి అనుకుంటాడు మానవుడు. అందుచేతనే కుటుంబీకులు, సన్నిహితులు, సమాజం అనుసరించే మతాన్ని సహితం ధిక్కరించగలిగి తాను కనుగొన్న మతంలో స్థిరపడి, తాను ఎంచుకున్న లేక తీసుకున్న నిర్ణయాలను ఇరుగు పొరుగు వారికి తెలియజేస్తూ తన మార్గానికి ఉన్న ప్రాముఖ్యతను బహిర్గతం చేయు విధానాన్ని వాదన అంటాము. చరిత్రయందు తత్వవేత్తల్లో ఓ తరగతికి చెందినవారు చార్వాకతత్వవేత్తలు, వీరు ఎల్లప్పుడు కూడా బలంగా, ధృడంగా నమ్మి ప్రచారం చేసిన అంశం – "నా ప్రాణమా, తిని, త్రాగి సుఖించుము, ఇదే అత్యంత రమ్యం, శాశ్వత ఆనందం అనుభవించు" అనే ఈ నినాదంతో వారు ముందుకు సాగారు. బాధలతో ఉన్న మానవుడికి వీటిని చూపగానే ఇదే శాశ్వతం అనుకున్నాడు. ఈ విధంగా సమాజాన్ని తప్పుద్రోవ పట్టిస్తూ, ఐహిక వాంఛలలో నెట్టడానికి ఎన్నో వాదనలు చేయదలచారు అయితే లౌకిక వాదము తప్ప ఒప్పు అంటే ఇది తప్పు, ఒప్పు కూడా అవుతుంది. తమకు గమ్యం స్పష్టంగా తెలియకపోయిన, తమ స్వలాభాల కొరకు సమస్యలను అధిగమించలేమనే భావనలతో, ఇతరుల సంతృప్తి

కొరకు, సత్యం లేకపోయిన పరువు శ్రేయస్సు కోసం ఒక మతాన్ని గుడ్డిగా తాము అనుసరిస్తూ ఇతరులను కూడా అదే లోయలోకి నెడుతూ ఉన్నప్పుడు లౌకికవాదం తప్పు అని చెప్పక తప్పదు. అట్లుగాక మతంలో ఉన్న బోధనల పరమార్థం గ్రహించగలిగి, సత్యాన్ని గుర్తించగలిగి, సత్యాన్ని గమ్యాన్ని చూడగలను అనే భావనతో తన శ్రేయస్సు కొరకు గాక పరుల శ్రేయస్సు కోసం జీవించాలి అని ఆ మతం అందించిన బోధనకు ముగ్ధుడై ఆ మతాన్ని అనుసరిస్తూ, ఇతరులను కూడా మంచి మార్గంలో కూడా పెట్టగలిగితే లౌకికవాదం ఒప్పు అని చెప్పకతప్పదు.

పాశ్చాత్య దేశములలో క్రైస్తవ మతము అభివృద్ధి చెందుతున్న సమయంలో ముస్లిములకు మరియు క్రైస్తవ మతముకు చాలా యుద్ధములు జరుగుతున్న సమయములో క్రైస్తవ అధికారులు మరియు ముస్లీము పెద్దలు తమ పవిత్ర గ్రంథములను ఇతర ప్రజలపై రుద్దుతున్న సమయములో ఈ లౌకిక వాదము పుట్టికొని వచ్చింది. చాలా మంది శాస్త్రవేత్తలు మరియు పరిజ్ఞానము కలవారు ఏది నిజము ఏ విధముగా ప్రజలను ఇటువంటి ఇబ్బందుల నుంచి తీసుకొని స్వేచ్ఛ గల ప్రపంచమును నిర్మించుదాము అనే నూతన విధానములతో ప్రపంచము అందులోని వస్తువుల వలన ఆనందము అభివృద్ధి ఉంది అనే భావనతో లౌకిక వాదమును ప్రారంభించారు.

## లౌకిక వాదము ఇతర దేశాలలో

చైన, జపాను మరియు ఇతర అభివృద్ధి చెందుతున్న దేశములు ప్రజలకు అన్ని వసతులను మరియు అన్ని అవసరములను తీర్చుతున్నాయి. వారికి అవసరమైన చదువును, ఉద్యోగములను, ఆహారమును, చదువు లేని వారికి పనిని కల్పిస్తుంది. అటువంటి స్థితిలో వారికి ఎటువంటి అవసరము ఎటువంటి సహాయము దేవుని నుండి ఆశించట్లేదు. ప్రభుత్వము అన్ని అవసరములను తీర్చుతుంది. ఇలా వున్న ఈ ప్రపంచము నానాటికి మనుష్యులకు వస్తువులే ఆధారం, మనుష్యులకు సంతోషాన్ని ఇస్తాయి అని వాటి వెనుకే తిరుగుతున్నారు. పాశ్చాత్య దేశములలో దేవుని మీద నమ్మకము నానాటికి అంతరించిపోతుంది.

## మానవ జీవితంలో మార్పులు

నిజానికి ఆధునిక యుగ ఆవిర్భావంతోనే మానవ చరిత్ర ఊహించని పరిణామాలకు లోనయింది. విజ్ఞానశాస్త్రం సాధించిన విజయాలు, మానవుల సృజనాత్మక కృషి ఫలితంగా ఆరంభమైన మార్పులు క్రమక్రమంగా సమాజంలోని అన్ని రంగాలకు ప్రపంచంలోని అన్ని దేశాలకూ విస్తరించి – మానవ జీవన శైలినే ప్రభావితం చేయగలిగాయి. మనుషులు ఆలోచనల్లో మార్పు వచ్చింది. ఆశల్లో ఆశయాల్లో ప్రాపంచిక దృక్పథంలో మార్పు వచ్చింది. పర్యావసానంగా సామాజిక సాంస్కృతిక వ్యవస్థల్లో మౌలికమైన మార్పులెన్నో సంభవించాయి.

ఈ మార్పులు ప్రపంచ ప్రగతికి, సామాజిక వ్యవస్థ ఎదుగుదలకూ దోహదం చేసినప్పటికే ఎదుగుదలతో వచ్చే ఎన్నెన్నో సమస్యలు వెర్రి తలలు వేసి, మానవ జీవనాన్ని అతలాకుతలం చేయనారంబించాయి. చివరికి తన గురించి తానే తెలుసుకో లేని అనిశ్చితి అతణ్ణి అవరించింది. మునుపెన్నడూ కనీవినీ ఎరుగని సిరిసంపదలు ఆధునిక ప్రపంచంలో పొంగి పొరులుతున్నాయి. సరికొత్త వనరులను సమకూర్చుకుంటూ ఆధునిక మానవులు ఆర్థికంగా సంపన్నులవుతున్నారు. ఇలా నడుమ వచ్చిన సిరులతో కొందరు సుఖభోగాలను అనుభవిస్తూ ఉంటే మరో పక్క ఆకలి బాధలతో రోగాలూ నిర్భాగ్యజీవనం గడపడం ఆధునిక ప్రపంచంలో కనిపిస్తోన్న ప్రధాన వైరుధ్యం. భౌతిక ప్రపంచాన్ని ప్రగతి పథంలో శరవేగంతో పరుగులు తీయించడానికి ఆధునిక మానవులుమైన మనము అను నిత్యమూ శ్రమిస్తునే ఉంటున్నాము. కానీ ఆధ్యాత్మిక వికాసానికి సముచితమైన స్థానంగా సరైన అవకాశాలుగానీ మనుష్యులకు కలిగించలేకపోతున్నాము.

## అంతరాత్మ – ఆత్మ గౌరవం

ప్రతి మనిషిలోనూ మనస్సాక్షి అనే అగోచరమైన వ్యవస్థ ఒకటి ఉంటుంది. దీనిని అంతరాత్మ అని కూడా అంటారు. ఇది నీతి చట్టాన్ని బోధిస్తూ ఉంటుంది. ఈ పని మంచిది ఇది చెయ్యి ఈ పని మంచిదికాదు దీనిని చెయ్యొద్దు. అందరినీ ప్రేమించు ద్వేషించకు, అసూయ చెందకు అని గుర్తు చేస్తూ మనిషికి మార్గదర్శిగా ఉంటుంది. అయితే మానవుడి అజ్ఞానం కారణంగా అంతరాత్మ సైతం కొన్ని

సార్లు తొట్రుపాటుకు గురయ్యే సందర్భాలుంటాయి. అయితే ఈ తరహా పొరపాటుల వల్ల అంతరాత్మ గౌరవానికేమీ హాని జరగదు. అయితే మంచీ చెడుల విచక్షణ కోల్పోయిన శక్తి, ఏది నైతికమో ఏది అనైతికమో తెలుసుకొనే ప్రయత్నమైనా చేయనిశక్తి పాపకర్మలాచరించడమే అలవాటుగా చేసుకున్న వ్యక్తి ఈ తరహా వ్యక్తుల అంతరంగాలు క్రమక్రమంగా మసగబారుతాయి, మొద్దుబారుతాయి. గౌరవహీనంగా మారుతాయి. మనము ఆత్మీయముగా సంఘపరంగా మంచి అభివృద్ధి సాదిస్తూ ఇతరులను ఎదిగే విధముగా పోత్సహించాలి.

## అసూయ

ఈ సప్తపాపాలలో అతిభయంకరమైనది, మనిషిని నిలువెల్ల క్రుంగదీస్తూ క్షణం క్షణం వత్తిడికిలోను చేస్తూ బాధలో ముంచెత్తే పాపమే "అసూయ". ఇతరుల అభివృద్ధిని సహించలేక మనసంతా రంపంతో కోసినట్లుగా బాధతో ముంచెత్తేదే అసూయ కోపము, క్రూరము వినాశకరమైనవి. కాని అసూయ హానికంటే ఘోరమైనది. దేశ, కాల, ప్రాయ, వృత్తి ప్రసిద్ధ బంధుత్వాలలో మనకు దగ్గర వాళ్ళెవరో వాళ్ళను గూర్చి ఎక్కువగా అసూయ పడతాం. మరిముఖ్యంగా లోకంలో ఒకే వృత్తికి చెందినవారు అందరి కంటే ఎక్కువ అసూయకు లోనౌతుంటారు. అరిస్టాటిల్ అసూయ వల్ల పుట్టేమనో వ్యాధికి చచ్చేంత వరకు మందే లేదు అని తెలియజేశాడు.

## గర్వము

అనగా "నేనే సర్వం (అంతా) అని భ్రమిస్తూ ఆ తలంపులో సృష్టికర్తయైన దేవుని శక్తిని కూడా మరచిపోవటమే గర్వం. గర్వం అనగా మనిషి తాను దేవునిగా పూజించుకోవడమే. నాకు తెలుసు నేను చేయగలను, నాకంటే గొప్ప ఎవరు లేరు అనే భావన. దీనిని మనమాటల్లో, చూపుల్లో హావభావాలలో సాధ్యమైనంత ఎక్కువగా చూపిస్తూంటారు. అందుకే దేవుని నుండి పొందిన లాభాలను మనకు స్వయంగా సాధించినట్లు భావించి, మన గమ్యం కూడా మనకు తెలుసు అని బలంగా నమ్ముతాం.

సిరాకు 10:12 సృష్టికర్తయైన ప్రభువును విడనాడుట గర్వమున తొలిమెట్టు.

## అంతరంగిక ఆనందం

ఆధునిక యుగంలో విజ్ఞానశాస్త్రం సాధించిన విజయాల వలన మనకు తాత్కాలిక ఆనందము ఉండవచ్చును. కాని అది సంపూర్ణముగా ఎప్పుడు మనతో వుండేదికాదు. మాకు తింటానికి తిండి, కట్టుకోడానికి, బట్టలేదే, ఆకలిబాధతో అహోరాత్రులు అల్లాడిపోతున్నామే, రోగాలు పీడించి చంపుతున్నాయే, మేము ఎలా ఆనందించగలం అని నిరుపేదలు అడుగుతున్నారు. వారికి మనము సరియైన సమాధానము చెప్పగలము. అవును అట్టి విషయ పరిస్థితుల్లో, ఆనందించటం ఒక విధంగా అసాధ్యమే అయితే బాధల్లో మన దృష్టిని దేవునివైపు మరల్చినపుడు అసాధ్యమైనది సుసాధ్యం కాగలదు. లోకములో పనులలో కొట్టుకొనిపోతున్న మానవళి కొరకు క్రీస్తు ప్రభువు "భారముచే అలసిసొలసియున్న సమస్త జనులారా నా యొద్దకు రండు, మీకు విశ్రాంతి నొసగెదను. మీ భారము ప్రభువు మీద మోపుదము, వస్తువుల మీద కాదు. క్రైస్తవ ఆనందం ఇహలోక సంబంధమైనదికాదు, ఐహిక ఆనందం వస్తు ఆనందము జీవిత పరిస్థితులపై ఆధారపడి ఉంటుంది. అది చంచలమైంది. అదృష్టం, అవకాశం ఆరోగ్యం, ఆశ, మొదలైన అంశాలపై ఆధారపడి తాత్కాలికంగా తృప్తి నొసగే అసంపూర్ణ ఆనందం అది క్రైస్తవ ఆనందం ఆధ్యాత్మికమైన ఆనందం. అది మానవ జీవితధ్యేయానికి సంబంధించినదై ఆత్మలో ఆగోచరంగా కూడియుండే ఆనందం.

మానవుని మాలిన్య పరచునది వాని అంతరంగము నుండి వెలువడునదియే ఏలయన, హృదయమునుండి దురాలోచనలు, వేశ్యా సంగమము, దొంగతనములు, నరహత్యలు, వ్యభిచారము, దురాశ, దౌష్ట్యము, మోసములు, కామము, మాత్సర్యములు, దూషణములు, ఆహంభావము, అవివేకము వెలువడును. ఇట్టి చెడుగులు అన్ని మానవుని అంతరంగము నుండియే వెలువడి అతనిని మలినపరచును (మార్కు 7:20-23). మన దీపం ద్వారా ఇంకో దీపాన్ని వెలుగిస్తే అది కాంతికి మరో కాంతియై మన దీపం యింకా ఎంతో ప్రకాశవంతమవుతుంది. సంఘం సంతోషమవుతుంది. అట్టి జీవితమే మనము ప్రపంచము నుండి ఆశించాలి.

## లౌకికవాదం - పవిత్రతకు విరుద్ధం

లౌకిక వాదమును ప్రత్యక్షముగానో పరోక్షముగానో అనుసరిస్తూ ఉంటాం. అనుసరించేవారు, దీనిని ఎంతో కొంత వ్యతిరేకిస్తూనే ఉంటారు. వ్యతిరేకించినప్పటికి అనుసరించడం కొనసాగిస్తూ దీనిని ప్రభావితం చేస్తూ ఉంటాము. లౌకిక వాదమును క్రైస్తవ మతం వ్యతిరేకిస్తుంది, ఖండిస్తుంది. ఎందుకనగా లౌకికవాదము పవిత్రతకు విరుద్ధము కనుక. పవిత్రత విలువైనది. వీలైనది, పవిత్రతను కోల్పోకుండా ఉండుటకు లౌకిక, ఇహలోక వాంఛలకు దూరముగా ఉండమని క్రైస్తవ మతం బోధిస్తుంది.

శాస్త్రీయ పరిజ్ఞానం, సాంకేతికత, ఏదైన సాధించగలను అనే భావన మొదలగునవి ప్రస్తుత సమాజంలో పరుగులు తీస్తూ ఉండే మానవుడు వీటికి ఆశ్చర్యచకితుడై దేవున్ని విడనాడి జీవిస్తున్నాడు. ఆయనపై భారం వేయడం మానేసి లోకంపై భారంవేస్తూ బ్రతుకుతున్నాడు. సాంకేతికత కూడా సమాధానం ఇవ్వలేని సమయాలలో దేవుని వద్దకు పరుగులు తీస్తూ ఉండే మానవుడు వీటికి ఆశ్చర్యచకితుడైన దేవుడిని విడనాడి జీవిస్తున్నాడు.

లౌకిక వాదము పవిత్రతకు అనగా దేవునికి విరుద్ధము. అందుచేతనే పాపము పవిత్రతకు అనగా దేవునికి విరుద్ధము. అందుచేతనే పాపము కట్టుకొనిన ఆది తల్లిదండ్రులు సాతానుచే శోధింపబడ్డారు. వారు పవిత్రతను కోల్పోయారు. దేవుని సమక్షం నుండి గెంటి వేయబడ్డారు. సాతాను చూపించిన ఆశలకు శిరస్సు వంచారు తత్ఫలితంగా దేవుని ముందు మోము ఎత్తలేకపోయారు.

హృదయంలో నుండి చెడ్డ తలంపులు, హత్యలు, వ్యభిచారాలు, లైంగిక అవినీతి వస్తాయి. హృదయశుద్ధితో, సంయమనంలో మోహావేశంలో పోరాటం సలుపటం అవసరం. హృదయశుద్ధి కలవారు ధన్యులు, వారు దేవుని చూచెదరు.

## ముగింపు

ప్రపంచ చరిత్రలో ఎందరో మహానుభావులు ఎన్నెన్నో కనిపెట్టడం జరిగింది. అవన్నీ మానవుని అవసరాలు తీరుస్తూ దేవుని దరిచేర్చడానికి సహాయపడ్డాయి. అంతేకాని అవి దేవుని నుండి దూరం చేయడానికి కాదు. అలనాడు యిస్రాయేలు ప్రజలు తమ దేవునిగా ఎంచుకున్న బాలు దేవతల

విగ్రహములకు ఉపయోగించుకున్న బంగారము లోహము దేవుని సృష్టియే. కాని దేవుని సృష్టి తమ దైవంగా మలచుకొని విర్రవీగిపోయారు. కాస్తంత కూడా నిరీక్షణ లేకుండా దేవుడు మా అవసరాలు తీరుస్తాడు మాతో, మా చెంతనే వుంటాడు అని గ్రహించలేకపోయారు. తమ అవివేకాన్ని ప్రదర్శించారు. మనిషికి అన్ని ఉండి, అభ్యర్థనం అవివేకంతో గర్వంతో నిండినప్పుడు నాకు నేనే రాజుని నాకు ముందెవరూలేరు అనుకుంటాడు. ఈ విధమైన భావనలతో ముందుకు పోవడమే దేవునికి దూరమవుడమే. ఎందుకు నీవు వక్రమార్గ జీవితాన్ని జీవిస్తున్నావు అని వాదించినపుడు తాను చేసే వాదన లౌకికవాదమవుతుంది. మనిషి తన అహంభావాన్ని ఇహ లోకంలో శాశ్వత ఆనందం కొరకు అనే నమ్మకంలో లౌకిక వాదమును మానవుడు అనుసరిస్తున్నాడు. దేవుడు నరున్ని విమోచన జీవిగా సృష్టించాడు. వ్యక్తిగత ఔన్నత్యాన్ని ప్రసాదించాడు. అతడు తన చర్యలను ప్రారంభించి నియంత్రించుకోగలడు. మనిషి తన హితబోధపైన ఆధారపడాలని దేవుడు సంకల్పించాడు. తద్వారా స్వయిష్టంతో తన సృష్టికర్తను వెదకాలని, ఆయన్ను అంటిపెట్టుకొని ఉండటం వల్ల నిండైన ధన్యమైన పరిపూర్ణతను సాధించాలని దేవుడు నిర్ణయించాడు.

❊ ❊ ❊ ❊

# 7. నాస్తికత్వం - అజ్ఞేయతావాదం

- బ్రదర్ వడ్లపాటి మరియదాస్

## 1. ఉపోద్ఘాతము



నాస్తికత్వం మరియు అజ్ఞేయతావాదం సమాజంలో న్యాయబద్ధతలేని జీవితం, అన్యాయంతో జీవించే విధానానికి కారణం కాదు. కొన్ని సిద్ధాంతాలు ప్రకారం ఒక మనిషి నాస్తికునిగా, బాధ్యతగల వ్యక్తిగా సమాజంలో నీతిగా జీవించవచ్చు అని నాస్తికత్వంను పాటించే రచయితలు చెప్పియున్నారు. కాని కార్యచరణకు వచ్చేటప్పుడు ఈ నాస్తికత్వం సమాజంలో నీతి జీవితానికి, న్యాయ జీవితానికి లయబద్ధంగా ఉంటుందా అనేది మనం ఆలోచించాలి. అసలు ఎప్పుడు ఇవి రెండూ ఏర్పడ్డాయి. వాటి గురించి చరిత్ర, పవిత్ర గ్రంథం, సత్యోపదేశం మరియు తర్కశాస్త్రవేత్తలు ఏమని చెప్పుతున్నారు? ముఖ్యముగా క్రీస్తును అనుసరిస్తున్న మనకు దేవుడు లేడని విశ్వసించుచున్నవారు తారసపడినప్పుడు మన ప్రవర్తన ఏ విధంగా ఉంటుంది, వారి జీవితంలో బాధలు, సమస్యలు వచ్చినప్పుడు వారి నడవడిక ఎలా ఉంటుందో తెలుసుకుందాం.

## 2. నాస్తికత్వం అంటే ఏమిటి?

నాస్తికత్వం "atheos"అనే గ్రీకు పదం నుండి తీసుకొనబడింది. అనగా దేవుడు లేడు (godless) అని అర్థం. 3వ శతాబ్దంలో పెపిరుస్ గ్రంథంలో మనకు ఇది కనిపిస్తుంది. ఈ గ్రంథంలో ముఖ్యముగ నాస్తికుడు అంటే ఎవరు? వారి జీవన విధానం, నాస్తికత్వం వలన ఏమైన ప్రయోజనం వుందా? దీని వలన ఎటువంటి అనర్థాలైన సమాజంలో సంభవిస్తాయా? అని తెలియపరుస్తుంది.

పునీత పౌలుగారు ఎఫెసీయులకు వ్రాసిన రెండవ లేఖ 12వ వచనంలో ఈ గ్రీకు పదం కనిపిస్తుంది. ఆంగ్లములో దీనిని దేవుని నుండి దూరమవడం లేదా ఎడబాటుగ జీవించడం అని అంటారు. మొదట దీనిని భక్తిలేకపోవడం అనేవారు. సిసిరో అనే తర్కశాస్త్రవేత్త దీనిని గ్రీకు నుండి లతీను భాషలోనికి అనువదించారు. ఆదిమ క్రైస్తవులు మరియు గ్రీకు మాట్లాడేవారు ఎక్కువగా ఎవరైతే దేవుని మీద నమ్మకం, విశ్వాసంలేక జీవిస్తారో వారికి ఉపయోగించేవారు.

## 3. అజ్ఞేయతావాదం అనగానేమి?

తర్కశాస్త్రం మరియు వేదాంతశాస్త్రం ప్రకారం అజ్ఞేయతావాదం అనగా దేవుని స్థితి, ఉనికి లేదా దివ్యమైన స్వభావంను తెలిసి, తెలియనట్లు ఉండటం. విలియం ఎల్ రో అనే తర్క శాస్త్రవేత్త "మానవ సంబంధమైన మేధస్సు, ఆలోచన విధానం ప్రకారం దేవుడు ఉన్నాడని, లేదని చెప్పడం కష్టం. కాని తెలిసీ తెలియని జ్ఞానంతో దేవునిపై నమ్మిక, ఆయనయందు విశ్వాసం ఉంచక జీవించువారిని అజ్ఞేయవాదులు అని అంటారు. ఇది మతానికి చెందిందికాదు కేవలం ప్రబోధం సిద్ధాంతం.

## 4. చరిత్ర

### 4.1. పాశ్చాత్యదేశ చరిత్ర

పాశ్చాత్య దేశంలో సోక్రటిస్ తర్కశాస్త్రమునకు ముందే నాస్తికత్వంకు పునాదులు ఉన్నాయి. కాని జ్ఞానోదయం (కనువిప్పు) వచ్చు వరకు దీనిని అంతగా ఉపయోగించలేదు. ఎవరు దీనిని అంతగా పట్టించుకోలేదు. కాని క్రీస్తుపూర్వం 5వ శతాబ్దంలో డయోగోరస్ అనే గ్రీకు తర్క శాస్త్రవేత్త మొదటి నాస్తికుడుగా పరిగణింపబడ్డాడు. ఆయన "ప్రపంచం అంతా లోకాయతమైనది. ఆధ్యాత్మికంతో ఎటువంటి సంబంధం లేదు" అని చెప్పాడు. 3వ శతాబ్దంలో కూడా తియోదోరుస్ సిరెనెయకుస్ మరియు స్ట్రటో ఆఫ్ లాప్సకుస్ కూడా దేవుని ఉనికిని నమ్మలేదు. సోక్రటీస్ కూడా నాస్తికుడుగ పరిగణింపబడ్డాడు. ఎపికురుస్, యుహెమెరుస్‌లు కూడా విశ్వం కేవలం చట్టాలమీద ఆధారపడింది కాని దేవుని మీద కాదు అని చెప్పారు.

మధ్యయుగంలో కూడా ముస్లింలు Muhammad al warlas, Ihh-al-Rawandi, Al-Razi మరియు Al-ma-arri మతం కేవలం ప్రాచీన మానవులు పెట్టిందేకాని దేవుడు లేడని అన్నారు. అల్లాను ఒక్కడినే దేవుడని విశ్వసించే వీరు కూడా దేవుని యొక్క ఉనికిని వ్యతిరేకించారు. ఈ సమయంలో ఎన్నో విప్లవాలు జరిగాయి. ముఖ్యముగ దేవున్ని విశ్వసిస్తున్న కతోలిక సంఘం మీద దాడులు జరిగాయి. కాని కతోలికులు విశ్వాసాన్ని కోల్పోకుండ, క్రీస్తుకు సాక్షులుగ నిలిచారు. అందుకు వారి జీవితాలనే బలి ఇచ్చారు.

ప్రెరో అనే గ్రీకు తర్కశాస్త్రవేత్త ఏదైన ఒక దాని కోసం పూర్తిగ తెలిసికోవడం చాలా కష్టం, ముఖ్యముగ 'దైవత్వాన్ని' అనగా దేవుడని. ఎందుకంటే మానవులమైన మన జ్ఞానం ఈ లోకాన్ని ఒక్కమాటతో సృష్టించిన దేవుని జ్ఞానంతో సరిపోల్చడం వీలుకాదు. పునీత అగస్టీన్ గారి జీవితంలో చూసినట్లయితే త్రిత్వైక దేవుని కోసం తెలిసికోవాలని ఎన్నో విధాలుగా ప్రయత్నం చేయగా సాధ్యం కాలేదు. ఒకరోజున సముద్రం దగ్గర ఆలోచిస్తూ ఉండగా ఒక బాలుడు సముద్రం ఒడ్డున చిన్న గోయి తీసి, సముద్రం నుండి నీరు తీసుకొని వచ్చి ఆ గోయిలో పోయడం గమనిస్తారు. అప్పుడు అగస్టీన్ వారు ఆ బాలుడిని అడుగుతారు ఏమి చేస్తున్నావని అప్పుడు బాలుడు సముద్రంలో ఉన్న నీరు అంతా ఈ గొయిలో పోస్తున్నాను అని చెప్పుతాడు అగస్టీన్‌గారు నవ్వుతూ అది సాధ్యం కాదుయని బాలుడితో చెప్పుతాడు. బాలుడు వెంటనే దేవుని గురించి పూర్తిగా మానవులకు తెలియడం కష్టం. అది ఎంత ఆలోచించినా నీకు సాధ్యం కాదని వెళ్లిపోతారు. అప్పుడు అగస్టీన్ తను దేనికోసం ఆలోచిస్తున్నానో తెలిసికొని తన ఆలోచన విధానాన్ని మార్చుకుంటారు.

## 4.2. భారతదేశ చరిత్ర

హిందు తర్కశాస్త్రం ప్రకారం నాస్తికత్వం వేదాలలో ఉందని చెప్పుతుంది. మన భారతదేశంలో దేవున్ని నమ్మని శాఖలు ఆరు ఉన్నాయి. ముఖ్యముగ సాంఖ్య, మీమాంసలు దేవుని ఉనికిని అసలు నమ్మవు. చార్వాక దేవుడిని మరియు వేదాలని అసలు నమ్మదు. జైనమతం, బౌద్ధమతాలు కూడా దేవుడిని నమ్మవు. కాని తరువాత బౌద్ధమతం పాటించేవారు బుద్ధుని ఒక దేవునిగా కొలవడం ప్రారంభించారు. భారతదేశం ఎన్నో మతాలతో కూడిన దేశం. ఇటువంటి దేశంలో కూడా దేవుడిని

నమ్మనివారు ఎంతోమంది ఉన్నారు. ఎవరైతే దేవుడిని విశ్వసించరో వారినే నాస్తికులు అని పిలుస్తాము.

## 5. సత్యోపదేశం ప్రకారం నాస్తికత్వం, అజ్ఞేయతావాదం

ప్రస్తుతం సమాజంలో చాలామంది ప్రజలు దేవుడిని నమ్మక జీవిస్తున్నారు. మనిషికీ దేవునికి మధ్య వున్న సజీవ సన్నిహితబంధాన్ని గ్రహించలేకపోతున్నారు. దేవుని కోసం తెలిసినా తిరస్కరిస్తున్నారు. కొంతమంది అసలు దేవుడు లేడని చెప్పుతున్నారు. ఇటువంటి వారిని మదిలో ఉంచుకొని తల్లిశ్రీసభ సత్యోపదేశం ప్రకారం ఏమని చెప్పుతుందో చూద్దాం.

### 5.1. నాస్తికత్వం

'నాస్తికత' అనే పదంలో అనేకమైన రకరకాల భావాలున్నాయి. నాస్తికత్వం సర్వసాధారణంగా కనిపించే రూపం. భౌతికవాదం కాలానికి, స్థలానికి సంబంధించిన అవసరాలు, ఆశల వరకే మనిషి జీవితాన్ని పరిమితం చేస్తుంది. నాస్తిక మానవతావాదం మరో రూపం. దాని ప్రకారం మనిషే అన్నిటికీ కేంద్రబిందువు. అంతిమ లక్ష్యం చరిత్రను సృష్టించేవాడు దాన్ని నడిపేవాడు, శాసించేవాడు నరుడే అని తప్పుడు ప్రచారం చేస్తుంది. ఈనాడు ఇంకోరకమైన నాస్తికత అంతటా వ్యాపించిపోయింది. ఆర్థిక, సామాజిక విమోచనం ద్వారా మనిషిని విముక్తి చేయాలని ఈ రకం నాస్తికత ప్రయత్నిస్తోంది. ఈ తరహా నాస్తిక వాదం వాదిస్తోంది. "ఉజ్వలమైన భవిష్యత్తు జీవితంలో ఉండాలని చెప్తుంది.

నాస్తికత దేవుని అస్తిత్వాన్ని తిరస్కరిస్తుంది లేదా దేవుడు లేడని చెబుతుంది. కనుక నాస్తిక వాదం పెరగడానికి విశ్వాసుల పాత్ర కూడా ఒకింత లేకపోలేదు. విశ్వాస బోధనల్ని నిర్లక్ష్యం చేయడం లేదా విశ్వాస ప్రబోధాలను తప్పుగా ప్రచారం చేయుటం, మత, నైతిక, సామాజికపరమైన జీవితంలో దుర్మార్గంగా వ్యవహరించటం వల్ల దైవస్వభావానికి వ్యతిరేకంగా ఉంటున్నవాళ్లం అవుతాము. దేవుడిని విశ్వసిస్తువారు ఆయన బోధనలు ప్రతిఒక్కరికి మంచి మార్గంలో నడిపించుటకు ఉపయోగించాలి కాని చెడు మార్గంలో నడిపించుటకు కాదు. అలా చేయడం వల్ల మనం నాస్తికులుగా పిలువబడతాము.

## 5.2. అజ్ఞేయతావాదం

ఆజ్ఞేయతావాదం అనేక రూపాలను ధరిస్తుంది కొన్ని సందర్భాలలో ఆజ్ఞేయతావాది దేవున్ని కాదనడు. దానికి బదులుగా అతడు అనుభవాతీతమైన ఒక జీవి ఉందంటాడు. అది తనను గూర్చి తాను ఆవిష్కరించుకోలేదని, దాన్ని గూర్చి మనమేమి చెప్పజాలమనీ భావిస్తాడు. దైవ ఆస్తిత్వాన్ని నిరూపించడం అసాధ్యం అవుతుందని నిరూపించటం లేదా కొట్టిపారేయడం అసాధ్యమని చెబుతూ దేవుని అస్తిత్వాన్ని గురించి ఎలాంటి నిర్ణయం చేయడు. ఇటువంటి మిడిమిడి జ్ఞానం కలవారు జీవితంలో ఏదీ సాధించలేరు. సృష్టి గురించి మనకు తెలియనప్పుడు, ఏ విధంగా నడుస్తుందో అర్థంకానప్పుడు అసలు ఇది ఎలా వచ్చింది, ఎలా నడుస్తుంది అని ఆలోచించాలి. లేకపోతే దీని అంతటిని ఎవరు నడిపిస్తున్నారు అని అర్థం చేసుకోవాలి. అంతేగాని తెలిసి, తెలియనట్లు జీవించకూడదు.

## 6. పవిత్ర గ్రంథం ప్రకారం దేవుడులేని జీవితాలు

పవిత్రగ్రంథం ప్రకారం నాస్తికుడుగా, ఆజ్ఞేయతావాదిగా జీవించడం చాలా తప్పు. ఎందుకనగా కీర్తన 14:1, 53:1లో మూర్ఖులు తమ హృదయములో 'దేవుడు లేడు' అని యెంతురు. వారెల్లరు దుష్టులై ఘోరకార్యములను చేసిరి, మంచిని చేయువాడు ఒక్కడులేడయ్యెను అని పలుకుతుంది. యోబు 12:17-25లో మూర్ఖుల జీవితములను అంధకారమగునట్లు చేయునని ప్రభువు పలికెను. కాబట్టి ఎవరైతే దేవుని విశ్వసించరో వారందరు అవివేకవంతులు అని తెలియజేస్తుంది. వారి జీవితాలు ఎలా అవివేకమయ్యాయి. అవివేకం ద్వారా జీవితాలను ఎలా నాశనం అయ్యాయో చూద్దాం.

ఆదికాండము 1వ అధ్యాయం 26-27 వచనాలలో దేవుడు మానవుని తన రూపంలో సృష్టించెను. అటువంటి మానవుడు సృష్టించిన సృష్టికర్తనే మరచిపోయి, ఆయన లేడు అని చెప్పడం ఆశ్చర్యకరం. ఇలాంటి ధోరణిలో ఉన్న మానవులు నైతిక విలువలను మరచిపోయి పాపములో పడి, తోటి వారిని ప్రేమించకపోయి వారిని నాశనం చేస్తూ, తమ జీవితాల్ని కూడా నాశనం చేసుకుంటున్నారు. అదే ఆదికాండము 7వ అధ్యాయంలో చూస్తున్నాం. దేవుడు

నోవాను, అతని భార్యను, కొడుకులను, కోడండ్రలను మరియు జంతువులను జలప్రళయము నుండి రక్షించెను, కాని దేవుడంటే నమ్మకం లేక పాపపు జీవితంలో జీవిస్తున్న వారందరిని జల ప్రళయంలో ముంచివేసెను.

మానవులు ఎప్పుడైతే దేవుడు లేడు లేదా దేవునికంటే మనమే గొప్పవాళ్లం అని అనుకుంటారో ఆ గడియనుండి మన వినాశనం మొదలౌతుంది. ఆదికాండము 11వ అధ్యాయంలో "బాబేలు గోపురం కట్టేటప్పుడు వారి ఆలోచనలు దేవుని చేరుకోవాలి, ఆయన కంటే మనమే గొప్పవాళ్లం అవ్వాలి అని తలంచారో ఆ క్షణాన దేవుడు వారి భాషలను మార్చివేసి, గోపురం కట్టకుండ చేసి వారిని చెల్లాచెదురు చేసాడు. మనము కూడా సంతోషంగ ఉన్న సమయంలో దేవుడిని మరచిపోయి నియమ నిబంధనలు లేకుండా జీవిస్తాము. దాని ద్వారా విచ్చలవిడి జీవితాన్ని జీవించడానికి ప్రయత్నిస్తాము. తద్వారా మనం చేసిందే నిక్కచ్చితం అనే భ్రమలో ఉంటాము. ఈ విధంగా ఇతరుల జీవితాలను కూడా నాశనం చేయడానికి ప్రయత్నిస్తాము. ఇదే విషయాన్ని ఆదికాండము 19వఅధ్యాయంలో చూస్తాం. లోతు గృహమునకు ఇద్దరు దేవదూతలు వచ్చినప్పుడు సొదొమ వాసులు అందరు లోతు గృహమునకు వచ్చి, వారిని (దూతలను) బయటికి పంపించు మేము వారిని కూడవలయును అని కేకలు వేసిరి. అందుకు లోతు వారికి బదులు తన కూతుర్లను ఇవ్వడానికి సిద్ధపడ్డాడు. లోతు జీవితాన్ని బాగా పరిశీలించినట్లయితే దేవుని మీద నమ్మకం ఉన్నవాడు కాబట్టి తనకు, తన కుటుంబానికి ఏమైనా పరవాలేదు, కాని అతిధులకు ఏమీ అవకూడదని తలంచాడు. క్రీస్తు ఇచ్చిన రెండవ నూతన ఆజ్ఞ ఇక్కడ మనకు గుర్తుకు రావాలి. "నీవలె నీ పొరుగువారిని ప్రేమించు" (యోహాను 13:34) లోతు జీవితంలో ఈ ఆజ్ఞను పాటించాడు కాని సొదొమ వాసులు వారి స్వార్ధంతో వారు జీవిస్తున్నారు. దేవుని మీద ఎటువంటి భయంలేక ఉన్నారు. అందుకే ప్రభువు సొదొమ వాసులందరిపైన అగ్ని గంధకములను కురిపించి నాశనం చేశారు.

సమూవేలు మొదటి గ్రంథం 15:3 వచనంలో "యావే సౌలుతో అమాలేకీయులను వధింపుము, వారి ఆస్తిపాస్తులను శాపము పాలు చేయుము. వారిలో ఒక్కరిని కూడ బ్రతుకనీయవద్దు' అని చెప్పెను. కాని సౌలు యావే

ఆజ్ఞను ధిక్కరించెను. గాడిదలను కాచుకొనే వాడిని ఇస్రాయేలు ప్రజలను పరిపాలించుటకు రాజుగా చేసిన దేవుడినే మరిచాడు. కనుకనే యావే సౌలును రాజుగా చేసినందుకు విచారించారు. అందువల్ల సౌలు వద్ద నుండి రాజ్యాధికారం తీసికొనబడింది. దేవుడిని విశ్వసించకుండా, ఆయన ఆజ్ఞలను లెక్కచేయకుండా జీవిస్తారో వారి జీవితాలు నాశనం అవుతాయి కాని ఎవరైతే దేవుడిని నమ్మి, విశ్వసిస్తారో వారి జీవితాలు ఫలభరితమౌతాయి. అబ్రహాము దేవుని మీద పూర్తి విశ్వాసం కలిగి ఉన్నందున ఆయనను విశ్వాసానికి తండ్రిని చేయడమే కాకుండ ముసలిప్రాయంలో కూడా అతనికి సంతాన భాగ్యాన్ని ప్రసాదించాడు. యావే అబ్రహాముతో చేసికొనిన వాగ్దానాలను అన్నిటిని కూడా మోషే ద్వారా, ఇస్రాయేలీయుల జీవితంలో నెరవేర్చాడు.

యేసుప్రభువు వాక్య పరిచర్య జీవితంలో చూచినట్లయితే ఎంతోమంది రోగములతో, వ్యాధులతో బాధపడుచున్నవారు ఆయన వద్దకు వచ్చినప్పుడు, ఆయన వారిని అడిగిన ఒకే ఒక్క ప్రశ్న నేను ఇది చేయగలనని మీరు విశ్వసిస్తున్నారా? అని పలికినప్పుడు వారు తమ విశ్వాసాన్ని వ్యక్తపరచారు. అందుకు ప్రభువు మీ విశ్వాసమే మీకు స్వస్థతను చేకూర్చిందని చెప్పారు. కాబట్టి ఎవరైతే క్రీస్తునందు విశ్వాసం కలిగి జీవిస్తారో వారికి ఎటువంటి వ్యాధులు, బాధలు ఉన్న అవి అన్ని కనుమరుగైపోతాయి. పరిశుద్ధ మరియమ్మ గారి తల్లిదండ్రులైన పునీత జ్వాకీము, అన్నమ్మగారు జీవితంలో ఎన్నో బాధలు, అవమానములు అనుభవించారు. అందుకు ప్రభువు తాను, ఈ లోకాన్ని రక్షించుటకు తనను ఒక మానవునిగా మలచుకోవడానికి పరిశుద్ధ మరియమ్మను వారి నుండి పుట్టించెను. మరియమ్మగారు కూడా తన జీవితాంతం తండ్రి దేవునికి విధేయతను చూపిస్తూ, తన విశ్వాసాన్ని వ్యక్తపరిచింది. ఈ విధంగా మనము కూడా వీరివలె విశ్వాసం కలిగి జీవిస్తూ, మన జీవితాలను ధన్యం చేసికొని, పరిశుద్ధులుగా జీవించుదాం.

## 7. ప్రస్తుత సమాజంలో

ఈ కంప్యూటర్ కాలంలో పారిశ్రామిక కళలు ఎక్కువ అవడం వల్ల దేవుడు లేడనీ మరియు దేవుడినే ప్రశ్నించడం చూస్తున్నాం. ప్రతీదీ కూడ విజ్ఞాన

శాస్త్రము ద్వారా సాధించగలమని నమ్ముతూ, దేవుడి ఉనికిని ధిక్కరిస్తున్నారు. ఎంత విజ్ఞానశాస్త్రం ఉన్నా ఎంతోమంది జీవితాలు నాశనం అవుతున్నాయి. కొన్నిసార్లు ఈ విజ్ఞాన శాస్త్రమే దీనికి కారణం అవుతుంది. మానవుడు ఈ విజ్ఞాన శాస్త్రాన్ని ఇంతగా పెంపొందించడానికి దేవుడే ఒక విధంగా కారణం. దేవుడు ఇచ్చిన జ్ఞానం ద్వారానే కొత్త కొత్త విషయాలను కనుగొంటున్నాడు. కాని ఈ కనుగొనే ప్రక్రియలో తనే గొప్పయని భావిస్తున్నాడు. ఎవరి ద్వారా ఇవన్నీ సాధ్యం అవుతున్నాయనే విషయాన్ని మరచి, గర్వంతో జీవిస్తూ, తన నాశనాన్ని తనే కొనితెచ్చుకుంటున్నాడు. ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వంటి గొప్ప శాస్త్రవేత్తలే వారు చేస్తున్న ప్రతి పని కూడా దేవుడి వల్ల చేయగలుగుతున్నామని చెప్పుతున్నారు. కాని ఈనాటి యువతీయువకులలో ఇది కనిపించడం లేదు. దేవుడు అంటే నమ్మకం లేక ఈ లోక వస్తువుల మీద ఎక్కువ మమకారం కలిగి జీవిస్తూ, ప్రతిదీ కూడా మేము చేయగలం, సాధించగలం అని భావిస్తున్నారు. ఎప్పుడైన వారి జీవితంలో ఇబ్బందులు వచ్చినప్పుడు జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. అందుకు నిదర్శనం ప్రస్తుత సమాజంలో జరుగుచున్న ఆత్మహత్యలే. దేవుడు మన జీవితంలో లేనప్పుడు ఈ లోక ఆశలకూ బానిసలైపోతాము. ఎటువంటి చెడు పనులు చేయడానికైన పూనుకుంటాం. దైవ భయం అనేది మన జీవితంలో ఉంటే ప్రతి క్షణం మంచి జీవితం జీవించడానికి ప్రయత్నిస్తాము. క్రీస్తును అనుసరిస్తున్న మనం తప్పకుండా ఆయన వలె మంచి జీవితం జీవించాలి. అప్పుడు మన జీవితంలో కష్టాలు, బాధలు వచ్చినా దేవుడు మనలో, మనతో ఉన్నాడు కాబట్టి మనం ఎటువంటి తప్పిదాలు చేయము. నిజంగా దేవుడు మనలో ఉన్నప్పుడు ఇబ్బందులు, కష్టాలు, బాధలు వచ్చినా వాటిని సంతోషంగానే స్వీకరిస్తాము. దేవుడు లేనియడల అవి అతి బాధాకరంగా ఉంటాయి. కాబట్టి మనము ప్రతి క్షణము ఆయనయందు విశ్వాసం ఉంచి జీవిస్తూ, దేవుడిని నమ్మిన వారిని మన జీవితాలు ద్వారా దేవునిలోకి నడిపించుదాం.

## 8. దేవుడిని నమ్మని వారి యెడల మన ధోరణి ఏమిటి?

ఈ నవ యుగంలో చాలామంది దేవుడిని విశ్వసించకుండా జీవిస్తూ, దేవుడిని తెలుసుకోవాలనే ఆలోచన కూడా లేకుండా ఉంటున్నారు. క్రీస్తును దేవుడుగా విశ్వసిస్తున్న మనము వారి యెడల ఎటువంటి ధోరణి కలిగి

ఉంటున్నాము?. వారిని అసహ్యించుకుంటున్నామా లేదా ప్రేమతో ఆదరిస్తున్నామా. కొన్ని సంవత్సరాల వరకు తల్లి శ్రీసభ ఎవరైన చర్చికి వ్యతిరేకముగాకాని, దేవునికి వ్యతిరేకముగాకాని మాట్లాడిన వారిని ఖండించింది. దేవుడిని విశ్వసించనివారు దేవుడిని విశ్వసిస్తున్న మనలను అసలు దేవుడు లేడు, ప్రతిదీ కూడా ప్రకృతి ద్వారానే జరుగుతుందని చెప్తూతూ మనలను ప్రశ్నిస్తారు. అలాంటి సమయంలో మన విశ్వాసం కోల్పోకుండా వీలైతే దేవుడు ద్వారానే ఈ సమస్త సృష్టి నడుస్తుందని, ప్రకృతి ద్వారా కాదని చెప్పాలి. ఈ ప్రకృతిని కూడా శాసించే అధికారం దేవుడికి ఉందని తెలియపరచాలి. లూకా శుభవార్త 8వ అధ్యాయం 22 నుండి 25 వచనాలు పరిశీలించినట్లయితే "యేసు, ఆయన శిష్యులు పడవలో ప్రయాణిస్తున్నప్పుడు పెద్దగాలి వాన రావడం అప్పుడు శిష్యులు భయపడి యేసును మేలుకొలుపుతారు. యేసు మేలుకొని గాలిని, అలలను గద్దింపగా అవి నిలిచిపోతాయి. అప్పుడు శిష్యులు గాలి, అలలు సహితము ఈయనకు లోబడుచున్నవి" అని అంటారు. ఈ విధంగా మనం వారికి తెలియపరచినప్పుడు, క్రీస్తు ప్రేమను ఇతరులకు పంచిన వాళ్లమవుతాము. "మీరు ప్రపంచమందంతట తిరిగి సకల జాతి జనులకు సువార్తను బోధింపుడు" మార్కు 16:15 అన్న క్రీస్తు వాక్యాన్ని నెరవేర్చిన వాళ్లమవుతాము. మనం దేవుని గురించి తెలియపరచి, ఆయన ప్రేమ ఆజ్ఞలు చెప్పి, మానవులపై ఆయన చూపించే ప్రేమను కనబరచిన వినకపోతే, వారిని వాళ్ల జీవితానికి విడిచిపెట్టాలి. తద్వారా వారి నాశనాన్ని వారే కొని తెచ్చుకున్నవారు అవుతారు. మార్కు 16:16 వచనంలో 'విశ్వసించి జ్ఞానస్నానము పొందువాడు రక్షింపబడును. విశ్వసింపనివారికి దండన విధింపబడును' కాబట్టి మనం విశ్వసిస్తే రక్షింపబడతాము. దేవుడిని విశ్వసించనివారు దండింపబడుదురు.

## 9. ముగింపు

నాస్తికులు, అజ్ఞేయతావాదులు దేవుని ఉనికిని నమ్మక, విశ్వసించక జీవిస్తూ, నీతిగా జీవించడానికి దేవుడు, మతం అవసరం లేదని నమ్ముతూ జీవిస్తున్నారు. క్రైస్తవులమైన మనం ఎంతవరకు ఆయనను విశ్వసిస్తున్నాము. మన జీవితంలో బాధలు, కష్టాలు వచ్చినప్పుడు ఆయన యందు విశ్వాసాన్ని

వ్యక్తపరుస్తున్నామా లేదా దేవుడు లేడని వాపోతున్నామా? ఈ విధంగా ఉన్నప్పుడు వారికి, మనకు ఎటువంటి తేడా ఉండదు. అలాంటి సమయంలో మనము కూడా నాస్తికులుగానే పరిగణించబడతాము. క్రీస్తును దేవుడిగా విశ్వసిస్తున్న మనము, ఎలాంటి సందర్భంలో కూడా విశ్వాసం కోల్పోకుండా నీతివంతమైన జీవితాన్ని జీవించాలి. అది కేవలం మనలో దైవభయము ఉన్నప్పుడు సాధ్యమవుతుంది. ప్రతి మానవుడు కూడా తనకు తెలియని విషయాలను తెలుసుకోవాలని ప్రయత్నం చేస్తాడు. కాని కొన్నిసార్లు సాధ్యపడదు. ఈ సాధ్యపడని విషయాలు కేవలం దేవుడికి మాత్రమే సాధ్యం అవుతుంది. కాబట్టి దేవుడు ఉన్నాడని గ్రహించి, ఆయన మనయందు లేనప్పుడు తప్పక నాశనం అవుతామని గ్రహించి విశ్వాసంతో జీవించుదాం.

❁ ❁ ❁ ❁

# 8. వశీకరణం

**– బ్రదర్ నల్లా సుధీర్ కుమార్**



## ఉపోద్ఘాతము

"నీవు నరుని నీ కంటెను కొంచెము తక్కువ వానిగా మాత్రమే చేసితివి. కీర్తి మహిమలనే కిరీటముతో అతనిని అలంకరించితివి" (కీర్తన 8:5).

మనిషిని ఇతర జంతువుల నుండి వేరు చేసేది, దైవసృష్టి అంతటిలో మనిషిని మహోన్నతునిగా నిలిపేది మనిషి మేధస్సు. మనిషి మస్తిష్కమునకు వున్న శక్తిని, మనిషి వివేచణను పూర్వులు ముందుగానే గుర్తించి మనిషి మేధస్సు వలన మనిషికి ఎన్ని ఉపయోగాలున్నాయో, మనిషి తన మేధాశక్తిని దుర్వినియోగం వలన ఇంకా ఎక్కువ ప్రమాదాలు వున్నాయనడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు.

మనిషి మనస్సు చంచలమైనది కాబట్టి చలనమైనది. కాబట్టి మనిషి మనసును అదుపులో పెట్టుకున్నపుడే మనిషి సంపూర్ణముగా ఎదుగుతాడు. అప్పుడు మాత్రమే మనిషి తన మనుగడను సుఖవంతముగా సాగించగలడు. ఈ చంచలమైన మనస్సును ధ్యానం ద్వారా అదుపులో పెట్టుకోవచ్చునని ఆలోచనే మనిషిని ప్రభావితం చేస్తుంది. ఆలోచనలు మనస్సు ఆశాభావ దృక్పథం. మనిషి చేతులలో వెల్లడవుతుంది. ధ్యానం ద్వారా ఏక్రాగతను సాధించవచ్చు. శరీరాన్ని మనస్సును అదుపులో పెట్టుకోవడం వలను ప్రశాంతత చేకూరుతుంది.

మన మనస్సును అదుపులో పెట్టుకోవడం, జీవితంలో క్రమశిక్షణ కలిగి ఉండాలనుకోవడం ఎంతగానో ఆహ్వానించదగిన పరిణామం కాని మనిషి

దుష్టస్వభావ రీత్యా కొన్నిసార్లు ఇతరుల జీవితాలను మన తోటివారి మనస్సును కూడా అదుపు చేయాలని అనుకోవడం తప్పు, అనైతికం. వశీకరణము అనగా మనిషిని అపస్మారక స్థితికి తీసుకువెళ్ళగలగడం. ఆ అపస్మారక స్థితిలోనికి తీసుకువెళ్లి ఇతరుల మనస్సును మేధస్సును ఆధీనములోనికి తీసుకోవడం వశీకరణము.

17, 18వ శతాబ్దములలో ప్రాచుర్యములోనికి రావడం జరిగింది. ఐరోపాలో మొదలైనదని పేర్కొంటారు. చరిత్ర: 18వ శతాబ్ద ప్రారంభంలో పెన్స్ మెస్మర్ అను జర్మనీకి చెందిన వైద్యుడు మొదట తనను తాను వశీకరణము చేసుకునే పద్ధతిని కనుగొన్నాడు. మొదట అతను ఏకాంతతను ప్రశాంతముగా తన అంతరాత్మ ప్రబోధము ద్వారా గాఢమైన నిద్రలోనికి వెళ్లి ఉపశమనమును కనుగొనునట్లు తన అధ్యయనంలో కనుగొన్నారు. ఈ ప్రక్రియను ఆయన మొదట తన పేరు మీదనే మెస్మరిసమ్ అని పిలిచేవారు.

ఈ ప్రక్రియను ఇంగ్లాండుకు చెందిన వైద్యుడు జేమ్స్ బ్రేయిడ్. తమ రోగులకు చికిత్స చేయుటకు వారిపై ఉపయోగించి అద్భుతమైన ఫలితాలను పొందారు.

## వశీకరణ పద్ధతి

వశీకరణము కేవలం మనస్తత్వ శాస్త్ర నిపుణులు మాత్రమే చేయవలసిన ప్రక్రియ. వశీకరణమును ప్రయోగించదలచిన వ్యక్తిని ఒక పడక మీదకాని కుర్చీలోకాని ప్రశాంతముగా అపస్మారక స్థితిలోకి తీసుకువెళ్లి, ఏకాగ్రత ద్వారా మనస్సు చంచలత్వమును నిరోధించగలరు. వైద్యులకు ఈ ప్రక్రియలో ఏకాగ్రత ఎంతో ముఖ్యం. అపస్మారక స్థితికి చేరుకున్న వ్యక్తిని నిద్ర పుచ్చడం కాదుకాని ఆ వ్యక్తి తన చుట్టూ జరుగుతున్న వాటిని గుర్తించగలడు, చూడగలడు మరియు వినగలడు. ఈ ప్రక్రియలో మనిషి మేధస్సు పూర్తిస్థాయిలో పని చేయదు. ఈ స్థితిలో మనస్తత్వ నిపుణుడు పదే పదే సలహాలు సూచనలు ప్రశ్నలు సంధించవచ్చును. ఆ వ్యక్తి పూర్తిగా వశీకరణము చేయు వ్యక్తి ఆధీనములో వున్నట్లే మనిషి మనస్సు వైద్యుని ఆధీనములో ఉండడం వలన తన శరీరము కూడా అతను ఇచ్చు ఆజ్ఞలకు స్పందిస్తూ ఉంటుంది. ఇలా పూర్తిస్థాయిలో ఒక

వ్యక్తి మనస్సును శరీరమును ఈ పద్ధతి ద్వారా వశీకరణము చేయు వ్యక్తి ఆధీనములోనికి తెచ్చుకొనవచ్చును.

## ఉపయోగాలు

వశీకరణము ద్వారా మనోవ్యాధులెన్నో శాస్త్రీయముగా నయము చేయవచ్చును. మనిషికి ఉన్న రోగాలు చాలా వరకు మానసికమైనవి కాబట్టి మనిషి మానసికతను వశీకరణము ద్వారా కుదురు చేయవచ్చును.

ఎన్నో బాధలు కష్టాలు గాయాల ద్వారా మనిషి తన ఆత్మ ప్రబోధం ద్వారా వశీకరణ స్థితిలోనికి వెళ్లినపుడు అనేక జబ్బుల నుండి ఉపశమనము వశీకరణము ద్వారా కలిగించవచ్చును.

పూర్వం మత్తుమందులులేని కారణాన వశీకరణము ద్వారా ఎటువంటి నొప్పి తెలియకుండా శస్త్రచికిత్సలు చేసేవారు వశీకరణము ద్వారా మనిషి దేహం నొప్పి తెలియని అపస్మారక స్థితికి చేరుకుంటుంది. కావున శస్త్రచికిత్సలు చేయడం సులభమయ్యేది.

వశీకరణము ద్వారా అనేక చెడు అలవాట్లు నుండి కూడా ఒక వ్యక్తిని దూరము చేయవచ్చును పదే పదే అపస్మారక స్థితితో ప్రబోధించడం వలను మానసిక దృఢత్వం ఏర్పడి అలవాట్ల నుండి దూరమవ్వడం జరుగుతుంది.

## ప్రమాదాలు

వశీకరణమును శిక్షణ పొందినవారు మాత్రమే వినియోగించాలి. ఇతరులు దీనిని ప్రయోగించినప్పుడు వాళ్లు అపస్మారక స్థితికి వెళ్లిన వ్యక్తులకు ఎన్నో మానసిక రుగ్మతలు అధికము చేసే ప్రమాదము ఉంటుంది.

అపస్మారక స్థితిని కలిగించి అనేక అసాంఘీక కార్యకలాపాలు, చట్టవిరుద్ధమైన పనులు చేయించే ప్రమాదము ఉంటుంది. పదే పదే వశీకరణము చేయడం ద్వారా మనిషి మెదడు, మేధాశక్తికి ఆలోచన రీతికి కూడా ప్రమాదము ఏర్పడే అవకాశము కలదు.

## శ్రీసభ ప్రబోధం

"మానవ సంబంధ బాంధవ్యాలలో స్వేచ్ఛను వినియోగిస్తారు. దేవుని రూపంలో సృష్టి జరిగిన ప్రతి మనిషికి స్వేచ్ఛాబాధ్యతలు ఉన్నాయనీ అది అతని సహజహక్కుగా గుర్తించాలి. పరస్పరం గౌరవించుకునే బాధ్యత అందరికీ ఉంది. స్వేచ్ఛను వినియోగించుకునే హక్కు ముఖ్యంగా నైతిక, మతపరమైన విషయాలలో కాదనలేనిది. అవి మనిషి వ్యక్తిగత ఔన్నత్యానికి అవసరం. ఉమ్మడి సంక్షేమం, శాంతి భద్రతలు పరిధుల్లో పౌరసంబంధిత అధికారులు ఈ హక్కులు గుర్తించాలి, పరిరక్షించాలి.

వశీకరణమును గూర్చి శ్రీసభ ప్రత్యక్షముగా ప్రబోధించకపోయినా వశీకరణము వ్యక్తి యొక్క పూర్తి అనుమతితో మాత్రమే జరగాలి. వ్యక్తి స్వేచ్ఛకు విరుద్ధముగా జరగరాదని మత్తు మందులిచ్చి వశీకరణము చేయడం సమాచారం రాబట్టడం వంటివి. వ్యక్తి స్వేచ్ఛకు భంగం కలిగించడమే అవుతుంది.

వశీకరణము విరివిగా అనేకానేక మంత్ర తంత్ర విద్యలలో ఉపయోగించడం ఎంతగానో ప్రమాదకరం మరియు దైవారాధనకు వ్యతిరేకం. కావున వశీకరణమును ఉపయోగించడము ఎంతగానో ప్రమాదకరము. శాస్త్రీయంగా మంచి చేకూర్చుటకు మాత్రము ఉపయోగించడం ఆమోదయోగ్యము. కేవలం వైద్యం కోసం మాత్రమే తగిన నైపుణ్యం కలిగిన వైద్యులు మాత్రమే దీనిని నిర్వహించాలి.

## ముగింపు

అనేక మానసిక రుగ్మతల నుండి విడుదల చేయగల శక్తి వశీకరణమునకు ఉంది. ఎంత ఉపయోగకరమో అంతే ప్రమాదకరము కాబట్టి అన్ని రోగాలను మందు ఒక్కటే అన్నట్లు  వశీకరణమును ఉపయోగించకుండా కేవలం మంచిని చేయుటకు మాత్రమే ఉపయోగించాలి. మనిషి పతనమును చేకూర్చు సామర్థ్యము ఉండటం వలన ఇది ప్రమాదకరము. సకల మనస్తత్వ విజ్ఞానం మనిషి ఉన్నతికే ఉపయోగించాలి, ఉపయోగపడాలి.

❊ ❊ ❊ ❊

# 9. భూతోచ్ఛాటనం

- బ్రదర్ యందవ మత్యాస్

## 1. ఉపోద్ఘాతము



నేటి ఆధునిక ప్రపంచములో ఎక్కువగా ప్రజలలో విస్తరించి ప్రభావితమైన విషయాలలో ఒకటి "భూతోచ్ఛాటనము" మనకు భూతోచ్ఛాటనము అనగా గుర్తుకొచ్చేది దుష్టశక్తులను పారద్రోలుట. ఏదో ఒక మంత్రం వేసి ఒక వ్యక్తిని రక్షించినంత మాత్రమున, ఆ వ్యక్తి దుష్టశక్తులను పారద్రోలే అధికారం, శక్తి ఉందని ఎంతోమంది ప్రజలు నమ్ముతూ, సృష్టించిన దేవుని మరచిపోతూ ఈ వ్యక్తులను నమ్మడం మొదలుపెడుతున్నారు. వీటి వలన లాభాలు నష్టాలు ఏమిటి? ఈ అధికారం ఎవరికి వున్నది అని మనం తెలుసుకోవాలి. భూతోచ్ఛాటనము అను వ్యాసము మనం చూడబోయే అంశాలు: భూతోచ్ఛాటనము అంటే ఏమిటి, వాటి చరిత్ర నేపథ్యం దుష్టశక్తి ఎక్కడ నుండి వస్తుంది? అసలు ఏమిటి? దయ్యం పట్టిన వారిలో వచ్చే మార్పులు, పాత నిబంధన గ్రంథం, నూతన నిబంధన గ్రంథం నుంచి, వివిధ మతాలలో భూతోచ్ఛాటనము. 6 రకాల అసాధారణమైన సాతాను క్రియలు మరియు కతోలిక శ్రీసభ నేటి గురువులు యేసుక్రీస్తు పేరున ఏ విధంగా దుష్టశక్తులను పారద్రోలుటను గూర్చి తెలుసుకుందాం.

## 1. దుష్టశక్తి ఎక్కడ నుండి వస్తుంది? అసలు ఏమిటి?

దుష్టశక్తి ఎక్కడ నుండి వస్తుంది అని మనము స్పష్టముగా చెప్పలేము కాని పరిశుద్ధ గ్రంథంలో ఆది 3:1-5 వచనాలలో సర్పము ఆదాము ఏవను శోధించటం మనము చూస్తాం. ఇక్కడ ఆ సర్పం సాతానుగా పరిగణించబడింది.

దైవశాస్త్రం ప్రకారం చూస్తే మొదటి తల్లిదండ్రులు అయిన ఆదాము ఏవలు దేవుని మాటను ధిక్కరించారు. ఆయన తినవద్దు అన్న పండును తిన్నారు. ఈ దేవుని మాట ధిక్కరించటాన్ని (అవిధేయత) కూడ సాతాను అన్నారు. 2 పేతురు 2:4,5 ఏలయన పాపులయిన దేవదూతలనే దేవుడు వదలలేదు. వారు పాపము చేసినపుడు ఆయన వారిని పాతాళము నందలి చీకటి బిలములోనికి త్రోసి...." ఇక్కడ పునీత పేతురు గారు దుష్టాత్మల గురించి మాట్లాడుతున్నారు. పాపము చేసిన దేవదూతలను దేవుడు నరకంలోనికి నెట్టివేసినట్లు మనం వింటున్నాం. అవే దుష్టాత్మలు అనీ మరియు నరకం వాటి లోకము అని పరిశుద్ధ గ్రంథం తెలియజేస్తుంది (ఖురాన్ (సూరహ్ అల్-బఖరెహ్) 34,35,36) వచనాలలో ఈ విధంగా ఉన్నది. దేవుడు దేవదూతలతో మీరందరు ఆదాముకు సాష్టాంగం చేయండి అని ఆదేశించినపుడు, ఒక ఇబ్లీస్ తప్ప మిగతా వారంతా సాష్టాంగం చేస్తారు. ఇబ్లిస్ నిరాకరించాడు. మరియు దురహంకారానికి గురయ్యాడు మరియు సత్యతిరస్కారులోని వాడయ్యాడు. దేవుడు ఆదాముతో నీవు నీ భార్య ఈ స్వర్గంలో ఉండి అన్ని వృక్షాల పండ్లను తినుము కాని ఈ చెట్టు దరిదాపులకు పోకండి అని ఆజ్ఞాపించాడు. ఆ పిదప సైతాను వారిద్దరిని స్వర్గం నుండి వారున్న స్థితి నుండి దించాడు. ఇక్కడ ఇబ్లీస్ దేవదూత సాతానుగా పరిగణించారు. మరియు అది దేవుని మాటను నిరాకరించి సాతానుగా పరిగణించారు. పునీత పౌలుగారికి సాతాను అంటే దేవుడు ఇచ్చిన స్వేచ్ఛను దుర్వినియోగం చేసుకోవడం అంటారు. దేవుడు అంతా మంచిని సృష్టించాడు. కాని మానవుడు ఆ మంచిని వదలి చెడు మార్గంలో జీవిస్తున్నాడు. ఈ చెడుని సాతానుగా లేదా దుష్టాత్మగా పరిగణించవచ్చు.

## 2. భూతోచ్ఛాటనము అంటే ఏమిటి?

దుష్టశక్తి ఆవహించిన వ్యక్తి నుండి ఆ దుష్టశక్తిని పారద్రోలుటయే భూతోచ్ఛాటనము అంటారు.

బహిరంగంగా, అధికారకంగా యేసుక్రీస్తు పేరున ఒక వ్యక్తినిగాని, ఒక వస్తువుగాని దుష్టుని బంధకాల నుండి లేదా దుష్టశక్తి నుండి పరిరక్షించడాన్ని భూతోచ్ఛాటము అంటారు. యేసుప్రభువు దుష్టశక్తులను పారద్రోలారు. దుష్టశక్తులను పారద్రోలే శక్తి, అధికారం బాధ్యత ఆయన నుంచే శ్రీసభకు లభించింది (మార్కు 16:17)

## 3. భూతోచ్ఛాటన యొక్క సాధారణ అర్థం

### (ఎ) బహిరంగమైన భూతోచ్ఛాటనం

భూతోచ్ఛాటనం ముఖ్య ఉద్దేశ్యం సైతాను శక్తిచే పీడింపబడుతున్న వ్యక్తిని పూర్తిగా సైతాను శక్తి నుండి పారద్రోలి ఆ వ్యక్తిని దాని నుండి విముక్తిపరచుట. ఈ రకమైన భూతోచ్ఛాటనము సంఘకాపరి, పీఠాధిపతులు రోమన్ మతకర్మ పరిమిత మేరకు చేయవచ్చును లేదా గురుత్వ అంతస్తుకు చెందిన ఏ గురువయిన పీఠాధిపతుల ఆధీనంలో వారు గురుత్వమును స్వీకరించినప్పుడు తీసికొనిన ఆ అధికారాన్ని పీఠాధిపతుల అనుమతి మేరకు భూతోచ్ఛాటకుడు కావచ్చు. ఈ చట్టం క్యానన్ లా 1172లో ఉంది.

### (బి) వ్యక్తిగతమైన భూతోచ్ఛాటం

భూతోచ్ఛాటం ప్రార్థనలు వ్యక్తిగతంగా అందరు జరిపిస్తుంటారు. ఉదాహరణకు మనకు సైతాను శోధనలు వచ్చునప్పుడు మరియు సైతానుతో పీడింపబడుతున్నప్పుడు ప్రార్థిస్తాము. ఈ రకమైన భూతోచ్ఛాటంలో సాతానును వెళ్లగొట్టేందుకు ప్రార్థనలు మరియు విన్నప ప్రార్థనలు వుంటాయి. ఈ ప్రార్థనలు గురువులు, మఠవాసులు అందరు లేదా ఒక్కొక్క గురువు మరియు డీకన్ ఆధీనములో జరుగుతాయి. ఈ ప్రార్థనల ముఖ్య ఉద్దేశ్యం సైతాను శోధనల నుండి విముక్తి చేయడానికే అయినా వీటిని భూతోచ్ఛాటం అని ఖచ్చితంగా అనలేము. ఈ ప్రార్థనలు వ్యక్తిగత భూతోచ్ఛాటన పిశాచి శక్తిచే శోధింపబడుతున్న వ్యక్తులపై దీనిని ఉపయోగించలేము. ఎందుకంటే దీనికి బహిరంగమైన భూతోచ్ఛాటం ఉంది. ఈ ప్రార్థనలకు రోమన్ మత కర్మ మాత్రలను వాడరు.

### (సి) జ్ఞానస్నానం భూతోచ్ఛాటం

పాపం నుంచి, పాపాన్ని ప్రోత్సహించే సాతాను నుంచి జ్ఞానస్నాన విముక్తిని సూచిస్తుంది. కనుక సాతాను శక్తులను పారద్రోలు ప్రార్థనను అభ్యర్థిపై ఒకసారిగాని అనేకసార్లు గాని చేస్తారు. పిమ్మట జ్ఞానస్నానాభిషేకం కోసం ఉపయోగించే తైలంతో గురువు అభ్యర్థిని అభిషేకిస్తాడు లేదా అతనిపై చేతులు చాపుతాడు. అభ్యర్థి స్పష్టంగా సాతానును వదిలేస్తున్నానని ప్రకటిస్తాడు. అలా

సిద్ధం చేసిన తరువాతనే శ్రీసభ విశ్వాసాన్ని అంగీకరించటానికి సమర్ధుడు అవుతాడు. జ్ఞానస్నానం ద్వారా అభ్యర్థిని శ్రీసభ విశ్వాసానికి అప్పగిస్తారు.

### (డి) భూతోచ్చాటానికి కావలసినవి: నీరు, నూనె, ఉప్పు మరియు సాంబ్రాణి

వీటిని ప్రతి విశ్వాసి ఆయా సందర్భానుసారం వాడుతారు. నీరు, నూనె, ఉప్పు మరియు సాంబ్రాణి, గురువు రోమన్ మతకర్మ ప్రార్ధనల ప్రకారం ఆశీర్వదించవచ్చు. వీటిని ప్రత్యేకముగా భూతోచ్చాటకుడు ఆశీర్వదించాలని లేదు ఏ గురువయిన ఆశీర్వదించవచ్చు.

## 4. చరిత్ర నేపథ్యం

15వ శతాబ్దంలో క్రైస్తవ మతం దయ్యములను వెడలగొట్టి (లేదా) దుష్టశక్తులను పారద్రోలటం అను కార్యమును గురువులు మరియు కొన్నిసార్లు సాధారణ క్రైస్తవులు చేసేవారు. ప్రతి క్రైస్తవునికి క్రీస్తు నామంలో దయ్యాలను శాసించే లేదా వెడలగొట్టే శక్తి, అధికారం ఉండేది. దుష్టశక్తులను పారద్రోలే వారు భగవంతుని దీవెనల కొరకు ప్రార్థన చేస్తూ స్తుతి గీతముల (బెనెడిక్షన్) పద్ధతిని ఉపయోగించి దుష్టశక్తులను వెడలగొట్టుటకు "సైతాను వెనుకకుపొమ్ము" అని ఆనాటి ప్రాచీన కాలంలో వాడేవారు. తరువాత 1960లో రోమన్ మతం ఈ కార్యాన్ని అమెరికాలో అరుదుగా వాడేవారు. కాని 1970లో దుష్టశక్తులను పారద్రోలుట మీద శక్తివంతమైన పాత్రలు, సినిమా రూపంలో కథల రూపంలో తెరపై చూపించేవారు. ఇది మిగతా ప్రాంతాలన్నింటికి ప్రాకి, ఆ కాలంలో ఆయా ప్రాంతాలలో దయ్యం వెడలగొట్టే కార్యమును చేసేవారు. మోవిరిక్ గురువులు భూతోచ్చాటనము చేసి దయ్యములను వెడలగొట్టేవారు. ఈ క్రియను కతోలిక శ్రీసభ అనుమతి లేకుండా చాటుగా చేసేవారు. చివరిగా 2014 అంతర్జాతీయ భూతోచ్చాటకుల సంఘం దుష్టశక్తులను పారద్రోలుటకు అధికారం వాటికన్ నుండి అనుమతి పొందింది.

## 5. దయ్యం పట్టిన వారలలో వచ్చే మార్పులు

+ ఈ బాధపడేవారు తమని తాము కోసుకోవడం మరియు చర్మాన్ని కొరుక్కోవడం చేస్తారు.

+ వారి ముఖ పోలికలు మారుతాయి.
+ వారి స్వరము మారుతుంది.
+ వారి శరీరం వారి స్వాధీనంలో ఉండదు.
+ మానసిక ఆందోళన చెందుతుంటారు. మరియు ఇతరులకు హాని కలిగిస్తుంటారు.
+ వారు ఎప్పుడు వినని, మాట్లాడని బాషలలో మాట్లాడుతారు.
+ వారు మంచికి చెడుకి భేదం లేకుండా ప్రవర్తిస్తారు.

## 6. పాత నిబంధన గ్రంథం (ఒ.టి.)

సాతాను గూర్చి పరిశుద్ధ గ్రంథ వచనాలు ఆది 3:1-14 సర్ప రూపం, ఆది 3:15 సర్ప సంతతి, 2 థెస్స 2:9 సాతాను అద్భుతాలు 1 సమూవేలు 18:10 మరుసటి రోజు దేవుని దుష్టాత్మ సౌలును ఆవేశించెను. 1 రాజులు 11:1-8 సొలొమోను రాజు యావే దేవుని ధిక్కరించి అన్య దైవమును పూజించుటకు దుష్టాత్మ క్రియగా పరిగణించారు. తోబితు 8:3లో రఫాయేలు దేవదూత భూతమును వెంటబడి తరిమికొట్టడం చూస్తాము. చేప గుండెను, కాలేయమును వెలుపలికి తీసి మండుచున్న సాంబ్రాణి మీద వేయగా భూతము ఆ వాసనకు భరింపజాలక ఐగుప్తు దేశము ఎగువ భాగమునకు పారిపోయెను. రఫాయేలు దేవదూత భూతము వెంటబడి తరిమెను. ఆ దేశము దానిని పట్టుకొని దాని కాలుసేతుల బంధించెను. 1 సమూవేలు 28:3-4 సౌలు చనిపోయిన వారిని రప్పించు మాంత్రికురాలిని కలిసి సమూవేలు ఆత్మను రప్పించుట. లేవి 19:31 చచ్చిన వారితో సంబంధముల పెట్టుకొను మాంత్రికులను సంప్రదింపకుడు.

## 7. నూతన నిబంధన గ్రంథం (ఎన్.టి.)

దేవుని రాజ్యం అవతరణలో సాతాను రాజ్యం అంతం అవుతుంది. యేసుప్రభువు ఒక మాట పలికితే కొందరు వ్యక్తులు దయ్యాలు బారి నుండి విముక్తిని పొందారు. ఈ విషయాలను మనం మత్తయి, మార్కు, లూకా సువార్తలలో చూస్తాము. క్రీస్తుప్రభువు సాతాను శక్తిని జయించే అధికారాన్ని కలిగి వున్నాడు. అందువలననే ఆయనను మెస్సయ్య అని విశ్వసించారు.

క్రీస్తు ప్రభువు సైతాను శక్తులను పారద్రోలాడు. క్రీస్తు ఎవరో ఇచ్చిన శక్తితో దయ్యాలను వెళ్లగొట్టడం లేదు. తన స్వశక్తితో వెల్లగొట్టుచున్నాడు కాని ఆనాటి ప్రజలు క్రీస్తు బెల్జబులు ద్వారా వెళ్లగొట్టుతున్నాడని తప్పు పట్టేవారు (మత్తయి 12:24-27, మార్కు 3:22, లూకా 11:15,19). క్రీస్తు, దయ్యాన్ని బాలుడి నుండి విడిపొమ్మని ఆజ్ఞ ఇచ్చెను. అంతటితో ఆ దయ్యము వెడలిపోయెను (మార్కు 9:24). తన వాక్కుతో సాతాను శక్తులను పారద్రోలెను. అనారోగ్యంతో ఉన్న వారందరిని స్వస్థపరచెను (మత్తయి 8:16). ఎంతో విశ్వాసం చూపించిన కననీయ స్త్రీ కుమార్తె దయ్యంపట్టి ఉండగా మాట ద్వారా చాలా దూరంలో క్రీస్తు ఉన్నప్పటికి స్వస్థత కలిగెను. మార్కు 15:22, మార్కు 7:25 దయ్యాలు సహితం క్రీస్తుప్రభువు అని విశ్వసించాయి. మార్కు 1:24. అపొస్తలులు కూడా కొన్ని సందర్భాలలో దయ్యములను వెళ్లగొట్టలేకపోయారు. అలాంటి సందర్భంలో కొన్నిదయ్యములను కేవలం ఉపవాసం ప్రార్థనలతోనే వెడలగొట్టగలమని హెచ్చరించారు (మత్తయి 17:15-20) మార్కు 9:27-28, లూకా 9:40) దయ్యాలను ఆనాడు క్రీస్తు ఏవిధంగా వెళ్లగొట్టాడో అదే విధంగా ఈనాడు గురువులు మరియు ప్రస్తుత శ్రీసభ వెళ్లగొడుతున్నది. పునీత పౌలుగారు యేసుక్రీస్తు నామమున దయ్యమును వెడలి పొమ్ము అని ఆజ్ఞాపించగా తక్షణమే అది వీడిపోయెను (అపొ 16:18).

## 8. వివిధ మతాలలో భూతోచ్ఛాటనము

### క్రైస్తవ మతం

క్రైస్తవ మతంలో భూతోచ్ఛాటనము అనేది క్రీస్తు ప్రభుని నామంలో జరుగుతుంది. నూతన నిబంధనలో యేసుప్రభువు దయ్యములను శాసించేవాడు (మార్కు 9:24). వాటిపై అధికారం ఆధిపత్యం ఆయనకు వున్నదని గుర్తించగలము. కొన్ని సందర్భాల్లో అపవిత్రాత్మ శక్తులు యేసు మాతో నీకు ఏమి పని మమ్ము నాశనము చేయవచ్చితివా అని అర్థించెను. అవి యేసుప్రభువు దేవుని పవిత్ర మూర్తి అని గుర్తించెను (మార్కు 1:24). యేసుప్రభువు శ్రీసభకు దుష్ట ఆత్మలను పారద్రోలుటకు అధికారమును ఇచ్చారు. పీఠాధిపతుల అనుమతితో దయ్యాలను పారద్రోలే ప్రార్థనను ఎవరైన చెప్పవచ్చును. క్రైస్తవ మతంలో క్రమ పద్ధతియైన

భూతోచ్ఛాటనము జరుగును. ఈ క్రమంలో గురువు భూతోచ్ఛాటనము చేసినప్పుడు ఆ దయ్యం ఎలాంటిదో తెలిసికొని, జాగ్రత్తలు తీసుకోవలయును. గురువు దెయ్యాలను అస్వస్థతో గాని మానసిక అస్వస్థతోగాని లేదా దుష్టునితో తలపడుతున్నాడని ఖాయము చేసికొని క్రియను మొదలుపెట్టాలి.

## హిందూ మతం

భూతోచ్ఛాటనము అను కార్యము హిందు మత ఆచారాలకు సంబంధించి ముడిపడి యున్నది. వారి మత గ్రంథములో దీని గూర్చి నాలుగు వేదాలలో అధర్వ వేదంలో భూతోచ్ఛాటను గూర్చి కొన్ని రహస్యాలు వుంటాయని తెలియజేస్తుంది. భూతోచ్ఛాటనము అర్థాన్ని మంత్ర మరియు యజ్ఞా అనే రెండు పదాలను వెర్దిక్ మరియు తాంత్రిక్ సంప్రదాయాలలో చూస్తాము. భగవద్గీతలో 3,7,9 అధ్యాయములలో దయ్యం పట్టిన వ్యక్తి దయ్యం పట్టిన బంధీ నుండి ఏ విధంగా విడుదల పొందాలో తెలియజేస్తాయి.

## ముస్లిం మతం

ముస్లిం మతంలో భూతోచ్ఛాటనం అనగా (రొగ్యు) అని అర్థం. ఇది హాని కలిగిన వారిని బాగుచేయుటకు ఉపయోగించే ప్రక్రియ. దీనిని క్షుద్ర మాంత్రిక విద్య (బ్లాక్ మ్యాజిక్) అని కూడా అంటారు. వారు భూతోచ్ఛాటం చేసే ముందు ఔషదం ఉపయోగిస్తారు. దీని పేరు అల్-టిబ్బల్ నబవి. ఇది ప్రవక్త మందు అని మాటలో చెప్పవచ్చు. ఖురాన్‌లోని దేవుని గూర్చిన కొన్ని ప్రవచనాలు దయ్యం పట్టిన వారి ముందు చదివేవారు.

మృత సముద్రంలోని గ్రంథాలు భూతోచ్ఛాటము గూర్చి తెలియజేశాయి. వాటిని యూదా మతంలోని ఒక శాఖ చేసేది. రబి వింకిలర్ భూతోచ్ఛాటన గురించి తెలుపుతూ, దయ్యం పట్టిన వారు మరియు కలిగించిన వారు ఇద్దరు స్వస్థత పొందారు. ఈ మతంలో దయ్యములను పారద్రోలడంలో ఒక రకమైన శిక్షణ పొందారు. ఆ శిక్షణ కబలన్ అంటారు.

## 9. 6 రకాల అసాధారణమైన సాతాను పనులు (వేద శాస్త్రం)

ఇది దయ్యములను వెళ్లగొట్టు వ్యక్తి చెప్పిన తన కథ. అతను రోములీ దయ్యములను వెళ్లగొట్టుటకు నియమించబడ్డ ముఖ్యమైన వ్యక్తి. అతనే ఫాదర్

గాబ్రియెల్ అముర్త్. ఇతను ఈ సాతాను పనులను రెండు రకాలుగా విభజించారు. అందులో 1.సాధారణమైనవి. 2.అసాధారణమైనవి. మొదటి రకం మామూలు శోధనలు మాత్రమే కాని రెండవది 6 భాగాలుగా విభజించబడింది. అవి క్రింద వివరించబడ్డాయి. ఫాదర్ అముర్త్ మనకు చెప్పాలనుకునేది ఏమిటంటే ముఖ్యంగా గురువులకు, పీఠాధిపతులకు, సాతాను క్రియలు నిజం. ఈ సాతాను క్రియల ద్వారా బాధపడుతున్న వారందరు కూడా శ్రీసభ నుండే సహాయం పొందగలరు. కనుక ప్రతి మేత్రాసణంలో ప్రత్యేకంగా గురువులను ఈ దయ్యాలను వెళ్లగొట్టుటకు నియమించాలి అని ఫాదర్ అముర్త్ పలికారు. మరియు విశ్వాసులు ఈ సాతానుకు గురికాకుండ ఉండాలంటే దివ్యసంస్కారాల జీవితం చాలా అవసరం అని గుర్తు చేస్తున్నారు.

## (1) సాతాను కలిగించే శారీరక బాధలు

పేరులో తెలియజేసినట్లుగా సాతాను శారీరకంగా బాధిస్తుంది. ఉదాహరణకు పునీత జాన్ ఆఫ్ క్రాస్ (సిలువ యోహాను) పునీత జాన్ మరియ వియాన్ని మరియు పునీత పాద్రెపియో ఇంకా చాలామంది ఫాదర్ అముర్త్ మనకు చూపిస్తున్నారు. వీరందరు కూడా శారీరకంగా బాధపడేవారు. ఏదిఏదైనా ఈ శారీరక బాధలు ఆత్మను ఏమీ చేయలేవు. కనుక మనకు అర్థమైనది ఏమిటంటే దీనికి భూతోచ్చాటనము చేయవలసిన అవసరం లేదు ప్రార్థనలు చాలు.

## (2) దెయ్యం స్వాధీనపరచుకొనుట

ఇక్కడ దెయ్యం మన శరీరాలను పూర్తిగా ఆవహిస్తుంది (ఆత్మలను కాదు) ఇక్కడ దయ్యం పట్టిన వ్యక్తికి తెలియకుండా మాట్లాడుతాడు. పనులు చేస్తాడు. విలువలు తెలియకుండా ప్రవర్తిస్తారు. దయ్యం పట్టుటకు ఏ పద్ధతి లేదు అలా అడగడం కూడా తప్పు. సొంత మనుష్యులైతే కఠినమైన బాధలను పెడుతుంది.

## (3) దెయ్యం పెట్టు హింస

ఇక్కడ దెయ్యం ఆవహించడం మనస్సాక్షికి తెలియకుండా చేయడం మాట్లాడటం అనేవి ఉండదు. మామూలుగా ఎవరినైనా అనారోగ్యంగా లేదా ఏదో విధంగా బాధిస్తుంది. ఉదాహరణకు యోబును మరియు పునీత పౌలును ఫాదర్ అమూర్త్, మనకు చూపిస్తున్నారు. మామూలుగా దెయ్యం పట్టుట చాలా

తక్కువ. ఫాదర్ అమూర్త్ మరియు తన సహోదరులు దెయ్యాలు వెడలగొట్టేవారు. కొన్ని కుటుంబాలలో వాళ్లు చూశారు. వారందరకు ఉద్యోగాలలో, బంధుత్వాలలో చాలా బాధలు అనుభవించారు అని చెప్పారు. నరకం అనుభవించినట్లు ఉంటుంది.

### (4) దెయ్యం ముట్టడించుట

ఇక్కడ అనుకోకుండా దెబ్బలు తగలడం వల్ల ముందుకు కొనసాగలేడు మరియు అనవసరమైన ఆలోచనల వల్ల కొన్నిసార్లు సరిగ్గా ఉండలేరు. ఇటువంటి సమయంలో తనను తాను కాపాడుకోలేడు. ఇంకా ఆ వ్యక్తి దెయ్యానికి ప్రణామం చేయడం. నిరాశ చెందటం చివరికి ఆత్మహత్య కూడా చేసుకొనుటకు ప్రయత్నిస్తాడు. ఎక్కువగా తన ఉహాగానాలు నడిపిస్తాయి.

### (5) దెయ్యము కలిగించు ఉపద్రవము

ఈ ఉపద్రవము ఎక్కువగా ఇంటిని వస్తువులను మరియు జంతువులను పీడిస్తుంది.

### (6) దెయ్యానికి లోబడుట లేదా స్వాధీనంలోకి వెళ్లుట

ఫాదర్ అమూర్త్ ఈ విధంగా చెప్తున్నారు మనుషులు తమంతట తాము సాతానుకు లోబడతారు. దాని క్రియలకు లోనవుతారు. దీనిలో రెండు విధాలుగా పూర్తిగా లోబడుతారు. ఒకటి రక్తబంధం, రెండవది పూర్తిగా సాతానుకు సమర్పణం అవుతారు.

### (7) స్వాధీనపరచుకొనుట

ఇక్కడ దెయ్యం మనిషి శరీరంను ఆవహిస్తుంది. ఆత్మను కాదు. కనుక మీరు వారికి తెలియకుండానే మాట్లాడతారు. పనులు చేస్తారు మరియు వారు దెయ్యం చేతిలో ఉన్నపుడు ఏమి చేశారో వారికి తెలియదు. ఇది భూతావేశంలో ఘోరమైనది. ఇక్కడ దయ్యం మనిషిని పూర్తిగా తన ఆధీనంలోకి తెచ్చుకుంటుంది. దెయ్యం పట్టినట్లు ప్రత్యక్షపరచుటకు గర్వంతో వ్యవహరిస్తుంది. శరీరాన్నంతా నాశనం చేస్తుంది.

## 8. హింసపెట్టుట

ఇక్కడ బాధలు కష్టాలు ఎక్కువగా బయటి నుండి వస్తాయి. మన బంధువులను బాధిస్తుంది. ఇది రెండు విధాలుగా ఉంటుంది. ఇది కొంచం తక్కువ రకమైన అవకాశం ఉంది. హింసించి ఆరోగ్యాన్ని పాడుచేస్తుంది. మంచి జీవితాన్ని ఆధ్యాత్మిక జీవితాన్ని బంధుత్వాలను మరియు పనులను జీవితాలను పాడు చేస్తుంది. శారీరకంగా మానసికంగా చెడగొడుతుంది. ఒకవేళ దయ్యం వలన అనారోగ్యం కలిగితే మందుల వలన అది పోదు బాధలు తగ్గించడం చాలా కష్టం.

## 9. దెయ్యం ముట్టడి

ఇక్కడ ఊహించినది ఖచ్చితంగా జరగాలి అన్నటువంటి ఆలోచన కలిగిస్తుంది. చివరికి ఆత్మహత్యకు కూడా దారి తీస్తుంది. ఇంకా రోజు చేసే పాపం ఖచ్చితంగా చేయిస్తుంది.

## 10. ఉపద్రవం

ఇది అసాధారణమైన దెయ్యం పట్టడం. ఇక్కడ ఇది జంతువులను, వస్తువులను, ఇంటిని లేదా స్థలమును పీడిస్తుంది.

## 11. కతోలిక శ్రీసభ

కతోలిక శ్రీసభలో భూతోచ్చాటనము చేసే వారిని భూతోచ్చాటకుడు అంటారు. ఈయన అభిషేకం పొందిన కతోలిక గురువై ఉండాలి. పీఠాధిపతి అనుమతితో గురువు మాత్రమే చేయాలి. శ్రీసభ నియమించిన నియమములను క్రమములను ఖచ్చితంగా పాటిస్తూ వివేకంలో గురువు ముందుకు సాగాలి. క్రైస్తవ మతంకు చెందిన స్వరూపములు, పవిత్ర వస్తువులను తన యొక్క భూతోచ్చాటము కోసం ఉపయోగించవచ్చు. శ్రీసభకు క్రీస్తు అప్పగించిన ఆధ్యాత్మిక అధికారంలోనే సాతానును పారద్రోలటం లేదా సాతాను ఆవహించిన వ్యక్తిని దుష్టశక్తుల నుండి విముక్తి చేయటం జరుగుతుంది. అస్వస్థత ముఖ్యంగా మానసిక అస్వస్థత ప్రత్యేక కోవకు చెందినది. కాబట్టి చికిత్స వైద్య శాస్త్రానికి సంబంధించిన అంశం. కనుక దుష్టశక్తులను పారద్రోలటానికి ముందు అస్వస్థతకు గురైన వ్యక్తితో కాదని దుష్టునితో తలపడుతున్నామని తెలసుకోవడం ముఖ్యం.

**ముగింపు**

భూతోచ్ఛాటనము అనే ఓ గొప్ప విధిని శ్రీసభ నేడు గురువులకు అందిస్తుంది. పైన పేర్కొనబడినట్లుగా ఈ విధిని గొప్ప బాధ్యతను నిర్వర్తించటంలో విఫలం కాకూడదు. ఇది పీఠాధిపతులు అనుమతితో పవిత్రాత్ముని సహకారంలో జరిగే క్రియ. స్వశక్తితో స్వలాభాల కొరకు చేసి హాని చేకూర్చుకొనక భక్తి, ప్రార్థన, పవిత్రతతో శ్రీసభ నియమాల ప్రకారం భూతోచ్ఛాటనము అనేది జరగాలి. భూతోచ్ఛాటం అను విద్యను గురువు కాకుండా సామాన్య వ్యక్తులు వాడినప్పుడు వారి జీవితంలో వారికి ప్రమాదాలు ఎదురయ్యే అవకాశం ఉంది. ఎందుకంటే వారికి దాని గురించి అవగాహన లేకుండా వాడతారు. ఎందుకంటే దీనికి కావలసిన శిక్షణగాని, వరముగాని, శక్తియుక్తులుగాని మనకు ఖచ్చితంగా కావాలి. మనం వీటన్నిటిని గూర్చి అవగాహన లేకుండా అధికార పూర్వకంగా చెయ్యనియెడల ఆ సైతాను శక్తి మనలోనికి ఇంకా రెండంతలుగా పంపబడును. అందుకే దీనిని ఒక గురువు మాత్రమే చేయాలి. పీఠాధిపతి అనుమతితో మాత్రమే చేయాలి. సాధారణమైన మానవుడు చేయకూడదు లేదా ఉపయోగించకూడదు.

ఈ దెయ్యం పట్టుట గురించి హిందూ సాంప్రదాయం ప్రకారం దెయ్యాలు అందరికి కనిపించవు కాని కొంతమంది చూడగలరు (నానుడి) ముందు కాళ్లతో జన్మించిన వారికి దెయ్యాలు కనిపిస్తాయి అంటారు. కాని ఇది నిజం అని చెప్పలేము. దెయ్యాలు ఎక్కువగా ఆడవాళ్లకు పడతాయి అని సినిమాల్లో చూస్తుంటాం. అదే విధంగా జీవితం మీద ఇష్టం పోయిన వారికి ఆత్మ నిగ్రహం కోల్పోయిన వారికి జీవితం అంటే విరక్తి కలిగిన వారిని ఈ దుష్టాత్మలు ఎక్కువగా ఆవహిస్తాయి. దేనినైనా గుడ్డిగా నమ్మకూడదు. విశ్లేషించి జాగ్రత్తగా గమనించి, అప్పుడు నిర్ధారణ చేసుకొని పనిలో దిగాలి.

❋ ❋ ❋ ❋

# 10. మంత్ర విద్య

– బ్రదర్ కత్తుల సునీల్

## ఉపోద్ఘాతము



మంత్ర విద్య అనాదికాలము నుండి మనుషుల మధ్య వివిధ రూపాలలో మరియు వివిధ ఆచారాలలో ఉన్నది. ఒక వ్యక్తి తన ప్రార్థనల ద్వారా కొన్ని అద్వితీయ శక్తులను లోబరచుకుంటాడు అని ప్రాచీన గ్రంథాలలోను మరియు కొన్ని ఆచారాలలోను మనం చూస్తాము.

ఉదా: ఈజిప్టు పిరమిడ్ గ్రంథాలు

ఈ మంత్ర విద్య ద్వారా మనుషులు తాము ఇతరుల కంటే బలవంతులమనీ, అధికులమనీ చూపించుకునేవారు. ఈ మంత్ర విద్యలను కొన్నిసార్లు మతాలలో కూడా ఉపయోగించి ఇతరుల మతం కన్నా మా మతమే గొప్పది అని చాటుకునేవారు. మంత్రము అను తెలుగు మాట సోదె చెప్పుట, సోదె చెప్పు వరము, చిల్లంగితనము, గొణుగువాడు, గారడీ విద్య చేయువాడు, మాంత్రికుడు, మంత్రకత్తె, జాతకము చెప్పువాడు. ఇంద్రజాలికుడు అను వివిధ అర్థములిచ్చు పదములకు ఉపయోగించబడును. మందులు కలిపి విషము పెట్టువాడు అను అర్థమిచ్చు మాటగా కూడా ఈ పదమును ఉపయోగిస్తారు.

## నిర్వచనం

అసాధారణ శక్తులను లేక ఆత్మలను లేక దయ్యములను తమ ప్రార్థనల ద్వారా లేదా మంత్రాల ద్వారా ప్రత్యక్షపరచి తమ స్వలాభం కొరకు ఈ అసాధారణ శక్తులను ఉపయోగించుకోవడమే మంత్ర విద్య. అదృశ్య శక్తులను తమ మంత్రాల

ద్వారా లోబరచుకుని భవిష్యత్తును తెలుసుకోటానికి ప్రయత్నిస్తారు. ఇతరులను లోబరచుకోవాలన్న ఉద్దేశ్యంతో ఈ అసాధారణ శక్తులను, ఆత్మలను, లేక దయ్యములను మంత్ర తంత్ర విద్యలతోను, ఇంద్రజాలంతోను మచ్చిక చేసుకుంటారు. ఈ క్షుద్ర విద్యల్ని ఉపయోగించి కీడు చేయాలన్న ఉద్దేశ్యంతో దయ్యాలు లేక ఆత్మల జోక్యం కొరకు ఆశ్రయించటమే మంత్ర విద్య.

## మంత్రవిద్య విధానం

వీటికి ప్రాచీన గ్రంథాలే మూలం. కొన్ని గ్రంథాలలో లేక ఆచారాలలో కొన్ని పనులను ఆ గ్రంథాలలో లేక ఆచారాలలో చెప్పినట్లు చేస్తే ఫలితాలు ఆ యొక్క గ్రంథాలలో లేక ఆచారాలలో చెప్పినట్లుగానే జరుగుతాయి అని నమ్మటం.

ఈ మంత్ర విద్యను చేసేవారికి ఒక క్రమము ఉంటుంది. మొదటిగా వారు ఒక మంత్ర చక్రాన్ని గీస్తారు. తరువాత ప్రారంభ ప్రార్థనను చెపుతారు. మంత్రపు మాటలు శక్తివంతముగా ఉంటాయని నమ్ముతారు. ఈ శక్తివంతమైన మంత్రపు మాటలను పదే పదే పలకటం ద్వారా ఆ శక్తులను తమ ఆధీనంలోకి తెచ్చుకుంటారు. మంత్ర దండమును మరియు ఇతర మంత్ర పరికరములను చేత పట్టుకుని మంత్రపు మాటల ద్వారా ఆత్మలను లేక దయ్యములను రప్పించి, ఆ మంత్ర చక్రములో పెడతారు. ఆ తరువాత ఆ శక్తులతో లేక ఆత్మలతో లేక దయ్యాలతో వారు అనుకున్న కార్యములను జరిపించుకుంటారు..

## మంత్రవిద్య రకాలు

మంత్రవిద్య రెండు రకాలుగా ఉన్నది.

ఎ. చెడు మంత్ర విద్య

బి. మంచి మంత్ర విద్య

చెడు మంత్రవిద్య ద్వారా ఇతరులకు కీడు లేక హాని చేయటానికి ప్రయత్నిస్తారు. ఒక్కొక్కసారి ప్రాణాలను కూడా తీస్తారు. ఇతరులకు నష్టాన్ని కలిగించడానికి, ఇతరులపై తమ ఆధిపత్యాన్ని చూపించుకోడానికి ఎక్కువగా చెడు మంత్రవిద్యను ఉపయోగిస్తారు. మంచి మంత్రవిద్య ద్వారా కొంతవరకు ఇతరులకు మంచి చేయటానికి ప్రయత్నిస్తారు.

## మంత్రవిద్య రూపాలు

తాయెత్తు, చేతబడి మరియు సోదె ఇవన్నీ కూడా మంత్రవిద్య రూపాలే. తీవ్రమయిన మంత్ర నిక్షిప్తములు తాయెత్తులను ధరించటం, చేతబడి ద్వారా ఇతరులకు కీడు చేయటం చేస్తారు. సోదె ద్వారా చనిపోయిన వారి ఆత్మలను పిలిచి భవిష్యత్తును తెలుసుకోవడం లేదా వారి (ఆత్మల యొక్క) కోరికలను తెలుసుకోవటం చేస్తారు. మంత్రవిద్యలోని వివిధ రూపాలను క్లుప్తంగా తెలుసుకుందాం.

## శకునము

సోదె, దాని బహుమానము, చిల్లంగితనము గుసగుసలాడువాడు, గారడీ చేయువాడు, మంత్రకాడు, సోదె కత్తె, జాతకములు చెప్పువాడులేక మాయగీతలు గీయువాడు, ఇంద్రజాలికుడు, మోసచర్య చెప్పువాడు, మాయకాడు మొదలగు అర్థములిచ్చు వేరువేరు స్థలములలో వాడిన నాలుగు హీబ్రూ పదములను ఆంద్రీకరించుటకు ఈ తెలుగు పదము ఉపయోగించబడినది. తెలుగులో దీని మొదటి అర్థము పక్షి. దాని నుండి ముఖ్యముగా పక్షులు ఎగిరిపోవుట నుండి శకునము లేక సోదె అనునది పుట్టుకొని వచ్చినది. ఈ మాట మరుగైఉన్న వానిని తెలిసికొనుటకుగాను చరిత్రయంతట అన్ని జాతులవారు ఉపయోగించిన ఏదో ఒక వాదమయిన ప్రయత్నమును చూపించుచున్నది. ఇది అమానుష సహాయము కలిగి ఉన్నామని నటించువారు ఆ సహాయము ద్వారా మనుష్యులకు సాధారణముగా మరుగై ఉన్న సంగతులను మరియు రాబోవు సంగతులను చెప్పుటకు ఉపయోగిస్తారు.

ఇట్టి జ్ఞానము కలదని నటించుట ద్వారా అనేక విధాలయిన శకునములు పుట్టినవి. ఈ శక్తి కలదనుకొనిన స్త్రీ, పురుషులు, మంత్రగాళ్లు, కలల భావమును చెప్పుదురు. రహస్యములను బయలుపరుస్తారు. మనుష్యులు పోగొట్టుకొనిన వస్తువులు కనుగొనునట్లు చేస్తారు. వారు పక్షులు పోగొట్టుకొనిన వస్తువులు కనుగొనునట్లు చేస్తారు. వారు పక్షులు ఎగిరిపోవుటను, చీట్లువేయుట ద్వారా మరియు మేఘములను వారి చలనములను గమనించి వాని వలన తమ తీర్మానములను చేస్తారు. శకునము చెప్పుటలో గ్రహణములను, గ్రహముల సంధిని

వాడుకొంటారు. చనిపోయిన వారి ఆత్మలతోను, దయ్యములతోను అన్యోన్య సంబంధము కలిగియుండగలము అనియు, వాని ద్వారా కావలసిన సమాచారమును తెలుసుకోగలం అని చెబుతారు. వారు అప్పుడే చంపబడిన మృగముల యొక్క ప్రేగులను, మనుషుల శవములను తనిఖీ చేసి రాబోవు సంగతులను తెలియజేయుటకు కావలసిన చిహ్నములను వీనిలో కనుగొంటారు. అనేకమయిన బాణములను వేసి ఎక్కువ బాణములుపోవు దిక్కును బట్టి తాము అనుకొనిన పని యొక్క దురదృష్టమును మరియు అదృష్టములను చెప్పుతారు. వారు ఎదురింపవలసిన పట్టణములు వచ్చినప్పుడు ఆ పట్టణముల ఒక్కొక్క పేర్లను ఒక్కొక్క బాణమును చెక్కి అన్నియును అమ్ముల పొదిలో పెట్టి, ఒక్కొక్క దానిని బయటకు తీయునప్పుడు ఏ పేరుగలది వచ్చునో ఆ వరుస ప్రకారము పట్టణములను ఎదిరిస్తారు. ఇది ఒక చీట్లు వేయడమై ఉన్నది. కర్రల ద్వారా శకునములను చెప్పు వాడుక కూడా ఉంది. కర్రను చక్కగా నిలువబెట్టి అది పడే దిక్కును బట్టి తాము కనుగొనగోరిన దానిని చెపుతారు. భారతదేశములోని సాధారణమయిన గారడీ వాని యొక్క అత్యాశ్చర్యకరమయిన నిపుణతను గాంచునపుడు అట్టిపని చేయువారు తమను చూచువారిని సులభముగా లోబరచుకుంటారు. వారి మాట మనుష్యులలో పలుకుబడి ఉంటుంది. కనుక ఇస్రాయేలీయులకిది ఎక్కువ శోధనగా ఉండేది.

కల్దీయుల దేశము శకునమునకు పుట్టినిల్లు అని చెప్పవచ్చును. కొన్ని జాతులవారు ప్రకృతిని గమనించువారును, భూగోళశాస్త్రజ్ఞులునై ఉన్నారు. ఈ జ్ఞానముతో కొన్ని శకునములను, అమానుషశక్తి తమకు కలదను నటనను కలిపినచో కొంత ధనమును సంపాదించుకొనుటకు సాధ్యమగునని వారు భావిస్తారు. ఈ కాలములో విస్తారముగా కనబడు జ్యోతిష్యము అనేక శతాబ్దాల నుండి ఈ విధముగా వృద్ధి చెందినది. ప్రతివాడు ఒక నక్షత్రము నందు పుట్టినవాడనియు, వాని జీవితమంతయు దాని స్వాధీనములో ఉన్నదని తలస్తారు. నక్షత్రములను జాగ్రత్తగా గమనించి, ప్రతివాని యొక్క జాతకము వ్రాయుట కల్దీ దేశపు జ్ఞానుల, పారంపర్యముగా వారి నుండి వచ్చిన ఇతర దేశస్తుల యొక్క పని.

శకునమును, దానికి సంబంధించినదంతటి పాపమును ఈ క్రింది వానిలో ఇమిడి ఉన్నది.

1. విగ్రహారాధనతో దానికి సంబంధము. అది ఎల్లప్పుడు విగ్రహారాధన చేయు మతములకు సంబంధించి ఉండెను. ఇది మనుష్యులకు మరుగైన సంగతులను అదృష్టవశమయినచో, పదార్థ సంబంధమయిన వానిలో కనబడు గురుతుల వలననో తెలుసుకొనవచ్చును అను నమ్మకం కలిగించి నిజదేవుని నుండి దూరం చేస్తుంది.

2. అది జ్ఞానమునకు మూలమయిన దేవునికి బదులు హస్తకృతమైన పదార్థమును నిలుపుటయై యున్నది.

3. స్వలాభము నిమిత్తము ఉపయోగించుచున్నందున అది మిక్కిలి మోసమునకు నడుపుచున్నది. ఎక్కువ లాభము కలుగునట్లు ఎక్కువ మోసకరమయిన పనులు చేయుదురు. అల్పజ్ఞానులు అట్టి శక్తి తమ ఆధీనమునందు ఉన్నదని చెప్పుకొందురు. ఇది అబద్ధమే.

4. శకునములో ఏమైన వాస్తవము ఉండిన అది స్త్రీ, పురుషులు సాతానుతో సహవాసము చేయుట వలననే కలుగవచ్చును.

5. ఇది మనుష్యులలో విస్తారమయిన భయమును పుట్టించును. అది వారికొక దాస్యత్వం అగును.

## గారడీవాడు

ఇంద్రజాలము చేయుట అని అర్థము. మానవులకు స్వభావికముగా ఉండు జ్ఞానశక్తుల కన్నా మించి వాటిని దయ్యముల ద్వారా పొందుట అని అర్థము.

## కర్ణపిశాచము

దయ్యములకును మరియు మనుష్యులలో కొందరికి ఒక విధమగు సంబంధము కలదనియు, అందువలన ఆత్మల లోకము నుండి ఆత్మగాని,

దయ్యముగాని వచ్చి కర్ణపిశాచము గలవానికి పరిచర్య చేయుననియు దాని అర్థము. దయ్యములతో సహవాసము చేసి రాబోవు సంగతులను, రహస్య విషయములను చెప్పగలగటం.

**చిల్లంగితనము**

మాంత్రికుడు రాబోవునవి తెలుపువాడు అని ఈ పదమునకు అర్థము. పంచభూతములు, గ్రహముల సంధి, అదృష్ట దినములు, ఋతువులు, అదృశ్యాత్మలు, దయ్యములు మొదలగునవన్నియు తనకు తెలియుననియు చెప్పునను సిద్ధాంతం. విపరీతాకారము గలవారే సాధారణముగా ఇట్లు చిల్లంగితనమును అభ్యసింతురు. వికారాకారులును, మరుగుజ్జులును, అందవిహీనులగు ముసలివారును వికారచూపుగలవారు ఎక్కువగా ఇట్టివారు. మనుష్యులకు అపాయము కలుగజేయుటకై వారు తమకు సహాయభూతులుగా దయ్యములు మొదలగు అమానుషశక్తులను ప్రయోగిస్తారు. తమ విరోధులను పరాభవము కలిగించుటకై జనులు సాధారణముగా వీరి సహాయము కొరకు వేచి ఉంటారు. వారి కోరికలు నెరవేరునట్లు మాంత్రికుడు మందులను గాని, తాయెత్తులను ఇతర వస్తువులను మంత్రించి ఇచ్చిన యెడల అవి తప్పక తమ ఇష్టమును నెరవేర్చును అని ప్రజలు భావిస్తారు.

**బైబిల్ గ్రంథం ఏమి చెబుతుంది?**

దేవుడే సృష్టికర్త, రక్షకుడు, ప్రభువు, జగత్తుకు యజమాని, అనంత కృపా ప్రేమామృతం కలవాడని గుర్తించుటయే ఆరాధన, స్తుతి, కృతజ్ఞత, విన్నపాలుగా రూపుదిద్దుకుంటాయి. ఇవన్నీ ఆరాధనా భావాన్ని అభివ్యక్తం చేస్తాయి. మనిషి భావాలను భగవంతుని వైపు మళ్లిస్తాయి. భగవంతుడు తన రూపంలో నరుని రూపొందించారు. కనుక నరుడు భగవంతున్ని మాత్రమే తెలుసుకుని ఆరాధించాలి, సేవించాలి, ప్రార్థించాలి మరియు అర్పణల ద్వారా దేవుడే సర్వాధికారి అని గుర్తించాలి.

తన ప్రవక్తలకు, పునీతులకు దేవుడు భవిష్యత్తును బయలుపరచగలడు. అయినా భావిజీవితం గూర్చి ఉబలాటాన్ని వదిలి తన భవిష్యత్తును దేవున్ని చేతుల్లో పెట్టకుండా, దేవునిలో నమ్మకం లేకపోవటం బాధ్యతాలేమిని సూచిస్తుంది.

## మొదటి ఆజ్ఞకు విరుద్ధమయిన పాపాలు

అన్ని రకాల సోదెలను తిరస్కరించాలి, జాతక చక్రాన్ని, గ్రహ శాస్త్రాన్ని, హస్తముద్రికలను సంప్రదించటం, శకునములను, అదృష్టాల అర్థవివరణములను, దివ్యదృష్టి అసాధారణ శక్తులను ఆశ్రయించటం, కాలంమీద, చరిత్రపైన చివరకు మానవమాత్రుల్లో మహిమలు, ఇవన్నీ అదృశ్యశక్తులను లోబరచుకునే ఆశని సూచిస్తాయి. అది దేవునికి ఇవ్వవలసిన గౌరవ మర్యాదలకు మరియు ప్రేమపూరిత భావనకు విరుద్ధం (సిసిసి 2116) భూత, ప్రేత పైశాచిక విద్యలు లేదా మాంత్రిక అభ్యాసాలను విడనాడాలి (సిసిసి 2117).

దేవున్ని కాకుండా ఆత్మలను నమ్మటం, మొదటి ఆజ్ఞకు విరుద్ధమయిన పాపం. మూఢనమ్మకాలు, విగ్రహారాధన, మంత్రతంత్రాలు, సోదె, దయ్యాలను ఆశ్రయించటం, జాతకాలు, రాశి చక్రాలను నమ్మటం, హస్తముద్రికలు, అంజనం చేయటం, చాతబడులు, తాయత్తులు కట్టుకోవటం వంటి దురాచారాలకు పాల్పడినప్పుడు దేవునిపట్ల విశ్వాసాన్ని కోల్పోయి ఆయన్ని అవమానపరుస్తున్నాం. ఆయన శక్తిని శంకిస్తున్నాం.

ఇంకా మతాన్ని హేళన చేయటం, దేవున్ని శోధించటం, భగవంతుని అర్చనకోసం అభిషేకించిన వ్యక్తులను, వస్తువులను, స్థలాలను అపవిత్రం చేయటం, ఆధ్యాత్మిక వరసంపదను క్రయవిక్రయాలు చేయటం వంటివి కూడా దేవుని శక్తిని తక్కువగా అంచనావేయటమే అవుతుంది. ఇవన్నీ మొదటి ఆజ్ఞకు వ్యతిరేకమయిన పాపాలు.

## మననం

1. దేవుడు ఒక్కరే. ఆయన సర్వశక్తిమంతుడు. అద్భుతాలు చేసి తనను తాను ఇస్రాయేలు ప్రజలకు తెలియపరచుకున్నారు. ఆయనే సత్యదేవుడు.

2. దేవుడు స్థిరమయినవాడు, చలించనివాడు, నిత్యుడు, విశ్వసనీయుడు, న్యాయవంతుడు, దోషరహితుడు, సార్వభౌముడు, దయాసముద్రుడు, అనంత కృపామయుడు.

3. దేవున్ని నమ్మి తరించడానికి విశ్వాసం, ఆశాభావం, ప్రేమ అనే వేదాంత సుగుణాలు అవసరం.

4. సత్యదేవున్ని తెలుసుకుని ప్రేమించి, సేవించి, తరించటమే నరుని ధర్మం.

5. ఆరాధన, ప్రార్థన, బలి, అర్పణల ద్వారా నరుడు దేవుని సార్వభౌమాధికారాన్ని గుర్తిస్తాడు.

6. ప్రమాణాలు, వ్రతాలు దేవునికి గౌరవాన్ని చేకూర్చుతాయి.

7. మూఢనమ్మకాలు, విగ్రహారాధన, మంత్రతంత్రాలు, చేతబడులు మొదలగునవి మొదటి ఆజ్ఞకు విరుద్ధమయిన పాపాలు మరియు దేవుని శక్తిని శంకింపజేస్తాయి.

### ధ్యానాంశం

1. "సైతాను పొమ్ము" ప్రభువైన నీ దేవుని ఆరాధింపుము. ఆయనను మాత్రమే సేవింపుము (మత్తయి 4:10).

తనను ఆరాధించుమని సైతాను యేసుని శోధించింది. నిన్ను ఎవరయినా అలా శోధిస్తే నీ స్పందన ఏమిటి?

2. మన దేవుడు స్వర్గమున ఉన్నాడు. అతడు తనకు ఇష్టమువచ్చిన కార్యమెల్లా చేయును. వారి విగ్రహములు వెండి బంగారములతో చేయబడినవి. నరుల హస్తములు వానిని మలచెను. ఆ బొమ్మలను మలచినవారును, వానిని నమ్మువారును వాని వంటివారే అగుదురు (కీర్తన 115:3-4,8).

విగ్రహములకు మ్రొక్కుతున్నప్పుడుగానీ, తాయత్తు కట్టుకుని శకునాలవంటి వానిని నమ్మినప్పుడుగాని, దేవున్ని ఆరాధించటానికి బదులు సైతానును ఆరాధిస్తున్నామని భావించారా? అలా చేయటం పాపం అని గ్రహించారా?

### ముగింపు

పది ఆజ్ఞలలో మొదటి ఆజ్ఞ మంత్ర విద్యను, దాని రూపాలయిన సోదెను, జాతక చక్రాన్ని నమ్మటం, ఖగోళ శాస్త్రాన్ని, హస్తముద్రికలను సంప్రదించటం, శకునములను, అదృష్టాల అర్థవివరణలను వ్యతిరేకిస్తుంది. ఎందుకంటే ఇవి దేవునికి మాత్రమే ఇవ్వవలసిన గౌరవ మర్యాదలకు, ప్రేమపూరిత భావనకు విరుద్ధం.

❊ ❊ ❊ ❊

# 11. చేతబడి

**- బ్రదర్ అల్లం సాగర్ మనోజ్ కుమార్**

## ఉపోద్ఘాతము



మన సమాజంలో ఎన్నో రకాల మూఢనమ్మకాలు ఉన్నాయి. కొందరు దెయ్యాలు ఉన్నాయని నమ్మితే మరికొందరు ఈ దెయ్యాలను, భూతాలను తమ ఆధీనంలో ఉంచుకొనే వ్యక్తులున్నారని విశ్వసిస్తారు. కొందరికి జాతకాల మీద పిచ్చివుంటే మరికొందరికి సంఖ్యల మీద ఎంతో నమ్మకం ఉంటుంది. కొందరికి కొన్ని ఘడియలు చెడ్డవి అయితే మరికొందరికి కొన్ని దినాలు ఎంతో మంచివి. ఇలా చెప్పుకుంటూ పోతే శకునాలు, జాతకాలు, అంజనాలు, సోదులు, భూత ప్రయోగం, చేతబడులు ఇంకా మరెన్నో మనముందు నిలుస్తాయి. ఇవన్నీ మనిషిలో ఉన్న మూర్ఖత్వానికి చిహ్నాలు.

ఇటువంటి మూఢనమ్మకాల గురించి, మహత్తుల మనస్తత్వం గురించి మాట వచ్చినప్పుడు కొందరు 'పోనీలెద్దూ, ఎవరి పిచ్చివారికానందం' అని తేలికగా తీసిపారేస్తారు. కాని ఎవరి పిచ్చి వారికానందంగా లేదు. ఈ మూఢ నమ్మకాలు ఆయా వ్యక్తుల శోకానికి కారణమవుతున్నాయి. సమాజ ప్రగతికి అవరోధంగా నిలుస్తున్నాయి. అంతేకాదు ఈ మూఢనమ్మకాలు కాస్త తెలివిగల వారికి దౌర్జన్యం జరుపడానికి సాధనాలుగా తోడ్పడుతున్నాయి. బహుశా! ఈ మూఢనమ్మకాలలో ఒకటైన చేతబడి, ఇది నమ్మకం కావచ్చు.. అబద్ధం కావచ్చు.. మూఢవిశ్వాసం కావచ్చు. కొందరు ప్రజలు దీనిని నేటికి విపరీతంగా నమ్ముతారు.

## 1. చేతబడి అనగా..

గిట్టని వారిని చంపటానికో, హాని చేయటానికో లేదా ఒక వ్యక్తిని తన వశం చేసుకోడానికో చేయించే విద్యని చేతబడి అంటారు. వివిధ ప్రాంతాలను బట్టి దీనిని విచ్‌క్రాఫ్ట్, వూడూ, బ్లాక్ మ్యాజిక్, సిహ్ర్, బాణామతి, చిల్లంగి అని కూడా అంటారు. చేతబడిని వివిధ రకాల పేర్లతో పిలిచినా, చేసే పని ఒకటే. మన భారతీయ తంత్ర శాస్త్రములో చేతబడి ఓ ప్రక్రియ. ఓ మనిషి జీవశక్తిని మంత్ర సాయంతో ఓ బొమ్మలోకి లాగి.. ఆపై ఆ బొమ్మను చిత్రహింసలు పెట్టడం ద్వారా శత్రువును చంపటం ఈ ప్రక్రియలోని ఓ మెట్టు. రిమోట్ కంట్రోల్ అనే ఐడియాకు వేల ఏళ్ల క్రితం నాటి మూలం ఇది. రిమోట్ పాస్‌వర్డ్‌లా లేదా మూలశక్తి కేంద్రంలా వ్యక్తి వెంట్రుకలు, గోళ్లు సేకరించి వాటిని మంత్రిస్తారు. మంత్రం అనేది ఓ శబ్ద శక్తి. అది మనిషి మూల జీవనాన్ని కదిలింపజేస్తుందని ఈ తంత్రం చేసేవారు చెబుతారు. ఇందుకు చాలా ఏర్పాట్లు చేసుకుంటారు. మూలనాడును ఆకర్షించే ముగ్గులు, వాటిపై దీపాలు, రకరకాల నీడల ద్వారా వాటిని ఉద్దీపతం చేసే ప్రక్రియలు చేతబడిలో ముఖ్యాంశాలుగా ఆ ప్రక్రియ చేసేవారు చెబుతారు. చూడ్డానికి ఇవి భయాన్ని కలిగిస్తాయి. అన్ని మతాలలో చేతబడి ప్రక్రియ ఉంది. మరి ఈ ఆధునిక నవయుగ ప్రపంచంలో టెక్నాలజీ ఎంత పెరిగినా కూడా ఏమిటి ఈ చెత్త అనేవారు ఉన్నారు. నిజానిజాలు మాట ఎలా ఉన్నా ఈ ప్రక్రియ జరిగే తీరు, నమ్మే జనం, చేసే విధానం అత్యంత ఆసక్తికరం, వాస్తవం.

## 2. చేతబడి చేయుటకు గల ప్రధాన కారణాలు

చేతబడిని చేయుటకు రెండు ప్రధానమైన కారణాలు ఉన్నాయి. మొట్టమొదటిగా ఒక వ్యక్తి మీద పగ తీర్చుకోవటం. ఎదుటి వ్యక్తి, మనతో సంఘములో జీవించే వ్యక్తి మనకు ద్రోహం చేసినప్పుడు, మనకి వారి మీద కోపం వచ్చి ఆ వ్యక్తులను నాశనం చేయాలని అనుకుంటాం. ప్రత్యక్షముగా ఆ వ్యక్తులను చంపకుండా ఈ చేతబడి అనే క్షుద్రపూజ ద్వారా మరణింపజేస్తాము. ఈ చేతబడి ప్రక్రియలో ఎదుటి వ్యక్తులను మందుల ద్వారా లేదా మాటల ద్వారా ప్రక్కకు త్రిప్పుకొని వారి ఆలోచనలపై, ఆచరణలపై పట్టు సాధించి, వారిని

మనకు అనుకూలముగా మార్చుకుంటాం. తద్వారా, తాంత్రికుడు వారిని చిత్రహింసలు పెట్టి చంపివేస్తాడు. ఉదాహరణకు అక్కడ తాంత్రికుడు సూదులతో పొడిస్తే ఇక్కడ బాధితులు అరుస్తారు.

రెండవదిగా, ఒక వ్యక్తిని తన వశం చేసుకోవాలన్న దృక్పథం కలవారు. ఇవి ఎక్కువగా జీవిత భాగస్వామల మధ్య, ప్రేమికుల మధ్య జరుగుతూ ఉంటాయి. దీనినే మనం వశీకరణం కూడా అంటాము. వశీకరణ జ్ఞానాన్ని కల్గిన మాంత్రికుడు తనకు సంక్రమించిన మంత్రశక్తిని దుష్టతలంపుతో తనకు గల సామర్థ్యాన్ని తాను పగబూనిన, ద్వేషిస్తున్న లేదా వశము చేసుకోవాలన్న వారిపై ఇంద్రజాల ప్రయోగాలను ప్రదర్శించటం. తద్వారా, అతడు లేదా ఆమె నిరంతరం తనతోనే ఉండాలని, తనకే వశమై, తన ఆధీనములో ఉండాలని కోరుకుంటాడు. ఉదాహరణకు మన వాడుక భాషలో మనం కొన్నిసార్లు ఇతరులను ఈ విధంగా అంటాము: ఏమిరా! నీవు ఆమెకు వశమై ఉన్నావా? లేదా నీకు ఆమె మందు పెట్టినదా అని అంటాము.

### 3. చేతబడికి గురియైన వ్యక్తి లక్షణాలు

ఎవరికైనా చేతబడి జరిగితే ఎలా తెలుసుకోవచ్చు అనేది చాలా మందికి ఇప్పటికీ ఓ సందేహమే. దీనిపై కొందరు మంత్రవేత్తలు కొన్ని లక్షణాలు చెబుతారు. చేతబడికి గురైన వ్యక్తికి ముందు అన్న ద్వేషం కలుగుతుంది. ఆకలనేదే పుట్టదు. వాళ్ల కళ్లు లోపలికి వెళ్లిపోతాయి. ముఖంపై బొబ్బలు, పుళ్లు వస్తాయి. ఏదో మాట్లాడుతూ ఏటో నడుస్తుంటారు. వీళ్ల ప్రాణాలన్నీ మంత్రవేత్త చేతుల్లోకి బొమ్మలోనే ఉంటాయి. దాన్ని సూదితో పొడిస్తే ఇక్కడ బాధితుడు అరుస్తాడు. అందుకే రోడ్లకు మధ్యలో కొందరు వేసే ముగ్గులను ఎవరూ తొక్కరు. కోడి రక్తంతో కలిపిన అన్నం ముద్దలు అందులో పారేస్తారు. వాటిని తాకరు. ఇవన్నీ చేతబడి ప్రక్రియలోని భయానక అంశాలు. ముందు భయం, ఆ తర్వాత పతనం ఈ ప్రక్రియతోనే ప్రారంభమవుతాయి. నిజానికి ఇదంతా ఓ నాన్సెన్స్ లేదా చెత్త అని కొందరి అభిప్రాయం. ఈ వాతావరణం, ఈ నమ్మకాలు మనిషిని మరణం దిశగా నడిపిస్తాయి. ఇదంతా కేవలం ఓ నమ్మకాన్ని సృష్టించడానికి ఆడే మెలో డ్రామా. అందుకే దీన్ని యధార్థముగా కాకుండా ఓ నాటకంగా చూస్తే ఏ భయం,

ఏ మరణం ఉండదు. మరియొక మాటలో వివరించాలంటే ఇది ఓ భయానక వ్యాపారం.

## 4. చేతబడి నిజముగా ఉందా?

చేతబడి గురించి ఒకప్పుడు అమ్మమ్మలు, తాతయ్యలు ఎక్కువగా చెప్పే మాట. పూర్వకాలంలో చేతబడికి గురైన వాళ్లను, చేతబడి చేయించే వాళ్లను గుర్తించామని చెబుతుండేవారు. అయితే ఇవన్నీ నమ్మశక్యమేనా? నిజంగానే చేతబడి ఫలిస్తుందా? అది సాధ్యమేనా? చేతబడితో ఓ వ్యక్తిని పూర్తిగా మార్చేయవచ్చా? చేతబడి ఓ వ్యక్తి జీవితాన్నే అఘాతంలోకి తొక్కేస్తుందా? అనేది నేటి తరాన్ని వేధించే సందేహాలు.

అర్ధరాత్రివేళ మంత్రతంత్రాలతో క్షుద్రపూజలు చేస్తూ.. ఆవాహమాయే అంటూ.. జపిస్తూ.. రహస్యంగా పెద్ద పెద్ద హోమాలు చేస్తూ.. ఈ తంతుకి స్మశానాన్నే వేదికగా చేసుకోవడాన్ని చేతబడిగా భావిస్తారు. తమకు గిట్టని వ్యక్తిపై పగ తీర్చుకోవడానికి చేసే తంత్రాలను చేతబడిగా చెబుతారు. ఇవన్నీ సినిమాల్లో కళ్లకు కట్టినట్లు చూపిస్తూ ఉంటారు. తమ శత్రువులకు హాని జరగాలని, వాళ్లను ఈ లోకం నుంచి పంపించేయాలనే దురాలోచనతో చేసేది ఈ క్షుద్రపూజలు. ఈ చేతబడి అనేది ఒట్టి మూఢనమ్మకం అని కొట్టిపడేసే హేతువాదులున్నారు. అలాగే ఇది ఖచ్చితముగా జరుగుతుందని స్వయంగా అనుభవించామని నమ్మి, భయాందోళనకు గురయ్యే వాళ్లు ఉన్నారు.

అయితే చేతబడి అనేది నిజముగా జరిగిందనడానికి ఆధారాలున్నాయని చాలామంది చెబుతూ ఉంటారు. కానీ ఈ మూఢ నమ్మకం పేరుతో గ్రామాల్లో అనేకమంది అమాయకులు బలవుతున్నారని హేతువాదులు వాదిస్తున్నారు. కొన్ని మారుమూల ప్రాంతాల్లో ఇప్పటికి చేతబడి జరుగుతోందని ప్రజలు బలంగా నమ్ముతారు. తమకు ఏదైనా కీడు జరిగినా.. ఉన్నట్టుండి అనారోగ్యం పాలైనా దానికి కారణం గిట్టనివాళ్లకు చేసిన చేతబడి ప్రభావమే అని భావిస్తారు. అయితే ఈ చేతబడి చేయటానికి గిట్టనివాళ్లకు చెందిన ఏ వస్తువైనా తీసుకెళ్తారని ఎక్కువగా వినిపిస్తూ ఉంటుంది. వెంట్రుకలు, గోళ్లు లేదా బట్టలు లేదా వాళ్లకు సంబంధించిన ఏదైనా ఒక వస్తువుతో మొత్తం మనిషిపై ప్రభావం చూపిస్తారని సాధారణంగా

చెబుతుంటారు. ఇలాంటి భ్రమలోనే ఇప్పటికీ అనుమానం వచ్చిన వాళ్లను చితకబాదటం, రాళ్లతో కొట్టడం, చెట్టుకి కట్టేసి చిత్రహింసలు పెట్టడం వంటివి చేస్తూనే ఉన్నారు.

కానీ... చేతబడి నమ్మాలా? అంటే మాత్రం తత్వవేత్తలు ఇదంతా భ్రమ మాత్రమే అని కొట్టిపారేస్తున్నారు. ఇదంతా మనసులో జరిగే హీనమైన చేతబడి అని వివరిస్తున్నారు. ఇతరులు చేసే మాయ, చెడు, మంచి ఏదైనా మనపై అంతగా పనిచేయదంటున్నారు. ఒకవేళ ప్రభావం చూపినా జీవితాన్ని మార్చేసే విధంగా జరగదని తేల్చి చెబుతున్నారు. చేతబడి శాస్త్రం ప్రస్తుత కాలంలో దాదాపు అంతరించిపోతుంది. ఇది వాస్తవానికి మంచి విషయం.

## 5. చేతబడిని అనుసరిస్తున్న దేశాలు

చేతబడితో ఒక మనిషి తలరాతే మార్చడం ఏంటని కొందరు ప్రశ్నిస్తూ ఉంటారు. ఎదుటి వ్యక్తి జీవితకాలాన్నే మార్చేసే శక్తి చేతబడికి ఉంటుందా అని ప్రశ్నిస్తుంటారు. కొందరు చేతబడి చేస్తుంటారు, మరికొందరు చేతబడికి గురైన వాళ్ళు ఉన్నారని నమ్ముతారు. అలాగే, కొందరు ఈ చేతబడి మన దేశములోనే ఉంది అని చెప్తుంటారు. మరికొందరు ఇతర దేశాల్లో కూడా ఉంది అని చెప్తుంటారు. మరి వాస్తవమేమిటి? ఈ చేతబడి ఏ కాలములో ఖచ్చితముగా ప్రారంభం అయిందో తెలియనప్పటికీ దాదాపు అన్ని కాలాల్లోనూ, అని ప్రాంతాల్లోనూ ఇది ఉన్నట్లు పరిశోధనల ద్వారా తెలుస్తుంది. ఆస్ట్రేలియా పాతకాలపు తెగల్లో, అమెరికాలోని రెడ్ ఇండియన్స్‌లో, ఆఫ్రికా తెగల్లో, ఈజిప్ట, ఇరాన్, గ్రీకు, రోము, భారత్, చైనా, నైనోవా, జర్మనీ, జపాన్ దేశాల్లో పూర్వమే కాదు, ఇప్పటికీ చేతబడి, క్షుద్ర విద్య అనేది ఏదోక రూపంలో ఉన్నట్లు అధ్యయనాలు చెబుతున్నాయి. మరి ముఖ్యంగా ఈ చేతబడి అనే క్షుద్రపూజ ఇరాన్ దేశంలో మొట్టమొదటిగా ప్రారంభమై, ఇతర దేశాలకు వ్యాపించినట్లు అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

## 6. ఇండియాలో చేతబడికి ప్రసిద్ధి చెందిన ప్రాంతం – మాయోన్గ్

కొన్ని గగుర్పాటు కథలు జరిగిన ప్రదేశాలు ఉన్నాయి. అటువంటి ప్రదేశాలలో భారతదేశము కూడా చేతబడికి ప్రసిద్ధి చెందిన గ్రామం ఒకటి ఉంది. ఆ గ్రామం గురించి కొన్ని నిజాలను తెలుసుకుందాం. ఈ గ్రామం

భారతదేశం యొక్క చేతబడి రాజధానిగా పరిగణించబడుతుంది. అక్కడ వారు పగలు, రాత్రి అనే తేడా లేకుండా అభ్యాసం చేస్తారు. ఈ 'మాయోన్గ్' అనే గ్రామం అస్సాంలో ఉంది. మరి, అసలకి ఈ గ్రామం పేరు మాయోన్గ్ అని ఎందుకు వచ్చింది? 'మాయ' అంటే నిజానికి భ్రమ అని అర్థం మరియు మ్యాజిక్, మంత్రవిద్య, చేతబడి ఇక్కడ నిర్వహిస్తారు. అందుకే మాయోన్గ్ అని పేరు వచ్చింది. వార్షిక పండుగ మాయోన్గ్-పోబితోరా అనే మేజిక్ పండుగను ప్రతి సంవత్సరం వన్యప్రాణుల కలయికతో జరుపుకుంటారు. మూడు రోజుల పాటు ఈ పండుగలో చేతబడి సాధన చేసి ప్రజలందరూ ఊరేగింపుగా తిరుగుతారు. మరి ప్రజలు ఇక్కడికి ఎందుకు వస్తారంటే, ఇది భారతదేశం యొక్క చేతబడి రాజధానిగా తెలుసు. కాబట్టి దేశంలోని వివిధ ప్రాంతాల నుండి ఈ అసాధారణ కళను అభ్యసించడానికి మరియు తెలుసుకోడానికి వస్తూ ఉంటారు. ఈ వింత మాయోన్గ్ సెంట్రల్ మ్యూజియం 2002వ సంవత్సరంలో ప్రారంభమైంది. దీనిలో పౌరాణిక ఇతిహాసాలు మరియు చేతబడిని ఎలా అభ్యసించాలో తెలిపే అనేక పురాతన అచ్చు ప్రతులు ఉన్నాయి. ఈ మాయోన్గ్ గ్రామంలో చేతబడి సాధన చేసే వ్యక్తులను 'బేజ్' లేదా 'ఓజౌ' అని పిలుస్తారు. వారి పద్ధతులకు సహాయకులుగా దెయ్యాలు ఉంటాయని ప్రజలు నమ్ముతారు.

## 7. బాణామతి అంటే ఏమిటి?

ఒక వర్గానికి చెందిన కొంతమంది సభ్యులు, మానవాతీత (దైవ సంబంధమైన) శక్తులతో ఇతరులకు హాని చేస్తారని నమ్మటాన్ని బాణామతి అంటారు. చేతబడిని వివిధ ప్రాంతాలను బట్టి ఈ విద్యని విచ్‌క్రాఫ్ట్, బ్లాక్ మ్యాజిక్, చిల్లంగి, బాణామతి అని పిలుస్తారు. అయితే, ఈ బాణామతి అనేది మన ఆంధ్ర, తెలంగాణా రాష్ట్రాలలో ఎక్కువగా ఉంది. మరి ఈ చేతబడులలో ఒక రకమైన బాణామతి గురించి లోతుగా తెలుసుకుందాం.

### 7.1. బాణామతితో భయపడడానికి గల కారణాలు

- సాంస్కృతిక నమ్మకాలు
- సామాజిక స్థితిగతులు
- పీడింపబడడం, అణచిపెట్టబడడం

- నిరక్షరాస్యత, అజ్ఞానం
- వైద్యసహాయం లేకపోవడం
- రాజకీయ, సామాజిక కక్షలు
- వివాహ మరియు వ్యక్తిగత సమస్యలు
- మానవాతీత దుష్టశక్తులపై విశ్వాసం, మూఢనమ్మకాలు

## 7.2. బాణామతితో నమ్మకానికి గల కారణాలు

- పేదరికం - 80 శాతం
- నిరక్షరాస్యత - 80 శాతం
- చలనశీలత లేకపోవడం - 90 శాతం
- ఆరోగ్యం బాగా లేకపోవడం - 80 శాతం
- అణచివేయబడడం, పీడించబడడం - 70 శాతం
- మూఢనమ్మకాలు, మంత్రాలపై విశ్వాసం - 95 శాతం

## 7.3. బాణామతికి వ్యతిరేకముగా సాంఘిక దురాచారాలను అడ్డుకోవడానికి సూచనలు

- గ్రామీణ ప్రాంతాలలో ఆరోగ్య సౌకర్యాలను మెరుగుపరచడం
- సంచార వైద్య బృందాలను పంపించడం
- బాణామతి రోగులను ఆస్పత్రుల్లో చేర్చుకుని సత్వర వైద్యసదుపాయాన్ని అందించడం.
- బాణామతిపై సరైన అవగాహన కల్పించడం
- మండల కార్యస్థలంలో మానసిక వైద్య నిపుణులను, మానసిక శాస్త్రవేత్తలను, వైద్య, సామాజిక కార్యకర్తలను నియమించడం.
- సమాచార ప్రసార సంబంధాలను, రాకపోకల సౌకర్యాలను మెరుగుపరచడం
- స్వచ్ఛంద సంస్థలకు ప్రోత్సాహమివ్వడం
- గ్రామీణ ప్రాంతాలలో ఎక్కువ పాఠశాలలను ప్రారంభించడం

- ❖ బాణామతికి వ్యతిరేకమైన పాఠ్యాంశాలను పాఠశాల విద్యా ప్రణాళికలో చేర్చడం
- ❖ బాణామతికి వ్యతిరేకంగా కఠిన చట్టాలను చేయడం
- ❖ బాణామతి అపరాధానికి విచారణ యోగ్యత కల్పించడం
- ❖ బాణామతి నమ్మకాన్ని పెంచే టివి సీరియళ్లను, సినిమాలను నిషేధించడం
- ❖ బాణామతి బాధితులకు రక్షణ కల్పించడం
- ❖ మూఢనమ్మకాలపై ఉండే భీతిని పారద్రోలడంలో ప్రభుత్వ పాత్ర వైజ్ఞానిక దృక్పథాన్ని పెంపొందించడం
- ❖ వైద్య సదుపాయాలను అందించడం
- ❖ బాణామతిని ఎదుర్కోవడంలో సమర్థమైన పాత్ర పోషించడం
- ❖ బాణామతికి పాల్పడిన నేరస్తులకు కఠినమైన దండన విధించడం
- ❖ యువతకు, స్త్రీలకు గల కార్యక్రమాలను, అవగాహన సదస్సులను నిర్వహించడం
- ❖ ఇలా ఎవరైనా బాణామతికి, చేతబడి చేస్తున్నారని అనుమానం ఉంటే మీరు వారిని పోలీసులకు అప్పగించండి. అంతే తప్ప వారిని కొట్టి చంపకండి.

**8. చేతబడిపై అవగాహన**

- ❖ చేతబడి చేస్తున్నవారు ఎవరైనా మన గ్రామాలలో ఉన్నట్లయితే, వారిని పెద్దల సమక్షములో హెచ్చరించి, అధికారులకు అప్పగింపవలయును.
- ❖ చేతబడిపై మంచి అవగాహన సదస్సు కార్యక్రమాలు జరపడం
- ❖ పాఠశాలల్లో, కళాశాలల్లో చేతబడిని పాఠ్యాంశాలుగా అమలు చేయడం
- ❖ అనారోగ్యం వచ్చినప్పుడు డాక్టర్‌ని సంప్రదించాలేగాని, తాంత్రికులను లేదా మంత్ర శక్తి గల వారిని సంప్రదించకూడదు.
- ❖ సాంఘిక మరియు వైద్యపరంగా దుష్టమంత్ర విద్యను ఆపివేయాలి.
- ❖ నిజానిజాలు తెలుసుకోకుండా చేతబడిని గ్రుడ్డిగా నమ్మకూడదు.
- ❖ ఇలాంటి దుష్టశక్తులు, మంత్రశక్తుల గురించి మనం మాట్లాడకూడదు మరియు ఆ శక్తుల గురించి మాట్లాడేవారికి దూరముగా ఉండటం శ్రేష్టము.

## 9. పరిశుద్ధ గ్రంథములో ఉన్న చేతబడి సంఘటనలు మరియు ఆధారాలు

**ద్వితీయోపదేశకాండము 18:10-11:** మీ బిడ్డలను అగ్నిలో దహనబలిగా అర్పింపరాదు. మీరు శకునములు చెప్పించుకొనకుడు, జ్యోతిష్కులను సంప్రదింపకుడు, చేతబడులు చేయింపకుడు, మంత్ర తంత్రములు ఉపయోగించుకొనకుడు.

**మీకా 5:11-12:** మీ దేశములోని నగరములను నిర్మూలించి మీ కోటలను కూలద్రోయుదును, మీ మంత్ర విద్యను, మీ సోదెకాండ్రను రూపుమాపుదును.

**సమూవేలు మొదటి గ్రంథము 15:23:** తిరుగుబాటు సోదె చెప్పించుకొనుట వంటిది. గర్వము విగ్రహాములను పూజించుట వంటిది. నీవు యావే మాట త్రోసివేసితివి కనుక యావే నీ రాచరికమును త్రోసివేసెను.

**రాజుల దినచర్య మొదటి గ్రంథము 10:13-14:** ప్రభువును లక్ష్యము చేయలేదు. కనుక సౌలు చచ్చెను. అతడు ప్రభువాజ్ఞను త్రోసిపుచ్చెను. చనిపోయిన వారి భూతములను ఆవాహనము చేయువారిని సంప్రదించెను. ప్రభువును సంప్రదింపడయ్యెను. కనుక ప్రభువు సౌలును సంహరించి అతని రాజ్యమును యిూషాయి కుమారుడైన దావీదు వశము చేసెను.

**నహూము 3:4:** తన వ్యభిచారములకు గాను నీనెవె శిక్షనొందుచున్నది. ఆమె అందగత్తె, మంత్ర విద్యలో ఆరితేరినది. ఆమె తన రంకులతోను, మంత్ర మహిమలతోను జాతులను ఆకర్షించి బంధీలను చేసెను.

**దర్శన గ్రంథము 21:8:** పిరికివారికి, వక్రబుద్ధులకు, విశ్వాసరహితులకు, హంతకులకు, వ్యభిచారులకు, ఇంద్రజాలికులకు, విగ్రహారాధకులకు, అసత్యవాదులకు గంధయుక్తమైన అగ్నిగుండమే తగిన స్థలము.

**ముగింపు**

ఈ రోజుల్లో చాలామంది ఆరోగ్యం కోసం యోగాభ్యాసం చేస్తుంటారు. అలాగే మానసిక ప్రశాంతత కోసం, ఏకాగ్రత కోసం ధ్యానాభ్యాస తరగతులలో చేరుతుంటారు. అదే విధముగా, శారీరకంగా నూతనానుభవం పొందడం కోసం

నాట్యశిక్షణ పొందుతున్నారు. అయితే, ఈ విధానాల వలన క్రైస్తవ విశ్వాసానికి ఎలాంటి హాని జరుగదని అనుకోవడానికి వీలులేదు. తరచు ఈ విధానాలు క్రైస్తవ మతానికి భిన్నమైన మత సిద్ధాంతాలకు వాహికలుగా పనిచేస్తాయి. ఏ వ్యక్తి హేతుబద్ధంకాని, ప్రాపంచిక దృక్పథాన్ని కలిగి ఉండరాదన్నదే మన నిశ్చితాభిప్రాయం. ఇందులో భాగంగానే మనుష్యులకు ఏవో మంత్రశక్తులు సిద్ధిస్తాయని, కొందరు వ్యక్తులు మార్మిక శక్తులను, ఆత్మలను వశపరచు కోగలుగుతారనీ, ఆయా సంఘాల్లో ప్రవేశం పొందినవారికే మార్మిక జ్ఞానం లభిస్తుందనీ, అజ్ఞానులకది లభ్యం కాదని – అంటూ చేసే తాంత్రిక వాదనలను మనం పూర్తిగా తిరస్కరించాలి. ప్రాచీన కాలంలో ఇస్రాయేలీయుల ఇరుగుపొరుగు జాతుల ప్రజలు ఆరాధించే దేవతలు, ఆత్మలు యధార్థమైన భాగవన్మూర్తులు కారని నిరూపింపబడింది. ప్రియులారా! దేవుని శక్తిని, దైవసహాయాన్ని, దేవుని ఆశీర్వాదాలను నమ్మడానికి బదులు మూఢ విశ్వాసాలను పెంచుకొని తదనుగుణముగా నడవటం, మంత్ర తంత్రాలను నమ్మటం, చేతబడులను విశ్వసించటం, ఇంద్రజాలాన్ని విశ్వసించడం, గుప్తవిద్యలను ఆశ్రయించటం, నూతనముగా మార్మిక అభ్యాసాలు చేయటం, హస్తసాముద్రికం, బాణామతి, జోస్యం, సోదె వంటి క్షుద్రవిద్యల ద్వారా భవిష్యత్తు తెలుసుకోవాలని ప్రయత్నించటం లేదా దెయ్యాలను ఆత్మలను ఆశ్రయించటం పరిపూర్తిగా నమ్మకూడదు, వాటిని నిషేధించాలి. మరియొక మాటలో వివరించాలంటే, మనం దుష్టశక్తుల మీద, మాంత్రిక శక్తుల మీద ఆధారపడకుండా కేవలం దేవుని శక్తి సామర్థ్యాలపై, కృపాకటాక్షములపై ఆధారపడి జీవిద్దాం, తంత్ర విద్యని నిర్మూలిద్దాం, సంస్కృతిని ఉద్ధరిద్దాం.

❋ ❋ ❋ ❋

# 12. నిజమైన దేవున్ని సంవిధానంలో పూజించుట

**- ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి**

## ఉపోద్ఘాతము



దేవునికి భయపడుడు, ఆయన మహిమను స్తుతింపుడు. ఏలన ఆయన మనుజులకు తీర్పు చెప్పు దినము ఆసన్నమైనది. దివిని, భువిని, సముద్రమును, నీటి ఊటలను సృష్టించిన ఆ దేవుని ఎదుట భక్తితో వినమ్రులు కండు (దర్శన 14:7).

ప్రియ పాఠకులారా! మనం పూజిస్తాము. కొన్నిసార్లు సరియైన విధానంలో పూజిస్తాము కాని దేవుని గూర్చి సరియైన అవగాహన లేకపోవచ్చు. ఇంకొన్నిసార్లు దేవున్ని గూర్చి సరియైన అవగాహణ ఉండవచ్చు కానీ పూజించే విధానంలో లోపం ఉండవచ్చు. క్రైస్తవులమైన మనం త్రిత్వైక దేవున్ని ఏ విధంగా పూజిస్తే, గౌరవప్రధంగా మన భక్తిని వెల్లడిస్తే, సరియైన రీతిలో ఉంటుందో ఈ వ్యాసం క్లుప్తంగా తెలుపుతూ, పైగా మనల్ని ఇతర మంత్ర, భూత, మూఢ నమ్మకాలవైపుకు వెళ్లకుండా, ఆశ్రయించకుండా, మన నిజదేవున్ని సరిగ్గా పూజించేలా చేస్తుంది ఈ వ్యాసం.

## 2. పూజించుట - శబ్ద వ్యుత్పత్తి

దేవున్ని పూజించటం లేదా మ్రొక్కటం అంటే అవధులులేని, విపరీతమైన ప్రేమతో మరియు నిండు, సంపూర్ణ మనస్సుతో సమర్పిస్తూ గౌరవించటమే పూజించుట, మ్రొక్కుట, ఆరాధించుట అని వెబ్‌స్టర్ నిఘంటువు తెలుపుతుంది.

సంస్కృతంలో పూజ అని అంటాము. దీనినే మనం గౌరవించటం, మ్రొక్కటం, ఆధ్యాత్మికమైన చింతన కలిగి ఉండటం.

పూజించుట లేదా మ్రొక్కటం అను పదము హీబ్రూ భాషలో "శక్కామ్" అనే పదాన్ని పాత నిబంధనలో వాడినారు. గ్రీకు భాషలో ప్రోస్కునేఓ పదంనుండి తీసుకున్నారు. ఈ రెండు పదాలు కూడా మహోన్నతమైన వానికి బలహీనమైన మానవుడు దీనతతో, గౌరవంగా మ్రొక్కటం, వంగటం, సాష్టాంగపడటం అని అర్థం.

పూజించటం అనేది పురాతనమైన అనే ఆంగ్లమూల పదం నుండి తీసుకోవటం జరిగింది. Weorpscripe అంటే పూజించుట ఒక ఉన్నతమైన, శక్తివంతమైన దానికి గౌరవం చూపటం. పూజించటం అనే పదము వర్తినెస్ లేదా వర్షిప్ అనే పదాల నుండి అంటే అర్హుడైనవాడు, విలువకు తగినవాడు అనే శబ్దవ్యుత్పత్తి నుండి వెలువడినాయి. అర్హుడైనవాడికి, అమూల్యమైన వానికి మానవుడు ఇచ్చే తగిన మర్యాదే, గౌరవమే పూజించుట. ఏది, ఎవరికి అర్హతపూర్వకంగా చెందుతుందో, దానికి వారికి ఇవ్వటమే పూజించుట అని అనవచ్చు. దేవుడొక్కడే మానవ గౌరవానికి అర్హుడు. కాబట్టి మానవుడు దేవునికి గౌరవాన్ని ఇస్తూ పూజలు సలుపాలి. అందుకే బైబులు గ్రంథం ఇలా అంటుంది: సుస్థిరమైన రాజ్యమును పొందుచున్న మనము కృతజ్ఞులమై యుందుము. భయభక్తులతో దేవునికి ప్రీతికరమైన విధముగా ఆయనను పూజింతుము (హెబ్రీ 12:28).

### 3. పరిశుద్ధ గ్రంథం – పూజించుట/ఆరాధించుట

బైబుల్ గ్రంథం ద్వారా దేవుడు మానవునిలో సంభాషిస్తున్నాడు. పూజ, గౌరవప్రదమైన భక్తి, ఆరాధన తనకు చెందినదని, తానే స్వయంగా మనతో చెపుతున్నారు.

పూజించుట (ఆరాధించుట) అనునది మతంలో మొదటి సుగుణం. పూజించుట అంటే సృష్టికర్తను, రక్షకున్ని దేవునిగా, ప్రభువుగా, అధిపతిగా, అనంతంగా, కృపగల ప్రేమ అని అంగీకరించటం. అందుకే లూకా 4:8, ద్వితీయో 6:13 ఇలా అంటున్నాయి: "నీ దేవుడైన ప్రభువును ఆరాధించి, ఆయనను మాత్రమే

సేవింపవలయును (లూకా 4:8). "మీరు ఆ ప్రభువునకు భయపడుడు. అతనికి మ్రొక్కుడు. అతని పేరు మీదగానే బస చేయుడు" (ద్వితీయో 6:13), దర్శన గ్రంథం చెప్పుచున్నట్లుగా "దేవునకు భయపడుడు. ఆయన మహిమను స్తుతింపుడు! ఏలయన ఆయన మనుజులకు తీర్పుచెప్పు దినము ఆసన్నమైనది. దివిని, భువిని, సముద్రమును, నీటి ఊటలను సృష్టించిన ఆ దేవుని ఎదుట భక్తితో వినమ్రులు కండు (దర్శన 14:7).

"ప్రభువైన నీ దేవుని ఆరాధింపుము, ఆయనను మాత్రమే సేవింపుము" అని యేసు పలికెను (మత్తయి 4:10).

స్తుతి, పూజ అనునవి దేవునికే చెందాలి. అందుకే కీర్తన 96:9 అంటుంది, "పవిత్ర వస్త్రములు తాల్చి ప్రభువును ఆరాధింపుము. 'విశ్వధాత్రి! ఆయనను చూసి గడగడ వణకుము". దేవుడు తన ప్రజలతో అంటున్నారు, ఈ లోక సృష్టి దేవుడు కాదు. ఇతర శక్తులను ఆశ్రయించే వారిని ఉద్దేశించి, నిర్గమకాండం 20:3 అంటుంది "మీకు నేను తప్ప మరొక దేవుడు లేడు" అలాగే నిర్గమకాండం అంటుంది అన్నీ దేవుని సృష్టి కాబట్టి దేవున్ని మాత్రమే పూజించు. "పైనున్న ఆకాశమునందు, క్రిందనున్న భూమియందు, భూమి అడుగున నున్న నీళ్లయందు ఉండు ఏ వస్తువు యొక్క ప్రతిరూపముగాని, విగ్రహమునుగాని మీరు దర్శింపరాదు" (నిర్గమ 20:4). దేవుడు తన పేరును చెప్పుకొని, పూజింపమన్నారు: "నేను ప్రభుడను, అది నా పేరు. నేను నా మహిమను మరియొకరికి ఈయను, నాకు ముట్టవలసిన స్తుతి విగ్రహములకు దక్కరాదు (యెషయా 42:8).

## 4. బాహ్యంగా దేవున్ని పూజించటం

దేవున్ని ఎలా పూజించాలి? ఏ రీతిలో పూజిస్తే సరియైన పూజ అవుతుంది అని చాలాసార్లు ఎందరో వాదనలు చేసుకుంటారు. బాహ్యంగా పూజించుట ఉత్తమమా లేదా అంతరంగికంగానా? మన దృక్పథము సరిగ్గా ఉండి చేసేది దేవునికే, అయితే దేవునికి మాత్రమే చెందాలి అని ఆలోచన చేస్తే బాహ్యంగా పూజలు చేసినా, అంతరంగికంగా పూజించినను సరిగ్గానే ఉంటుంది.

అందుకే పౌలుగారు కొరింతీయులకు వ్రాసిన లేఖలో ఇలా అంటున్నారు: "నీవు తినినను, త్రాగినను, ఏమి చేసినను దానిని అంతటిని దేవుని మహిమ

కొరకై చేయుడు (1 కొరింతీ 10:31). ఇలా బాహ్యాచర్యల ద్వారా దేవున్ని పూజించవచ్చును:

**ఎ) నాట్యం ద్వారా**

దావీదు రాజు యాజకులు ధరించు నారబట్ట తాల్చి యావే ముందు తన్మయుడై నాట్యమాడెను (2 సమూవేలు 6:14). అదే విధంగా కీర్తన కూడ ఈ విషయాన్ని తెలుపుతుంది, "వారు నాట్యము చేయుచు అతని నామమును స్తుతింతురుగాక! మృదంగములతో, తంత్రివాద్యములతో అతనిని కీర్తింతురుగాక" (కీర్తన 149:3).

**బి) శిరస్సు వంచి**

"రండు, శిరము వంచి అతనిని ఆరాధింతము. మనలను సృజించిన ప్రభువు ముందట మోకరిల్లుదము" (కీర్తన 95:6).

**సి) వాయిద్యాలతో**

"తంత్రీ వాద్యముతో ప్రభువును స్తుతింపుడు, దశతంత్రుల స్వరమండలముతో అతనిని కీర్తింపుడు. ప్రభువునకు నూత్నగీతము పాడుడు. నేర్పుతో వాద్యము మీటుచూ అతనికి జేకొట్టుడు" (కీర్తన 33:2,3)

**డి) చప్పట్లతో**

"నిఖిల జాతులారా! చప్పట్లు కొట్టుడు, జయజయ నాదములతో ప్రభువును కీర్తింపుడు" (కీర్తన 47:1).

**ఇ) చేతులెత్తి**

"నేను జీవించియున్నంత కాలము నిన్ను స్తుతింతును. నీకు చేతులెత్తి ప్రార్థన చేసెదను" (కీర్తన 63:4).

ఈ విధంగా త్యాగక్రియల ద్వారా, పరిశుద్ధ గ్రంథం పఠించడం ద్వారా, అర్చన ఆరాధన దినములను పాటించడం ద్వారా, తేరులో పాల్గొనడం ద్వారా, పుణ్యక్షేత్రాలను సందర్శించడం ద్వారా, పరిశుద్ధ మనుషులకు, వస్తువులకు గౌరవమివ్వటం ద్వారా దేవున్ని బాహ్యంగా పూజిస్తున్నాము.

## 5. హృదయాంతరంగంలో దేవున్ని పూజించుట

చాలామంది మౌనంగా, హృదయంలో, మనస్సులో ప్రార్థిస్తే సరియైనదని వాదిస్తారు. హృదయాంతరంగ భక్తే, బాహ్యభక్తీ, పూజలూ అవసరమే. బాహ్యభక్తి విధానం. విశ్వాస సంఘాన్ని ఒకే క్రమంలో, పద్ధతిలో ప్రార్థించేలా, పూజించేలా చేస్తుంది. ఈ అంతరంగికంగా పూజించటం ద్వారా మానవుడు వ్యక్తిగతంగా భక్తిలో, విశ్వాసంలో పరిణతి చెందుతారు.

యోహాను ఇలా అంటున్నారు "దేవుడు ఆత్మస్వరూపి కనుక ఆయనను ఆరాధించువారు ఆత్మయందును, సత్యమందును ఆరాధింపవలయును" అని యేసు చెప్పెను (యోహాను 4:24). అదే ప్రకారం సామెతల గ్రంథం చక్కగా చెప్తుంది. "ప్రభువు దుష్టుని బలిని అసహ్యించుకొనును, సజ్జనుని ప్రార్థన వలన ప్రీతి చెందును" (సామెతలు 15:8). "దుష్టుడు అర్పించు బలి భగవంతుడు అసహ్యించుకొనును. దుష్టవాంఛలతో అర్పించినదానిని చీదరించుకొనును" (సామెతలు 21:27).

మంచి క్రియల ద్వారా నైతిక కార్యాల ద్వారా దైవచిత్తానుసారంగా జీవించటం ద్వారా దేవున్ని పరోక్షంగా అంతరంగికమందు పూజిస్తాము. మరి ప్రత్యేకంగా ఎప్పుడైతే మనం మౌనంగా ప్రార్థిస్తామో, ధ్యానిస్తామో, దేవుని యెడల మనోచింతన కలిగియుంటామో, అప్పుడు మనం అంతరంగికమందు దేవున్ని పూజించినట్లు. మనము సలిపే పూజ సేవగా మారాలి, మనం చేసే సేవా, పూజగా మారాలి.

## 6. నిజమైన దేవునికి సరియైన పూజ, భక్తిపూర్వక గౌరవం

నిజమైన దేవునికి సరియైన రీతిలో భక్తికార్యాలు సలిపితే అది పూజించుటము అవుతుంది. అదే సరియైన రీతిలో పూజించకపోతే అది అపవిత్రీకరణ అవుతుంది. అదే నిజమైన దేవునికి చేయకపోతే, అది విగ్రహారాధన లేక వస్తు ఆరాధన అవుతుంది.

ఒక పర్యాయం సైతాను క్రీస్తుప్రభువును శోధిస్తూ ఇలా అన్నది. "నీవు సాష్టాంగపడి నన్ను ఆరాధించిన యెడల నీకు ఈ సమస్తమును ఇచ్చెదను" అని అనెను. అప్పుడు ప్రభు ఇలా మండిపడ్డారు, "సైతానూ! పొమ్ము" ప్రభువైన నీ

దేవుని ఆరాధింపుము. ఆయనను మాత్రమే సేవింపుము” (మత్తయి 4:9-10). అంటే నిజమైన దేవున్ని సరియైన రీతిలో పూజిస్తే, ఆ భక్తిభావం సేవగా మారుతుంది. మనకు చక్కని ఉదాహరణ యెహోషువా ఒక్కసారి తన సైనికులను, సైన్యాధికారులతో “మీరు యావేను పూజింపనొల్లనిచో” మరియెవరిని పూజింపగోరుదురో నేడు నిర్ణయించుకొనుడు” అని అన్నారు. ఇలా అని యెహోషువ “నేను నా కుటుంబము మాత్రము యావేనే ఆరాధింతుము” అని చెప్పారు. (యెహోషువ 24:15). మనం కూడా నిజమైన దేవునికి సరియైన రీతిలో పూజలు చేస్తూ వాటిని సుకృత క్రియలుగా మార్చుకొని, ఒకవైపు దేవున్ని నిండుగా సంపూర్ణంగా ప్రేమిస్తూ, మరోవైపు మానవునికి నిస్వార్ధ సేవలు అందించాలి.

**ముగింపు**

మానవుడు, ఇంకో మానవుడు సృష్టించిన భయాందోళనతో కూడిన పూజా విధానానికి బానిస అవుతున్నాడు. తనలో ఎంత అల్పమైన విశ్వాసం ఉందో చెప్పుకొనే తన భయం ద్వారా, ఇతర మూఢనమ్మకాలను ఆశ్రయించుట ద్వారా తెలియజేస్తున్నారు. దేవున్నే పూజించాలి కాని దేవుడు చేసిన వస్తువులను కాదు, జీవులను కాదు. మానవుడు చేసిన విధానాలను కాదు. ఎన్ని ఇక్కట్లు వచ్చినా, సమస్యలు ఉన్నా, నిజదేవున్నే పూజించాలి. ఈ మూఢనమ్మకాలను ఆశ్రయించటం ద్వారా పాపాన్ని కట్టుకుంటున్నాము. మనం ఇతర మానవుని చేతుల్లో కీలుబొమ్మలవుతాము. ఇంకా జీవితం దుర్భరం అవుతుంది. కాబట్టి నిజదేవున్ని, సరియైన రీతిలో పూజించి, జీవితాన్ని సార్థకం చేసుకుందాము.

❊ ❊ ❊ ❊

# చివరగా నా మాట

"............ఇంద్రజాలికులను, విగ్రహారాధకులను, అసత్య వాదులకును గంధకయుక్తమైన అగ్ని గుండమే తగిన స్థలము" (దర్శన 21:8). ప్రియపాఠకులారా! ఈ సంపుటిలో మనం ఎన్నో భయాందోళనకు గురిచేసే అంశాలను చదివాము. మనిషి యొక్క అజ్ఞానాన్ని, నిస్సహాయతను, నిరాశతో అశ్రాయించే భక్తిని సొమ్ము చేసుకునేవారు ఎందరో! ఇలాంటివారు మూఢనమ్మకాలకు మంత్రవిద్యకు బానిసలు కాకుండా, వాళ్ల చేతుల్లో కీలు బొమ్మలు కాకుండా  నిరోధించటానికే ఈ ప్రయత్నం. దీనికంటే ముఖ్య ఉద్దేశ్యం, ఈ సంపుటి ద్వారా మనిషిని నిజమైన భక్తిలో నడపటం, నైతిక విలువల ప్రకారం జీవింపచేయటం, మనో స్థైర్యాన్ని ఇవ్వటం, మనిషిని ప్రగతి బాటలో నడపటం.

బైబుల్ గ్రంథం చెప్పునట్లుగా, "మూఢనమ్మకాలను పాటించువారు, మాంత్రిక శక్తులను ఆశ్రయించువారు దేవుని రాజ్యమునకు వారసులు కారు" (గలతీ 5:19-21). అదే ప్రకారం మీకా 5:12, "మీ మంత్ర విద్యను, మీ సోదేకాండ్రను రూపుమాపుదును" అని తెలుపుతుంది. ఇంకా రెండవ రాజుల గ్రంథం 21:6, "మాంత్రికులతో శకునములు చెప్పించుకొనెవారు, జ్యోతిష్కులను భూత వైద్యులను సంప్రదించేవారు ప్రభునకు గిట్టని దుష్కార్యములు చేసి అతని కోపమును రెచ్చగొట్టెను" అని తెలియజేస్తుంది. ఇంకా లేవీయకాండము 19:31, "చచ్చినవారితో సఖ్య సంబంధములు పెట్టుకొను మాంత్రికులను సంప్రదింపకుడు. అట్లు చేయుదురేని మీరు అశుచిమంతులు అగుదురు", అని తెలుపుతుంది. ఇలా మూఢ నమ్మకాలను నడిపేవారు, ప్రోత్సహింపేవారు, ఇంకా ఆశ్రయించేవారు దేవుని రాజ్యాన్ని, దేవుని వాత్సల్యాన్ని కోల్పోతారని దృఢంగా తెలియజేస్తుంది.

కొందరు, నేను దేవునికి సన్నిహితున్ని, దైవకార్యాలు చేస్తున్నానని, దైవానుగ్రహముతో చలగాటలాడేవారు కూడా ఉన్నారు. కొందరు తాము పవిత్రంగ ఉండకుండా, అపవిత్రాత్మలను వెల్లగొట్టాలని, భూతోచ్చాటన చెయ్యాలని పూనుకుంటారు. అలాంటివారు తెలుసుకోవలసిన విషయం : దేవుని అనుగ్రహాలతో చలగాటం ఆడరాదు.

ఈ సంపుటిలో ఉన్న అంశాలు పూర్తి జ్ఞానం ఇవ్వకపోయినా, అవి మనిషిని నిజమైన దేవున్ని, నిండు భక్తి, విశ్వాసంతో పూజించేలా ఉపయోగపడుతాయి, మూఢ విశ్వాసం నుండి దూరం చేస్తాయని నా భావన, నా ప్రార్థన, నా విశ్వాసం.

**- ఫాదర్ కొమ్మారెడ్డి లూర్దు మర్రెడ్డి**





బల్లిశాస్త్రం ప్రకారం
బల్లి మన ఏయే శరీర భాగాల
మీద పడితే ఏమవుతుంది ?















**భక్త యోహాను ప్రచురణలు**

భక్త యోహాను ప్రాంతీయ గురువిద్యాలయం
రామాంతపురం, హైదరాబాదు-500 013.
ఫోన్ : 040-27201427, 27200370
e-mail : stjohnshyd2@gmail.com
www.stjohnseminaryhyd.org

*Holycrossprinters 9848145417*